తెలంగాణలో పడకేసిన ఐటీ!

భారీగా తగ్గిన ఎగుమతులు, కొత్త ఉద్యోగాలు

2022-23లో 57 వేల కోట్ల ఎగుమతులు..


1,27,594 నూతన కొలువులు



2023-24లో 27 వేల కోట్లకే ఎగుమతులు పరిమితం

40 వేలకు దిగజారిన కొత్త ఉద్యోగాలు

ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడి



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఆకాశమే హద్దుగా పరుగులుపెట్టిన ఐటీ, ఐటీ ఆధారిత రంగాల దూకుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీగా తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలే ఇందుకు నిదర్శనం. బీఆర్ఎస్ పాలనలో నిరుడు అంటే 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.57,706 కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయి. అదే సమయంలో 1,27,594 కొత్త ఉద్యోగాల కల్పన జరిగింది. 2023-24లో ఐటీ ఎగుమతుల విలువ రూ.26,948 కోట్లకే పరిమితమైంది. కొత్త ఉద్యోగాలు కేవలం 40,285గా నమోదైంది. గత సంవత్సరంతో పోలిస్తే, ఇది చాలా తక్కువ.

కరోనా సంక్షోభంలో కంటే దిగువకు

2022-23లో ఐటీ, ఐటీ ఆధారిత సేవల ఎగుమతుల్లో వృద్ధిరేటు 31.4% నమోదు కాగా, 2023-24లో అది 11.2 శాతానికే పరిమితమైనట్టు ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. కరోనా సమయంలో 2020-21లో తెలంగాణ 13% వృద్ధిరేటును నమోదు చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2023-24లో ఐటీ ఎగుమతుల వృద్ధిరేటు కరోనా ఏడాది నమోదైన వృద్ధిరేటు కంటే దిగువకు పడిపోవడం గమనార్హం.

ఆర్థిక ప్రగతిపై ప్రభావం పడకుండా చర్యలు తీసుకోండి: కేటీఆర్



తెలంగాణలో ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల కల్పన క్షీణించడంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆందోళన వ్యక్తంచేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల్లో క్షీణతకు సంబంధించిన గణంకాలను తాజాగా ఆయన ట్వీట్ చేశారు. ఐటీ ఎగుమతులు రూ.57,706 కోట్ల నుంచి రూ.26,948 కోట్లకు దిగజారడం, కొత్త ఉద్యోగాల కల్పన 1,27,594 నుంచి 40,285కి పడిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.గత ఆరేడేండ్లలో తెలంగాణలో ఐటీ ప్రగతి గణనీయంగా పెరిగేందుకు గత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నదని కేటీఆర్ గుర్తు చేశారు. సింగిల్ విండో విధానం, టీఎస్ ఐపాస్, ఐటీ రంగానికి సంబంధించి ప్రభుత్వ పాలసీల కారణంగా అత్యంత వేగంగా హైదరాబాద్‌లో ఐటీ రంగం అభివృద్ధి చెందిందని వివరించారు. హైదరాబాద్‌ను దేశానికి ఐటీ కేంద్రంగా చేసేందుకు ఎంతో కృషి చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీ రంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్థిక ప్రగతికి ఐటీ రంగం పురోగతి ఎంతో మేలు చేసిందని గుర్తు చేశారు. ఐటీ రంగాన్ని పట్టించుకోకపోతే రాష్ట్రం ఆర్థికంగా, ఉపాధి కల్పన పరంగా నష్టపోయే పరిస్థితి ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఐటీతోపాటు ఐటీఈఎస్ రంగాలకు ప్రాముఖ్యం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐటీ రంగం పుంజుకోవాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించాలని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్ కంపెనీలకు అన్ని విధాలుగా మద్దతు ఇచ్చి ఐటీ రంగానికి ఉపయోగపడే విధానాలు కొనసాగించాలని సలహా ఇచ్చారు. ఐటీ సంస్థలు మరిన్ని పెరగాలంటే ఎప్పటికప్పుడు మౌలిక సదుపాయాలను పెంచుతూనే శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వానికి సూచించారు. ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం నిరంతరం దృష్టి పెట్టాలని కోరారు.



దేశీయ మార్కెట్లోకి టాటా మోటర్స్ సరికొత్త 'కర్వ్.ఈవీని ప్రవేశపెట్టింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ధర రూ.17.49 లక్షల నుంచి రూ.21.99 లక్షల లోపున్నది. సింగిల్ చార్జింగ్‌తో 45 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 502 కిలోమీటర్లు, 55 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 585 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

సింఫనీ లాభం 88 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 7: కూలర్ల తయారీ సంస్థ సింఫనీ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో పన్నులు చెల్లించిన తర్వాత రూ.88 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అలాగే కంపెనీ ఆదాయం రూ.302 కోట్ల నుంచి 76 శాతం వృద్ధితో రూ.531 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ(కార్పొరేట్ వ్యవహారాలు) నృపేశ్ షా మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా కూలర్లకు డిమాండ్ అధికంగా ఉండటం వల్లనే గత త్రైమాసికంలో అంచనాలకు మించి రాణించినట్లు చెప్పారు.

సింగరేణి ఆకర్షణీయం

హైదరాబాద్, ఆగస్టు 7: సింగరేణి ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను స్టాండలోన్ ప్రతిపాదికన పన్నులు చెల్లించిన తర్వాత రూ.495.98 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది వచ్చిన రూ.331.02 కోట్ల కంటే ఇది 49.83 శాతం అధికం. అలాగే కంపెనీ మొత్తం ఆదాయం రూ.2,689.65 కోట్ల నుంచి రూ.2,901.53 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. గత త్రైమాసికంలో సంస్థ 28.46 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది.

మైక్రోసాఫ్ట్‌పైనే మోజు

- **దేశంలో అత్యధిక ఉద్యోగులు మెచ్చిన బ్రాండ్ ఇదే: రాండ్‌స్టడ్ సర్వే**

న్యూఢిల్లీ, ఆగస్టు 7: దేశంలో అత్యంత ఆకర్షణీయ కంపెనీగా బహుళజాతి టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ నిలిచింది. ఈ ఏడాదికిగాను తాజాగా విడుదల చేసిన రాండ్‌స్టడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రిసెర్చ్ (ఆర్ఈబీఆర్)లో మైక్రోసాఫ్ట్‌ను ఎక్కువమంది ఉద్యోగులు ఇష్టపడ్డారు మరి. భారతీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రెండో స్థానంలో ఉండగా.. ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మూడో స్థానంలో స్థిరపడింది. ప్రధానంగా ఆర్థిక స్థితి, పేరు, కెరియర్ ఉన్నతికి ఉన్న అవకాశాలే ఆధారంగా ఈ సర్వే జరిగింది. ఇందులో మైక్రోసాఫ్ట్‌కు అత్యధిక స్కోర్ వచ్చినట్టు రాండ్‌స్టడ్ తెలియజేసింది. కాగా, ఈ స్వతంత్ర సర్వేలో దాదాపు 1,73,000 మంది పాల్గొన్నారు. ఇందులో భారత్‌కు చెందినవారు 3,507 మంది. 6,084 కంపెనీలపై సర్వే చేపట్టారు.

టాప్-10 ఆకర్షణీయ సంస్థలు

ర్యాంక్	సంస్థ
1	మైక్రోసాఫ్ట్
2	టీసీఎస్
3	అమెజాన్
4	టాటా పవర్
5	టాటా మోటర్స్
6	సామ్‌సంగ్
7	ఇన్ఫోసిస్
8	ఎల్అండ్‌టీ
9	రిలయన్స్ ఇండస్ట్రీస్
10	మెర్సిడెస్-బెంజ్

రంగాలవారీగా..

రంగాలవారీగా చూస్తే 77 శాతం మంది ఉద్యోగులు.. దేశీయ ఆటో రంగంలో కొలువుల్ని అందిపుచ్చుకోవాలని చూస్తున్నారు. ఆ తర్వాత ఐటీ, కమ్యూనికేషన్, టెలికం, ఐటీ అనుబంధ రంగాలు (76 శాతం), ఎఫ్ఎంసీజీ, డ్యూరబుల్స్, రిటైల్, ఈ-కామర్స్ రంగాలు (75 శాతం), బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా, కన్సల్టింగ్ రంగాలు (74 శాతం) ఉన్నాయి. ఇక ఉద్యోగ-వ్యక్తిగత జీవితాల్లో సమతూకం, సమానత్వం, ఆకర్షణీయ వేతనం, ఇతరత్రా ప్రయోజనాలకు ఉద్యోగాల్లో చేరేటప్పుడు దేశీయ ఉద్యోగులు మిక్కిలి ప్రాధాన్యాన్ని ఇస్తున్నారని రాండ్‌స్టడ్ ఇండియా ఎండీ, సీఈవో విశ్వనాథ్ పీఎస్ తెలిపారు.

ఫోగాట్.. నువ్వెప్పటికీ చాంపియనే



ఫోగాట్‌కు మద్దతుగా విపక్ష ఎంపీల నినాదాలు

- **రెజ్లర్‌కు పార్టీలకతీతంగా మద్దతు**

న్యూఢిల్లీ, ఆగస్టు 7: పారిస్ ఒలింపిక్స్‌లో పతకం ఖాయమైన దిశలో అనూహ్య రీతితో అనర్హతకు గురైన రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు పార్టీలకు అతీతంగా మద్దతు లభిస్తున్నది. వినేశ్‌కు మద్దతుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ట్వీట్ చేశారు. వినేశ్ అనర్హత వేటుకు గురైనప్పటికీ 140 కోట్ల మంది గుండెల్లో మాత్రం విజేతగా నిలుస్తారని, పారిస్ ఒలింపిక్స్‌లో ఆమె అసాధారణ ఆటతీరు ప్రతి భారతీయుని ఆకట్టుకుందని, దేశం గర్వించేలా చేసిందని ముర్ము పేర్కొన్నారు. వినేశ్ విజేతల్లోకెల్లా విజేత అని, దేశానికి ఆమె గర్వకారణమని, ప్రతి భారతీయుడికి స్ఫూర్తి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు సైతం వినేశ్ ఫోగాట్‌కు మద్దతు తెలుపుతూ ట్వీట్లు చేశారు.

పార్లమెంటులో విపక్షాల ఆందోళన

వినేశ్ ఫోగాట్ అనర్హతలో కుట్రకోణం ఉండొచ్చని, ఆమెకు న్యాయం చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. రాజ్యసభలో ఈ అంశంపై చర్చకు కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే పట్టుబట్టగా, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అనుమతించలేదు. అనంతరం పార్లమెంటు ఉభయసభల నుంచి ఇండియా కూటమి సభ్యులు వాకౌట్ చేశారు. పార్లమెంటు ప్రాంగణంలో నిరసన చేపట్టారు. వినేశ్ ఫోగాట్‌పై కుట్రలు ఆపండి, వినేశ్‌కు న్యాయం జరగాలి అంటూ నినాదాలు చేశారు. వినేశ్ విషయమై లోక్‌సభలో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ స్పందిస్తూ... యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్(యూడబ్ల్యూడబ్ల్యూ) వద్ద ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ గట్టిగా నిరసన తెలిపిందని చెప్పారు. ఈ విషయమై సరైన చర్యలు చేపట్టాలని ఐఓఏ చీఫ్ పీటీ ఉషకు ప్రధాని మోదీ సూచించినట్టు చెప్పారు.



పరమానందయ్య శిష్యుల బ్రిడ్జి!

పాట్నా: పొలాల మధ్య దిష్టిబొమ్మలా నిర్మించిన బ్రిడ్జిలోని చిన్న భాగం బీహార్‌లో స్థానికులను వెక్కిరిస్తూ ఉంది. రెండు వైపులా వెళ్లడానికి అనుసంధానిస్తూ రోడ్డు మార్గం లేదు. స్థల సేకరణ చేయలేదు. అలాంటప్పుడు పొలం మధ్యలో ఆ కాసింత ముక్క బ్రిడ్జిని పరమానందయ్య శిష్యుల్లా ఎందుకు నిర్మించారు? అంటే అధికారుల నుంచి సమాధానం లేదు. వివరాల్లోకి వెళితే.. బీహార్‌లోని అరారియాలోని పరమానందపూర్‌లో దీనిని నిర్మించారు. సీఎం గ్రామీణ సడక్ కింద మూడు కోట్లతో నిర్మాణాన్ని ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేశారు. ఇక్కడి నది వల్ల వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులను తీర్చడానికి మూడు కోట్లతో మూడు కిలోమీటర్ల రోడ్‌ను అనుసంధానం చేస్తూ బ్రిడ్జి నిర్మించడానికి అధికారులు నిర్ణయించారు. అయితే, భూసేకరణ చేయకుండా మధ్యలోనే పనులను నిలిపివేశారు.

రష్యా భూభాగంలోకి ఉక్రెయిన్ బలగాలు

- **కీవ్‌పై వ్లాదిమిర్ పుతిన్ ఆరోపణ**
- **కాల్పులకు పాల్పడిందని వెల్లడి**

మాస్కో, ఆగస్టు 7: ఉక్రెయిన్ బలగాలు సరిహద్దు దాటి తమ భూభాగంలోకి వచ్చాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. ఉక్రెయిన్ మిస్సైళ్లు సహా వేర్వేరు ఆయుధాలతో నివాస భవనాలు, అంబులెన్సులపై దాడికి పాల్పడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. కర్స్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ సైన్య ప్రవేశించినట్టు రష్యా రక్షణ శాఖ సైతం ఆరోపించింది. రెండేళ్లుగా ఇరు దేశాల మధ్య సాగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ తమ భూభాగంలోకి ప్రవేశించిందని రష్యా ఆరోపించడం ఇదే మొదటిసారి. సడ్జా పట్టణం వద్ద ఒకేసారి ఉపరితలం, వాయు మార్గాల్లో ఉక్రెయిన్ దాడికి పాల్పడినట్టు రష్యా అధికారవర్గాలు చెప్తున్నాయి. అయితే, ఇంకా రష్యా భూభాగంలోనే ఉక్రెయిన్ సైన్యం ఉందా అనే అంశంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా, ఉక్రెయిన్ కూడా ఈ విషయంపై స్పందించలేదు.

ట్రంప్ హత్యకు పాకిస్థానీ కుట్ర

వాషింగ్టన్, ఆగస్టు 7: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మరో ఇద్దరు రిపబ్లికన్ నేతలను హత్య చేయడానికి జరిగిన కుట్రను ఎఫ్‌బీఐ భగ్నం చేసింది. తమ దేశ నేతలను కిరాయి వ్యక్తులతో హత్య చేయడానికి కుట్ర జరిగిందని, దీని వెనుక ఇరాన్ హస్తం ఉందని ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఈ కుట్రకు సంబంధించిన ఒక పాకిస్థాన్ దేశస్థుడిని అరెస్ట్ చేసినట్టు యూఎస్ జస్టిస్ డిపార్ట్‌మెంట్ మంగళవారం వెల్లడించింది.

అమెరికా జాతీయ పక్షి 'బాల్డ్ ఈగల్'

240 ఏండ్ల తర్వాత ఖరారు



వాషింగ్టన్, ఆగస్టు 7: అమెరికా జాతీయ పక్షిగా 'బాల్డ్ ఈగల్'ను గుర్తిస్తూ ఆ దేశ సెనెట్ కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు 240 ఏండ్లుగా ఈ పక్షిని అమెరికాలో అధికార చిహ్నంగా వాడుతున్నా, జాతీయ పక్షి హోదా మాత్రం ఇప్పటివరకు దక్కలేదు. రెండు వందల ఏండ్లకుపైగా ఎదురుచూపులకు ముగింపు పలుకుతూ, సెనెట్ (పార్లమెంట్ ఎగువసభ) జాతీయ పక్షిని తాజాగా ఖరారు చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు ఎట్టకేలకు ఆమోదం లభించింది. మిన్నెసోటా డెమొక్రాట్ ఎమి క్లోబుచర్ బిల్లును ప్రతిపాదించగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. 'గత 240 ఏండ్లుగా అమెరికా విలువలకు 'బాల్డ్ ఈగల్' ఒక చిహ్నంగా నిలిచింది. ఇన్నేండ్లకు జాతీయ పక్షిగా గుర్తింపు లభించింది' అని సెనెటర్ ల్యూమిస్ అన్నారు. అమెరికా ఏర్పడినప్పుడు ఆ దేశ రూపకర్తలు 'బాల్డ్ ఈగల్'నే గుర్తుగా ఎంచుకున్నారు. 1940లో ఈ పక్షుల్ని వేటాడటంపై నిషేధం విధించారు.

ఉత్తరాదిలో అడుగంటిన భూగర్భ జలాలు

ఎన్‌జీఆర్ఐ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): ఉత్తర భారతంలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయి. ఎన్జీఆర్ఐతోపాటు పలు పరిశోధన సంస్థలు చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఏటా 1.5 సెంటీమీటర్ల వర్షపాతం తగ్గుతుండగా.. దీని ప్రభావం భూగర్భ జలాలపై పడుతున్నదని తేల్చారు. వ్యవసాయ అవసరాల కోసం విపరీతంగా భూగర్భ జలాలను తోడేయటం కూడా ఓ కారణమని వెల్లడించారు. 1951 నుంచి 2021 వరకు శాటిలైట్ డాటా, హైడ్రోలాజికల్ మాడల్ విధానంలో సేకరించిన డాటాను విశ్లేషించి భూగర్భ జలాలను లెక్కించారు. 2002-2021 నాటికే సుమారు 450 క్యూబిక్ కిలోమీటర్ల పరిమాణంలో నీటిని కోల్పోయినట్లుగా తేల్చారు.

మరిన్ని వార్తలు
ntnews.com లో
చూడగలరు

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

గురువారం THURSDAY 8.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4

సంపుటి (Volume): 14 ॥ సంచిక (Issue): 64 ॥ వెల (Price) రూ.6.50

గురువారం, సూర్యోదయం: 5-57, సూర్యాస్తమయం: 6-46. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: చవితి రాత్రి 12-37 వరకు. నక్షత్రం: ఉత్తరఫల్గుణి రాత్రి 11-34 వరకు. వర్జ్యం: లేదు. రాహుకాలం: పగలు 1-57 నుంచిపగలు 3-33 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-13 నుంచి ఉదయం 11-04 వరకు, తదుపరి పగలు 3-20 నుంచి సాయంత్రం 4-11 వరకు. అమృతకాలం: పగలు 3-26 నుంచి సాయంత్రం 5-15 వరకు.

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..





భారత్‌కు బరువైన బాధ

భారత స్టార్ రెజ్లర్‌పై అనర్హత వేటు

- 100 గ్రాముల బరువు తేడాతో ఫైనల్‌కు దూరం
- అనూహ్యంగా ముగిసిన ఫోగాట్ పతక పోరాటం
- ఐవోసీ నిర్ణయంతో నివ్వెరపోయిన క్రీడాలోకం
- వినేశ్ ఫోగాట్‌కు దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన మద్దతు

బుధవారం ఉదయం దేశ క్రీడాభిమానులను ఒక చేదువార్త పలుకరించింది. కొన్ని గంటల్లో పారిస్ గడ్డపై భారతపతాకాన్ని సగర్వంగా రెపరెపలాడిస్తుందనుకున్న స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ పతక ఆశలు ఆవిరైన వార్తతో భారత క్రీడాలోకం నిరాశకు లోనైంది. అసలు ఏం జరిగిందో తెలుసుకునేలోపే ఫోగాట్‌పై అనర్హత వేటు అంటూ పారిస్ నుంచి వార్త రానే వచ్చింది. మహిళల 50కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో నిర్దేశిత బరువు కంటే కేవలం 100 గ్రాములు అధికంగా ఉండటం వినేశ్ అనర్హతకు ప్రధాన కారణమైంది.

వినేశ్.. పోరాట పటిమ మెండుగా ఉన్న హీరో! లైంగిక వేధింపులకు ఎదురొడ్డి ఢిల్లీ వీధుల్లో నిరసనకు దిగినా.. విశ్వక్రీడల్లో ఎదురైన ప్రత్యర్థినల్లా మట్టికరిపించినా.. ఆమె ఓ చాంపియన్! అవమానాలు ఆశయాలకు అడ్డుకట్ట వేయలేవని నిరూపించిన ధీర! 'శభాష్.. వినేశ్! నువ్వో రోల్‌మాడల్! దేశానికి నువ్వే ఓ మెడల్' అంటూ లక్షలాది హృదయాలు ఫోగాట్‌కు అండగా నిలుస్తున్నాయి. .. వివరాలు ఆటలో

తెలంగాణలో మన బిడ్డలే స్థానికేతరులా?

లోకల్ పాలసీ ఏది?

- విద్యార్థులు, తల్లిదండ్రులకు జీవో 33 అశనిపాతం
- సొంత విధానాన్ని రూపొందించలేని దుస్థితిలో సర్కారు
- బయటి రాష్ట్రంలో ఇంటర్ చదివితే స్థానికత వర్తించదా?
- నియామకాల్లో స్థానికత నిర్ధారించిన బీఆర్‌ఎస్ సర్కారు
- 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే దక్కేలా చర్యలు
- 'ఉమ్మడి' నిబంధనతో 'విద్య'లో నిర్ధారించలేకపోయాం
- 2014 తర్వాత నెలకొల్పిన కాలేజీల్లో మన బిడ్డలకు లబ్ధి
- గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన
- అఖిలపక్షాన్ని పిలవండి.. సలహాలు ఇస్తాం: హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్థానికతను నిర్ధారించుకోలేక విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వ పాలన గుడ్డెద్దు చేలోపడ్డట్టు, గాలిలో దీపం పెట్టినట్టు సాగుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. జీవో 33 విద్యార్థులు, తల్లిదండ్రుల పాలిట అశనిపాతంగా మారిందని, తెలంగాణ బిడ్డలే స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలోని విద్యాలయాల్లో ప్రవేశాలకు విభజన చట్టం ప్రకారం 2024 జూన్ 2 దాకా పాత పద్ధతే కొనసాగించాల్సి వచ్చిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంగా పదేండ్లు ముగిసినందున తెలంగాణ స్థానికతను నిర్ధారించుకోవాల్సి ఉన్నదని అన్నారు. ఇంటర్‌తోపాటు మెడికల్, ఇంజినీరింగ్, అగ్రికల్చర్, లా.. ఇలా అన్ని స్థాయిలు, అన్ని విద్యాలయాల్లో అడ్మిషన్లకు సొంత విధానాన్ని రూపొందించుకోవాల్సి వచ్చినా.. దురదృష్టవశాత్తు ప్రభుత్వం ఆ పనిచేయలేదని విమర్శించారు. స్థానికత విషయంలో కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు సొంత విధానాలు రూపొందించుకున్నాయని.. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి › 3వ పేజీలో

విలీనం కేవలం దుష్ప్రచారం



చట్టపరంగా చర్యలు తీసుకుంటాం › 3



సుంకిశాల ప్రాజెక్టులో ఈ నెల ఒకటిన సాగర్ నీళ్ల ధాటికి కుప్పకూలుతున్న రక్షణగోడ

నిలువునా విరిగిపడ్డ సుంకిశాల గోడ

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- క్షణాల్లో జల దిగ్బంధమైన పంప్‌హౌస్
- కూలీలకు వరమైన షిప్టు మారే సమయం
- అరగంట తేడా జరిగితే భారీ ప్రాణనష్టమే!
- వారం రోజులుగా దాచిపెట్టిన జలమండలి

ఒళ్లు గగుర్పొడిచే వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

- గేటును తన్నుకొని ఉవ్వెత్తున దూసుకొచ్చిన సాగర్ జలాలు
- ఈ నెల ఒకటిన ఘటన జరిగినా గుట్టుగా ఉంచిన జలమండలి
- ఎండాకాలంలో సాగర్ నీటిమట్టం తగ్గే దాకా నిలిచిపోనున్న పనులు

(గుండాల కృష్ణ)

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ జలాశయం డెడ్‌స్టోరేజీ ఆధారంగా హైదరాబాద్‌కు కృష్ణాజలాల తరలింపు కోసం చేపట్టిన సుంకిశాల పథకంలో పెను ప్రమాదం తప్పింది. పథకంలో భాగంగా సొరంగాల్లోకి సాగర్ జలాలు రాకుండా ఉండేందుకు రక్షణగా నిర్మించిన కాంక్రీట్ గోడ (రిటెయినింగ్ వాల్) ఒక్కసారిగా కుప్పకూలడంతో సుంకిశాల పంపుహౌస్ నీట మునిగింది. నిత్యం వందమందికిపైగా కూలీలు పని చేసే ఆ ప్రదేశం కండ్ల ముందే క్షణాల్లో జలదిగ్బంధమైంది. ఇక్కడ మూడు షిఫ్టుల్లో వందల మంది కూలీలు పనిచేస్తుంటారు. సరిగ్గా కూలీలు షిఫ్టు మారే సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. ఈ నెల ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకు ఈ ఘటన చోటుచేసుకున్నప్పటికీ, జలమండలి అధికారులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. అరగంట ముందు... అర గంట తర్వాతగానీ ఈ ప్రమాదం జరిగి ఉంటే భారీగా ప్రాణ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చేదని ప్రత్యక్షసాక్షులు భయంభయంగా చెప్తున్నారు. నాగార్జునసాగర్‌కు లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటం, నీటిమట్టం కూడా భారీగా ఉన్న సమయంలో రక్షణ గోడ వెనక గేటును ఏర్పాటు చేసి... సొరంగాన్ని › 5వ పేజీలో



ఖమ్మం జిల్లాలో మరో రైతు బలవన్మరణం

నెలరోజుల్లో ఐదుగురి ఆత్మహత్యాయత్నం › 10

2017 టీఆర్టీ ఫలితాలు విడుదల

- కొనసాగుతున్న 'కేసీఆర్ కొలువుల' భర్తీ
- నాడు కోర్టు కేసులతో నిలిచిన ఫలితాలు
- తాజాగా ప్రకటించిన టీజీపీఎస్సీ
- ఇదే బాటలో జేఎల్, గ్రూప్-4, డీఏవో, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులు › 10

ఈడీ.. ఏందిది?

- 5 వేల కేసులకు.. రుజువైనవి కేవలం 40 కేసులేనా?
- దర్యాప్తు మెరుగు పడాల్సిన అవసరం ఎంతో ఉన్నది › 7
- మౌఖిక సాక్ష్యాలు కాదు.. శాస్త్రీయ ఆధారాలు కావాలి
- ఈడీ కేసుల దర్యాప్తు తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

తమ్ముడి పెట్టుబడి.. అన్న అగ్రిమెంట్



సోదరుల దందాలకే అమెరికా పర్యటన!

- ఇప్పటిదాకా బోగస్ కంపెనీలు.. ఇప్పుడు రేవంత్ కుటుంబ కంపెనీలు వస్తున్నయ్
- 15 రోజుల క్రితం ఏర్పాటైన స్వచ్ఛ్‌బయోకు వెయ్యి కోట్ల ఒప్పందం చేసుకొనే సీన్ లేదు
- మా ఆరోపణలపై సీఎం రేవంత్ స్పందించాలి
- బోగస్ ఒప్పందాలపై కోర్టుకెళ్తాం:క్రిశాంక్ › 2

ఆ ముగ్గురి బంధమిది



- 'స్వచ్ఛ్‌బయో'తో రేవంత్ డీల్ గుట్టు రట్టు.. ఒప్పందం 'స్వచ్ఛ్ బయోగ్రీన్'తోనే
- ముఖ్యమంత్రి రేవంత్ తమ్ముడు జగదీశ్వర్ రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న కంపెనీ ఇదే
- అగ్రిమెంట్ సమయంలో వాటాదారు హర్ష పసునూరి కూడా అమెరికాలోనే
- విమర్శలు వస్తాయనే.. అసంపూర్ణంగా కంపెనీ పేరు ప్రకటించిన సీఎంవో
- సుగనిత్ బయోతో ముందే డీల్ కుదుర్చుకొన్న స్వచ్ఛ్ బయోగ్రీన్ సంస్థ

స్వచ్ఛ్‌బయో సంస్థ వాటాదారు హర్ష పసునూరి, ప్రవీణ్ పరిపాటితో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్) రేవంత్ సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): కట్టు కథ కంచికి చేరింది. అనుమానాలు పటాపంచలు అయ్యాయి. లోగుట్టు రట్టయ్యింది. తమ్ముడి కంపెనీ పెట్టుబడుల కోసం అన్న చేసుకొన్న అగ్రిమెంట్ బాగోతం బయటపడింది. తెలంగాణలో రూ.వెయ్యి కోట్లతో బయో ఫ్యూయల్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు న్యూయార్క్‌లో రేవంత్ బృందం 'స్వచ్ఛ బయో' అనే కంపెనీతో సోమవారం ఒప్పందం చేసుకొన్నది. అయితే, › 2వ పేజీలో



మల్లన్నసాగర్‌పై నాలుక మడత

- నాడు భూకంపమన్నరు.. నేడు బ్రహ్మాండమట!
- 50 టీఎంసీలతో ఉపద్రవమని అప్పట్లో గగ్గోలు
- హైదరాబాద్ తాగునీటికి ఇదే దిక్కు అంటూ జీవో
- ఏది నిజమో కాంగ్రెస్ చెప్పాలంటున్న ప్రజలు
- పైప్‌లైన్ పొడిగింపుపై ఆరోపణల వెల్లువ › 6

తుంగతుర్తి రైతుల కాళేశ్వర యాత్ర

సాగునీళ్ల కోసం శ్రీరాంసాగర్ దాకా పయనం



ఎస్సారెస్పీ వద్ద సూర్యాపేట జిల్లా తుంగతుర్తి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, ఆగస్టు 7: ఎక్కడ సూర్యాపేట.. ఎక్కడ శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్. సాగునీటి కోసం రైతులు ఇక్కడి దాకా వచ్చారంటే వానకాలం పంటల విషయంలో రైతులు ఎంత దీనస్థితిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం బండరామారం గ్రామానికి చెందిన పదిమంది రైతులు వారి గ్రామానికి సాగునీరు రావడం లేదని రెండు వాహనాల్లో మంగళవారం బయలుదేరారు. కాళేశ్వరం, అన్నారం బరాజ్, మేడిగడ్డ పంప్‌హౌస్ వద్దకు వెళ్లారు. నీటిని ఎందుకు వదలట్లేదని అక్కడి వారిని ప్రశ్నిస్తే 'ఇసుక టెండర్ వేసింర్రు. ఇసుక తీసినంక వాటర్ పంపిస్తమని' బదులిచ్చారు. దీంతో బుధవారం శ్రీరాంసాగర్ › 5వ పేజీలో



అమెరికాలో బుధవారం వరల్డ్ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్‌పాల్‌సింగ్ బంగాను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతి కుమారి

బాబు బాటలో రేవంత్

మళ్లీ తెరపైకి ప్రపంచబ్యాంక్

- వరల్డ్ బ్యాంక్ అధికారులతో సీఎం చర్చలు
- దానితో కలిసి పనిచేస్తామంటూ ప్రకటన
- తెలంగాణ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ తెస్తరట!

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): ప్రపంచబ్యాంకుతో తెలంగాణ ప్రభుత్వం కలిసి పనిచేయనున్నది. తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికల్లో భాగస్వామి అయ్యేందుకు ప్రపంచ బ్యాంకు సంసిద్ధతను వ్యక్తంచేసింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం వాషింగ్టన్‌లో ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు, భారత సంతతికి చెందిన అజయ్‌పాల్‌సింగ్ బంగాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై దాదాపు గంటసేపు చర్చలు జరిపారు. రాష్ట్రంలో చేపట్టే వివిధ ప్రాజెక్టులకు కలిసికట్టుగా రోడ్‌మ్యాపు రూపొందించాలని నిర్ణయించారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు ప్రపంచబ్యాంకుతో ఒప్పందం చేసుకున్నారు. పెద్ద ఎత్తున రుణాలు కూడా పొందారు. ఇప్పుడు బాబు సహచరుడిగా చెప్పుకొనే రేవంత్‌రెడ్డి ఆయన బాటలోనే నడుస్తున్నారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ ఏ నాడూ ప్రపంచబ్యాంకు నుంచి ఎలాంటి రుణాలు తీసుకోలేదు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రపంచబ్యాంకు నుంచి రుణం పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వరల్డ్‌బ్యాంకు అధ్యక్షుడితో సమావేశమయ్యారు. ప్రధానంగా స్కిల్ డెవలప్‌మెంట్, రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు, నెట్ జీరో సిటీ, ఆరోగ్య సంరక్షణ, డయాగ్నస్టిక్స్, హెల్త్‌ప్రొఫైల్ రంగాల్లో భాగస్వామ్యానికి అవసరమైన › 2వ పేజీలో

పాస్‌పోర్టు పోతే 10 రోజుల్లో మరొకటి


మాట్లాడుతున్న పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ

కొత్త పాస్ పోర్టును పొందడం సులభమే

- **పాత పాస్‌పోర్ట్ వివరాలు లేకున్నా చింతించాల్సిన అవసరం లేదు**
- **బ్రోకర్లను ఆశ్రయించి మోసపోవద్దు**
- **సందేహాలుంటే ఆర్‌పీవోకి మెయిల్ చేయొచ్చు**
- **'నమస్తే తెలంగాణ'తో హైదరాబాద్ రీజినల్**
- **పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): మీ పాస్‌పోర్టు పోయిందా? అయితే పది రోజుల్లోపే మీకు కొత్త పాస్‌పోర్టు జారీ అవుతుంది. పాస్‌పోర్టు పోగానే చాలా మంది ఆందోళన చెందుతుంటారు. కొత్త పాస్‌పోర్టు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక సతమతమవుతుంటారు. తీరా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడగానే బ్రోకర్లను ఆశ్రయించి రూ.వేలల్లో నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో పాస్‌పోర్టును పోగొట్టుకున్నవారు తిరిగి కొత్త పాస్‌పోర్టును ఎలా పొందాలన్న విషయాన్ని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ 'నమస్తే తెలంగాణ'కు వివరించారు.

ఇలా పొందొచ్చు..

పాస్‌పోర్టును పొగొట్టుకున్న వాళ్లు తొలుత మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుని, పాత పాస్‌పోర్టు వివరాలను అందజేయాల్సి ఉంటుంది. అనంతరం ఆ వివరాలు మీ-సేవ కేంద్రం నుంచి స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుతాయి. వాటిని పోలీసులు పరిశీలించి, అప్రూవల్ ఇస్తారు. అనంతరం మీ-సేవ కేంద్రం నుంచి 'మిస్సింగ్/లాస్ట్ సర్టిఫికెట్' జారీ అవుతుంది. ఆ సర్టిఫికెట్‌ను పొందాక స్లాట్ బుక్ చేసుకుని, రీఇష్యూ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. స్లాట్ రోజున ఎంపిక చేసుకున్న పీఎస్‌కే కేంద్రానికి హాజరై.. సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు మీ-సేవ కేంద్రం నుంచి జారీ అయిన 'మిస్సింగ్/లాస్ట్ అక్‌నాలెడ్జ్‌మెంట్ సర్టిఫికెట్‌ను చూపించాలి. ఆ ప్రక్రియ పూర్తయ్యాక 7-10 రోజుల్లోపు కొత్త పాస్‌పోర్ట్ జారీ అవుతుంది. కానీ, పాస్‌పోర్టులను పోగొట్టుకున్న కొందరు తమ వద్ద ఎలాంటి వివరాలు లేవని, కనీసం పాత పాస్‌పోర్టు నంబర్, జిరాక్స్ కాపీలు కూడా లేవని చెప్తుంటారు. అలాంటివారు కొత్త పాస్‌పోర్టును పొందాలంటే నేరుగా ఆర్‌పీఓ కార్యాలయంలో హాజరై ఇతర గుర్తింపు కార్డు వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. ఆ వివరాల ఆధారంగా పాస్‌పోర్ట్ డాటాబేస్‌లో పరిశీలించి పాత పాస్‌పోర్టు వివరాలను అందజేస్తారు. వాటి ఆధారంగా మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం మీ-సేవ నుంచి పాస్‌పోర్ట్ మిస్సింగ్/లాస్ట్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. దాని ఆధారంగా పాస్‌పోర్ట్ రీఇష్యూకు దరఖాస్తు చేసుకుని కొత్త పాస్‌పోర్టును పొందవచ్చని లేదా పాస్‌పోర్టు పోయిందని rpo. hyderabad @mea.gov.inకు మెయిల్ చేసి సూచనలు పొందొచ్చని జొన్నలగడ్డ స్నేహజ వివరించారు.

కేంద్ర సర్వీసుల్లో 16 లక్షల ఖాళీలు

- **వెంటనే భర్తీ చేయాలి**
- **ఢిల్లీలో బీసీ సంఘాల ధర్నాలో ఎంపీ ఆర్ కృష్ణయ్య**

హైదరాబాద్, ఆగస్టు7 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వశాఖలు, ప్రభుత్వరంగ సంస్థల్లో 16 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, వాటన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని 72 ప్రభుత్వ శాఖలు, 245 ప్రభుత్వరంగ సంస్థల్లోనే ఈ ఖాళీలు ఉన్నాయని ఉన్నాయని తెలిపారు. ప్రమోషన్లలో కూడా బీసీలకు రిజర్వేషన్లను అమలు చేయాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని కోరారు. ఢిల్లీలోని ఆంధ్రాభవన్ ఎదుట బీసీ ఉద్యోగులు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ధర్నానుద్దేశించి ఆర్ కృష్ణయ్య మాట్లాడారు. చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టే అంశంపై బీజేపీ తన విధాన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, భరత్ కుమార్, మల్లేశ్, వెంకటేశ్,హనుమంత్, వేముల రామకృష్ణ, పద్మలత, వంశీకృష్ణ, సతీశ్, సురేశ్, ఉదయ్, మురళి, కిరణ్, రాఘవేంద్ర శివ, రాందేవ్, జయంతి పాల్గొన్నారు.

బలి కోరుతున్న భూతగాదాలు

- **నేలతల్లిని వీడలేక.. నేలకొరుగుతున్న రైతులు**
- **గోడు వెళ్లబోసుకుంటూ సెల్ఫీ వీడియోలు**
- **నెల వ్యవధిలోనే ఖమ్మం జిల్లాలో ఐదుగురి ఆత్మాహత్యాయత్నం**
- **దవాఖానలో చికిత్స పొందుతూ ఇద్దరి మృతి**


చికిత్స పొందుతూ మృతిచెందిన ఖమ్మం జిల్లా చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన బోజెడ్ల భద్రయ్య(ఫైల్)

ఖమ్మం, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): భూ తగాదాలు రైతుల బలి కోరుతున్నాయి. గోడు వినే నాథుడు లేక.. కష్టాలు తీర్చే నాయకుడు కనిపించక దిక్కుతోచనిస్థితిలో క్షణికావేశంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కుటుంబసభ్యులను రోడ్డున పడేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలోనే ఖమ్మం జిల్లాలో ఐదుగురు రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. వీరిలో దురదృష్టవశాత్తు ఇద్దరు రైతులు మృతిచెందగా.. మిగిలిన ముగ్గురు రైతులు చికిత్స తర్వాత కోలుకున్నారు.

- జూలై 1 తేదీన ఖమ్మం జిల్లా చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన బోజెడ్ల భద్రయ్య సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాంగ్రెస్ నాయకులు తన భూమిని చెరువు శిఖంలో కలిపివేశారని, సరిహద్దులు దున్నేశారని వీడియోలో ఆరోపించారు.
- జూలై 4న కారేపల్లి మండలం ఆలియాతండాకు చెందిన రైతు పచ్చిపాల భద్రయ్య తన భూమిని ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్‌నాయక్ కబ్జా చేశారని పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స తర్వాత కోలుకున్నాడు.
- జూలై 8న ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన మేడి సీతయ్య తన భూమిలో పని చేసేందుకు వెళ్లగా కొందరు వ్యక్తులు అడ్డుకున్నారని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స తర్వాత కోలుకున్నాడు.
- జూలై 9న రఘునాథపల్లి మండలం రజబ్ అలీనగర్‌కు చెందిన రైతు ప్రసాద్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందిన అనంతరం క్షేమంగా ఉన్నాడు. పోడు సాగు చేసుకుంటున్న సుమారు ఆరున్నర ఎకరాల భూమిని కానిస్టేబుల్ లక్ష్మణ్ తన కూతురు లావణ్య పేరుపై పట్టా చేసుకున్నాడని ప్రసాద్ ఆరోపణ.
- ఆగస్టు 4న ఖమ్మం రూరల్ మండలం జాన్‌బాద్‌తండాకు చెందిన రైతు ఏలేటి వెంకటరెడ్డి (46) తన భూమిని జాటోత్ వీరన్న ట్రాక్టర్‌తో దున్నుతున్నాడని మనస్తాపంతో సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు దవాఖానలో చిక్సిత పొందుతూ బుధవారం మృతి చెందాడు.2021లో ఇదే భూ వివాదంలో వెంకటరెడ్డి సోదరుడు భూపాల్‌రెడ్డి కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. అన్నాతమ్ముళ్లు భూ తగాదాలతో మరణించడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదం నెలకొన్నది.

రైతులు అధైర్యపడవద్దు

ఖమ్మం జిల్లాలో ఒక్క నెలలోనే ఐదుగురు రైతులు ఆత్మహత్యలకు ప్రయత్నించడం, ఇద్దరు మరణించడం తీవ్రమైన విషయం. ముగ్గురు మంత్రులున్న జిల్లాలోనే రైతులకు ఈ దుస్థితి ఉంది. ఇది ఏమాత్రం క్షమార్హం కాదు. రైతులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం మాటలకు పరిమితమైంది. రైతేడ్చిన రాజ్యం బాగుపడదు. మరణించిన రైతు కుటుంబాలను ఆదుకోవాలి. రైతులు అధైర్యపడవద్దు. సమస్యలుంటే పోరాడి పరిష్కరించుకుందాం. సమస్యకు చావు పరిష్కార మార్గం కాదు.

- ఎక్స్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

ముగ్గురు మంత్రులున్నా భరోసా లేదాయె

జిల్లా, మండల కేంద్రాల్లో గ్రీవెన్స్(ప్రజావాణి)తోపాటు పోలీస్ కమిషనరేట్‌లోనూ అత్యధికంగా రైతు సమస్యలపైనే అర్జీలు అందుతున్నాయి.జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు మరో నలుగురు కార్పొరేషన్ చైర్మన్లు ఉన్నారు. అయినా జిల్లా రైతులు అభద్రతకు గురికావడం బాధ కలిగించే అంశం. ఒకవైపు రైతులను భూ తగాదాలు చుట్టుముడుతుండగా..మరోవైపు రుణమాఫీ కోసం వందలాది రైతులు నిత్యం సొసైటీలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా మంత్రులు జిల్లాలో రైతులకు అవసరమైన భరోసా కల్పించి.. రైతుల ప్రాణాలను కాపాడడంతోపాటు వారి సమస్యలకు చెక్ పెట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఏఐ

- **ప్రమాదాల నివారణకు ఏడీఏఎస్**
- **200 బస్సుల్లో పైలట్ ప్రాజెక్టు**

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ) : రోడ్డు ప్రమాదాల నివారణకు బస్సుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించాలని ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ది. ప్రమాదాలను గుర్తించి అలర్ట్ చేసే అడ్వాన్స్డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టం (ఏడీఏఎస్) అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్- విజయవాడ, హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారులపై ప్రయాణించే 200 బస్సుల్లో 2022 సెప్టెంబర్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఈ సిస్టంను అమర్చారు. 2023 - 24 మధ్య ఈ మూడు ఎన్‌హెచ్‌లపై ఆర్టీసీ బస్సు ప్రమాదాలు 40 శాతం తగ్గినట్టు గుర్తించారు. ఐఐఐటీ హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఐఎన్ఏఐ నేతృత్వంలో ప్రభుత్వం, ఇంటెల్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టుపై పనిచేస్తున్నాయి. ప్రమాదాల నివారణ కోసం పైలట్ ప్రాజెక్టు కింద ఇంటెల్ సంస్థకు చెందిన'మొబిల్ ఐ అడాస్' టెక్నాలజీ వినియోగిస్తున్నారు. ఈ టెక్నాలజీలో వాహనం విండ్‌షీల్డ్‌కు కెమెరా అమరుస్తారు. ఇది రహదారిని స్కాన్ చేసి ముందుగానే ప్రోగ్రామ్ చేసిన అల్గారిథమ్‌ను అనుసరించి దేనినైనా ఢీకొనే ప్రమాదం ఉందని పసిగడితే వెంటనే ఆడియో, వీడియో రూపంలో డ్రైవర్‌ను అల ర్ట్ చేస్తుంది. ఎలాంటి సిగ్నల్ లేకుండా ఉన్నలేన్ నుంచి పక్కలేన్‌లోకి వాహనం వెళ్లినా హెచ్చరికలు చేస్తుంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఈ టెక్నాలజీకి ఆమోదం తెలిపితే పూర్తిస్థాయి వినియోగానికి టెండర్లు ఆహ్వానించే అవకాశాలున్నాయి.

ఈఎస్‌ఐసీలో తొలి అవయవదానం

అమీర్‌పేట్, ఆగస్టు 7: ఈఎస్‌ఐసీ దవాఖానల్లో మొట్టమొదటి అవయవదానం జరిగిన హాస్పిటల్‌గా దేశంలోనే సనత్‌నగర్ ఈఎస్‌ఐసీ ఖ్యాతి గడించింది. కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన ఏ నర్సింగ్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సనత్‌నగర్ ఈఎస్‌ఐసీకి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ నర్సింగ్ రెండ్రోజుల క్రితం బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల అంగీకారం మేరకు జీవన్‌దాన్ బృందం ప్రతినిధులు నర్సింగ్ నుంచి రెండు కిడ్నీలు, కాలేయాన్ని స్వీకరించారు. ఓ కిడ్నీ, కాలేయాన్ని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించగా, మరో కిడ్నీని ఈఎస్‌ఐసీ సనత్‌నగర్‌లో మహిళకి అమర్చారు.కార్యక్రమంలో సర్జన్ల బృందం డాక్టర్ సందీప్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పాండురంగరావు, డాక్టర్ నాగార్జున, డాక్టర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

విజిలెన్స్ నివేదికల్లో జాప్యం తగదు

విజిలెన్స్ డీజీ సీవీ ఆనంద్

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ) : విజిలెన్స్ నివేదిక రూపకల్పనలో జాప్యం లేకుండా అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ సీవీ ఆనంద్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ కొత్త లోగోను ఆవిష్కరించారు. అనంతరం అన్ని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ల(ఆర్‌వీఈవో)పనితీరును సమీక్షించారు. ఆర్‌వీఈవో యూనిట్ల అధికార పరిధిపై చర్చించారు. డిఫాల్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆన్‌లైన్‌లో ఓడీ, డిప్యూటేషన్ దరఖాస్తులు

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని టీచర్లు, లెక్చరర్లు ఇకపై ఆన్‌డ్యూటీ(ఓడీ), డిప్యూటేషన్, స్పెషల్ బదిలీల కోసం ఎవరి వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇందుకోసం ప్రత్యేక ఆన్‌లైన్ వ్యవస్థను విద్యాశాఖ అందుబాటులోకి తీసుకురానున్నది. దరఖాస్తుల స్వీకరణకు ఈజీ యాప్, వెబ్‌పోర్టల్‌ను ప్రత్యేకంగా తయారుచేయిస్తున్నది. నేషనల్ ఇన్‌ఫర్మేటిక్స్ సెల్(ఎన్ఐసీ) ద్వారా ఇవి అందుబాటులోకి రానున్నాయి. ఓడీ, డిప్యూటేషన్ల మంజూరుకు ఇటీవలే ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రతి సంవత్సరం మే, ఆగస్టు, నవంబర్ మొదటి వారాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నది. నిబంధనల మేరకు వారికి రెండేండ్లు మించకుండా ఓడీ, డిప్యూటేషన్‌కు అవకాశం కల్పించనున్నారు.

ధాన్యం కొనుగోలుకు 17 మందితో కమిటీ

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ) : ధాన్యం కొనుగోలు నిబంధనల్లో మార్పులను సిఫారసు చేసేందుకు 17మందితో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. పౌరసరఫరాలశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రియాంకతోపాటు అదేశాఖ నుంచి మరో 11మంది, కార్పొరేషన్ నుంచి ఐదుగురు సభ్యులను నియమించింది.

ఉపాధి హామీ ఉద్యోగులకు బదిలీలు

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): ఉపాధి హామీ ఉద్యోగుల బదిలీ చేపట్టాలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్(ఎఫ్‌టీఈ)ను బదిలీలు చేయాలని నిర్ణయించింది. నాలుగేండ్లు ఒకే దగ్గర పనిచేసిన వారి వివరాలను పంపించాలని గ్రామీణాభివృద్ధి శాఖ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ మెంబర్ సెక్రటరీ రాజారావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.అర్హులైన వారి వివరాలు అందిన తరువాత బదిలీలు చేపట్టనున్నట్టుగా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు.

సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాల కమిటీ

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగుల బదిలీల మార్గదర్శకాల ఖరారుకు అధికారులతో కమిటీని నియమిస్తూ సెర్ప్ సీఈవో దివ్య రాజన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో ఐదుగురు సెర్ప్ డైరెక్టర్లు సీహెచ్ గోపాల్ రావు, సూర్యారావు, నవీన్ కుమార్, కాళీకాంతి, సునీతతో కమిటీని వేశారు. ఈ కమిటీకి 8 మంది సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమించారు. ఈ కమిటీ సమావేశమై ఉద్యోగుల బదిలీల మార్గదర్శకాలను ఖరారు చేసి సీఈవోకు నివేదిక ఇవ్వనున్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా బదిలీల మార్గదర్శకాలను ఖరారు చేయనున్నారు.

ఆలిండియా శ్రేష్ట ర్యాంకర్‌కు సీటు నిరాకరణ

- **ఏపీ నర్సాపురంలోని జేసికిలి స్కూల్ నిర్వాకం**
- **తెలంగాణ విద్యార్థికి ఆంధ్రప్రదేశ్‌లో అవమానం**

నర్సంపేట, ఆగస్టు 7: ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు చెందిన విద్యార్థికి అవమానం జరిగింది. ఆలిండియా స్థాయిలో శ్రేష్ట ర్యాంకు వచ్చినా నర్సాపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రవేశానికి నిరాకరించారు. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన సంపత్, స్వాతి దంపతుల కుమారుడు తేజు సంగెం మండలంలోని జ్యోతిరావు పూలే పాఠశాలలో ఎనిమిదో తరగతి పూర్తి చేశాడు. ఎస్సీ విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం, సామాజిక న్యాయ సాధికార మంత్రిత్వశాఖ 9, 11 తరగతుల్లో రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రవేశాల పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షలో తేజుకు శ్రేష్టలో 997వ ర్యాంకు వచ్చింది. స్కీమ్ ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హయ్యర్ క్లాసెస్ ఇన్ టార్గెటెడ్ ఏరియాస్(SHRESHTA-2024) ద్వారా కేంద్రం కొన్ని ప్రైవేట్ పాఠశాలలను ఎంపిక చేసి సీబీఎస్ఈ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యాబోధన అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్ నర్సాపురంలోని జే సికిలి పాఠశాలలో సీటు ఎంపిక చేసుకొని రెండు రోజుల క్రితం వెళ్లారు. తీరా వెళ్లాక టీసీ సరిగా లేదని, కొట్టివేతలు ఉన్నాయని జే సికిలి పాఠశాల నిర్వాహకులు తేజుకు సీటు నిరాకరించారు. విద్యార్థి తేజు సీటు కోసం తల్లి స్వాతి పోరాటమే చేస్తున్నది. రెండు రోజులుగా పాఠశాల వద్దే నిరసన తెలిపారు. టీచర్లు, నిర్వాహకులు, అటెండర్ల కాళ్లు మొక్కినా కనికరం చూపలేదని స్వాతి కన్నీటి పర్యంతమైంది.తల్లీ కొడుకును పోలీస్ స్టేషన్‌కు కూడా తీసుకెళ్లారు. విషయం తెలిసిన జనసేన నాయకుడు మేరుగు శివకోటి నర్సాపురం ఎమ్మెల్యే ములుకుంట్ల సాగర్ వద్దకు తీసుకెళ్లారు. వెంటనే తల్లి కొడుకుకు భోజనం పెట్టించి, స్కూల్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడినట్టు తెలిసింది.

నిబంధనలు ఉల్లంఘించినందునే ఏపీ క్యాబ్‌లను అడ్డుకున్నం

- **పన్ను కట్టకుండా ఇక్కడ ఎట్ల నడుపుతరు?**
- **ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ క్యాబ్ అసోసియేషన్స్ ఫైర్**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ) : 'ఉచిత బస్సు స్కీంతో గిరాకీ తగ్గి తెలంగాణ క్యాబ్ డ్రైవర్ల జీవితాలు అతలాకుతలమవుతుంటే ఇతర రాష్ట్రాల క్యాబ్‌లు ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ ఇక్కడి వారి ఉపాధిని దెబ్బకొట్టడం ఎంతవరకు సమంజసం?' అంటూ తెలంగాణ క్యాబ్ అసోసియేషన్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్, టీపీటీయూ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను మాత్రమే తాము అడ్డుకున్నామని చెప్పారు. 'తెలంగాణ క్యాబ్ డ్రైవర్లు ఏపీ డ్రైవర్ల వాహనాలను హైదరాబాద్‌లో తిరగనివ్వాలి' అని చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవణ్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ క్యాబ్ అసోసియేషన్స్ నాయకులు మండిపడ్డారు. మోటర్ వాహన చట్టం ప్రకారం ఇతర రాష్ట్రాల వాహనాలు అనుమతి లేకుండా ఇక్కడ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించరాదని క్యాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్‌కుమార్ తెలిపారు. వాహన పన్ను చెల్లిస్తూ గిరాకీ లేక ఇబ్బందులు పడుతున్నామని, ఎలాంటి పన్ను చెల్లించకుండా ఇతర రాష్ట్రాల వాహనాలు ఇక్కడ యాప్‌ల సహకారంతో రాకపోకలు సాగించడం నేరమని పేర్కొన్నారు. తెలంగాణ డ్రైవర్ల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ నెల 15న క్యాబ్‌ల బంద్‌కు వాళ్ల పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మద్దతు పలకడం కుట్రగానే భావిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని డిమాండ్ చేశారు. ఓలా, ఊబర్, ర్యాపిడో తదితర యాప్‌ల్లో ఇతర రాష్ట్రాల వాహనాలు ఇక్కడ వ్యాపా రం సాగిస్తున్నాయని, దీంతో ఇక్కడి డ్రైవ ర్లు ఉపాధి కోల్పోతున్నారని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణలో యాప్ అగ్రిగేటర్స్‌కు ప్రభుత్వం అనుమతే ఇవ్వలేదని, వైట్ నంబర్ ప్లేట్ స్థానంలో ఎల్లో నంబర్ ప్లేట్ పెట్టుకొని వాహనాలను అక్రమంగా తిప్పుతున్నారని చెప్పారు. అక్రమంగా తిరుగుతున్న వాహనాలపై రవా ణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో తెలంగాణ డ్రైవర్లంతా కలిసి నిరసనకు దిగినట్టు చెప్పారు. తమ పొట్ట కొడుతామంటే కచ్చితంగా వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

నాడు తప్పయితే.. నేడు ఒప్పెలా?

- **రేవంత్ సర్కారు తీరుపై ఉద్యోగవర్గాల మండిపాటు**
- **విశ్రాంత ఉద్యోగుల కొనసాగింపుపై అడ్డగోలు విమర్శలు**
- **నేడు అధికారంలోకి వచ్చాక అదేపనిగా ఎక్స్‌టెన్షన్లు**
- **ఇప్పటికే పలుశాఖల్లో రిటైర్డ్ అధికారుల కొనసాగింపు**
- **తాజాగా జలమండలిలో మరో అధికారికి గ్రీన్‌సిగ్నల్**



హైదరాబాద్, ఆగస్టు7 (నమస్తే తెలంగాణ): 'పదవీ విరమణ చేసిన ఐఏఎస్, పోలీస్ అధికారులను తిరిగి ప్రభుత్వంలో నియమించడం దారుణం. కేసీఆర్ ప్రభుత్వం తక్షణం ఇలాంటి అధికారులను తొలగించాలి. మేము దీనిపై అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. రిటైర్డ్ అధికారులను ప్రభుత్వం నుంచి తొలగించాలి' ఇదీ పీసీసీ అధ్యక్షుడిగా, మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్నపుడు 2020 జూన్ 25న రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్య. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఆ విధానాన్ని తీవ్రంగా తప్పుబట్టిన ఆయన ఇప్పుడు ముఖ్యమంత్రిగా అవే విధానాలను కొనసాగిస్తున్నారు. విరమణ పొందిన అధికారులనే నియమిస్తూ ద్వంద్వ వైఖరిని బయట పెట్టుకున్నారు. ఇప్పటికే పోలీస్, నీటిపారుదల శాఖల్లో పలువురిని నియమించగా, తాజాగా హైదరాబాద్ జలమండలిలోనూ మరో విశ్రాంత ఉద్యోగిని కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసి మాటలకు, చేతలకు ఏమాత్రం పొంతనలేదని రేవంత్‌రెడ్డి నిరూపించుకున్నారు. ఇదే విషయంపై ఉద్యోగవర్గాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

జలమండలిలో పదవీకాలం పొడిగిస్తూ ..

విరమణ పొందిన ఉద్యోగులను సత్వరమే తొలగిస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ సర్కార్ ఇప్పుడు ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ఇరిగేషన్ శాఖలో విరమణ పొందిన ఈఎన్సీతోపాటు, పదవీకాలం ముగిసిన ప్రభుత్వ సలహాదారుడిని తిరిగి యథావిధిగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన ఆదిత్యనాథ్‌దాస్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణకు తీసుకొచ్చింది. ఆ తర్వాత ఏకంగా తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారు పదవిని కట్టబెట్టింది.

మాటలు వేరు.. ఆచరణ వేరు

ప్రతిపక్షంలో ఉన్నపుడు రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపును విమర్శించిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఆయన కొనసాగించడంపై ఉద్యోగవర్గాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రిటైర్డ్ అయి ఓఎస్డీలుగా, ఇతర హోదాల్లో పనిచేస్తున్న వారిని తొలగిస్తున్నట్టు ప్రభుత్వ పెద్దలు మీడియాకు లీకులు ఇచ్చారు. ఇక రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రత్యేకంగా ఆదేశాలిచ్చి శాఖలవారీగా అలాంటి ఉద్యోగుల జాబితాలను తెప్పించుకున్నారు. ఆ తర్వాత ఆ జాబితా అటకెక్కడం అటుంచితే తాజాగా విరమణ పొందిన వారిని యథావిధిగా కొనసాగిస్తూ ప్రభుత్వం వరుసగా ఉత్తర్వులు ఇస్తూ పోవడం గమనార్హం. రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు ఏమాత్రం సంబంధం లేకుండా పోయిందని ఉద్యోగవర్గాలు నిప్పులు చెరుగుతున్నారు.

పలువురు రిటైర్డ్ అధికారులకు బాధ్యతలు

ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్య మే 31న ఉద్యోగ విరమణ పొందారు. ఆ వెంటనే ఆయనకే తిరిగి నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్‌గా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ బాధ్యతలను అప్పగించింది. సర్కారు వచ్చిన కొత్తలో రాష్ట్ర శాసనసభకు సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను సలహాదారు పదవిలో ప్రభుత్వం నియమించింది. తాజాగా హైదరాబాద్ జలమండలిలో ఈడీగా పనిచేస్తున్న ఈఎన్సీ డాక్టర్ ఎం సత్యనారాయణ పదవీకాలం ఇటీవలే ముగిసింది. అయినా ప్రభుత్వం తిరిగి యథావిధిగా ఆయననే కొనసాగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇలా సలహాదారుల పేరుతో, ఎక్స్‌టెన్షన్ల పేరుతో విశ్రాంత ఉద్యోగులను గతంలో మాదిరిగానే ప్రభుత్వం కొనసాగిస్తూ వరుసగా ఉత్తర్వులు జారీ చేస్తుండటంపై ఉద్యోగ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

2017 టీఆర్టీ ఫలితాలు విడుదల

కొనసాగుతున్న 'కేసీఆర్ కొలువుల' భర్తీ

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ) : టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో 'కేసీఆర్ కొలువుల' భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది. టీఆర్టీ - 2017 ఫలితాలను బుధవా రం టీజీపీఎస్సీ విడుదల చేసింది. కోర్టు కేసుల నుంచి మూడు స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ పోస్టులకు మోక్షం లభించింది. నోటిఫికేషన్‌లో రిలింక్విష్‌మెంట్ అమలు తర్వా త ఉన్న అభ్యర్థులను టీఆర్టీకి ఎంపిక చేసినట్టు టీజీపీఎస్సీ అధికారులు వెబ్‌నోట్ ద్వారా తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1392 అధ్యాపకుల పోస్టుల భర్తీ జరుగుతున్నది. ఏఈఈ పోస్టుల రాత పరీక్షల ఫలితాలు విడుదల చేసి, ఎంపికైన అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు 8039 గ్రూప్-4 పోస్టులు, 53 డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్లు (డీఏవో), 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తదితర 'కేసీఆర్ ఉద్యోగాల' భర్తీ ప్రక్రియ త్వరగా పూర్తిచేసేందుకు టీజీపీఎస్సీ ముందుకుపోతున్నది.

రాజ్యసభ సీటు రాష్ట్ర నేతలకేనా?

- **ఒక స్థానం ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల**
- **ఈ నెల 14 నుంచి నామినేషన్ దాఖలు**
- **కేకే రాజీనామాతో ఖాళీ అయిన సీటు**

రాజ్యసభ ఎన్నిక షెడ్యూల్

నామినేషన్ల ప్రారంభం	ఆగస్టు 14
నామినేషన్ల చివరి తేదీ	ఆగస్టు 21
నామినేషన్ల పరిశీలన	ఆగస్టు 22
నామినేషన్ల ఉపసంహరణ	ఆగస్టు 27
పోలింగ్	సెప్టెంబర్ 3

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతలకు ఇస్తున్నదా? తెలంగాణేతర నేతలకు కట్టబెట్టనున్నదా? అన్న విషయంపై చర్చ జరుగుతున్నది. రాజ్యసభ ఉపఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ సభ్యుడిగా కొనసాగిన కే కేశవరావు రాజీనామాతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ స్థానానికి ఎన్నికయ్యేవారు 2026 ఏప్రిల్ 9 వరకు కొనసాగనున్నారు. ఈ నెల 14 నుంచి 21 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఆగస్టు 27న ప్రకటిస్తారు. ఎన్నిక అవసరమైతే సెప్టెంబర్ 3న పోలింగ్ జరగనున్నది. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లను లెక్కిస్తారు. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న బలాబలాలను పరిశీలిస్తే ఈ స్థానాన్ని కాంగ్రెస్ దక్కించుకునేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన కేకేను తిరిగి రాజ్యసభకు పంపేది కష్టమేనని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేశవరావు స్థానంలో ఎవరిని పంపుతారన్నది ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు.

అభిషేక్ మను సింఘ్వీని పంపే యోచనలో కాంగ్రెస్

కాంగ్రెస్ అధిష్టానం మాత్రం పార్టీ సీనియర్లలో ఒకరిని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపే యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపిస్తారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. హిమాచల్‌ప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కేవలం ఒక ఓటుతో ఆయన రాజ్యసభకు ఎన్నిక కాలేకపోయారు. దీంతో సింఘ్వీని రాజ్యసభకు పంపించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నట్టుగా పార్టీ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ ఆలోచనపై తెలంగాణ వాదులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అర్థ గణాంకశాఖలో ఆంధ్రా అధికారుల తిష్ఠ!

- **న్యాయపోరాటం చేస్తామంటున్న హైకోర్టు న్యాయవాది**

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ (అర్థ గణాంకశాఖ) కార్యాలయంలో ఇప్పటికీ ఆంధ్రా అధికారుల పెత్తనమే సాగుతున్నదని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అందరికీ ఆన్ డిప్యూటేషన్ (ఓడీ) ఆప్షన్ ఇవ్వలేదని చెప్తున్నారు. ఫలితంగా ఆర్టికల్-14 అమలును తుంగలో తొక్కారని మండిపడుతున్నారు. ఖైరతాబాద్‌లోని తెలంగాణ గణాంకభవన్ నుంచి బదిలీ అయినప్పటికీ ఓడీ సౌకర్యంతో కొందరు ఆంధ్రా అధికారులు వ్యక్తిగత ప్రయోజనాలు పొందుతున్నట్టు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేండ్లు దాటినా నేటికీ తెలంగాణ గణాంక భవన్‌లో ఆంధ్రా అధికారులే ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు.బదిలీల ప్రయోజనం ఉద్యోగులందరికీ లభించడం లేదని ఇక్కడి ఉద్యోగులు వాపోతున్నారు. బదిలీల్లో ఉద్యోగులకు జరిగిన అన్యాయాన్ని హైకోర్టు న్యాయవాది సుధీర్‌కుమార్ అర్థ గణాంకశాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. షెడ్యూల్ ప్రకారం కచ్చితంగా బదిలీలు చేపట్టాలని, లేనిపక్షంలో హైకోర్టులో న్యాయపోరాటం చేస్తామని ఆయనకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

అన్నగారి జోరు..



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లో వెలసిన పోస్టర్లు

పెద్ద తమ్ముడి పేరు..



సీఎం రేవంత్ పెద్ద తమ్ముడు జగదీశ్వర్‌రెడ్డి

చిన్న తమ్ముడి హోరు..



ఆస్ట్రేలియాలోని సిడ్నీలో మేయర్ కుర్చీలో కూర్చున్న సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డి

లోకం పోకడ



అసలు పేర్లకంటే జనం ఇలాగే తొందరగా గుర్తుపడుతున్నారట మరి!

తమ్ముడి పెట్టుబడి.. అన్న అగ్రిమెంట్

మొదటిపేజీ తరువాయి...

రేవంత్ ప్రభుత్వం ఒప్పందం చేసుకొన్నది 'స్వచ్ఛ్ బయో'తో కాదు.. 'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్'తో అని ఎట్టకేలకు రుజువైంది. ఈ కంపెనీ డైరెక్టర్లలో ఒకరు రేవంత్ తమ్ముడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి. వాటాదారు రేవంత్‌కు సన్నిహితుడు హర్ష పసునూరి.



'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్'తో రేవంత్ ప్రభుత్వం ఒప్పందం.. ఫొటోలో కంపెనీ వాటాదారు హర్ష పసునూరి (మంత్రి శ్రీధర్‌బాబు పక్కన), సుగనిత్ సంస్థ ప్రెసిడెంట్ ప్రవీణ్ పరిపాటి

మీటింగ్‌లపై అపోహలు వద్దు: జయేశ్ రంజన్

తెలంగాణ అభివృద్ధికి దోహదపడే పెట్టుబడులను రాబట్టడంలో అమెరికా పర్యటన సజావుగా సాగుతున్నదని ఐటీ, పరిశ్రమలు శాఖల ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ చెప్పారు. అమెరికాలో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు, మీటింగ్‌లపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని, అయితే, అలాంటి అపోహలేమీ పెట్టుకోవద్దని తెలిపారు. పూర్తిగా పరిశీలించకుండా, సమీక్షించకుండా ఏ మీటింగ్‌ను కూడా నిర్వహించటం లేదని వివరించారు. రాష్ట్రానికి ఉపయోగపడుతుందని భావిస్తేనే తాము ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. గత పదేండ్లుగా రాష్ట్రం తరపున గ్లోబల్ లీడర్స్‌తో ఒప్పందాల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్న అనుభవం తనది అని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో వృత్తిపట్ల నిబద్ధత కలిగిన అధికారిగా తాను తెలంగాణ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు.

అసలేం జరిగింది?

తెలంగాణలో రూ.వెయ్యి కోట్లతో బయో ఫ్యూయెల్స్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు 'స్వచ్ఛ్ బయో' అనే కంపెనీ ముందుకొచ్చిందని, దీనికి సంబంధించి న్యూయార్క్‌లో ఒప్పందం కుదిరినట్టు సీఎం కార్యాలయం వెల్లడించింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో 'స్వచ్ఛ్ బయో' కంపెనీ చైర్మన్ ప్రవీణ్ పరిపాటి ఎంవోయూ కుదుర్చుకున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అయితే, 'స్వచ్ఛ్ బయో' కంపెనీతో రేవంత్ సర్కారు చేసుకొన్న ఒప్పందంపై అనుమానాలు వ్యక్తంచేస్తూ సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్‌గా మారాయి. సీఎంవో పేర్కొన్నట్టు 'స్వచ్ఛ్ బయో' అనే కంపెనీకి సంబంధించిన వెబ్‌సైట్ గానీ, సోషల్ మీడియా ఖాతాగానీ ఏదీ లేదు. ఈ కంపెనీ పేరుతో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌లో ఎటువంటి సంస్థ నమోదు కాలేదు. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖలో, కంపెనీస్ చెక్ వెబ్‌సైట్‌లో కూడా దీని వివరాలు లభించలేదు. ఇంకోవైపు.. సీఎంవో విడుదల చేసిన ప్రకటనలో స్వచ్ఛ్ బయో చైర్మన్‌గా ప్రవీణ్ పరిపాటి అని పేర్కొనగా.. అసలు ఆయన పేరుతో ఆ కంపెనీ లేకపోవటంతో అనుమానాలు పెరిగాయి.

మరి ఏ కంపెనీతో ఒప్పందం??

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. న్యూయార్క్‌లో రేవంత్ బృందం 'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్'తో ఒప్పందం కుదుర్చుకొన్నట్టు అర్థమవుతున్నది. ఈ కంపెనీని 2024 జూలై 21న హైదరాబాద్ కేంద్రంగా రిజిస్టర్ చేసినట్టు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వైబ్‌సైట్‌లో ఉన్నది. ఈ కంపెనీకి సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్ రెడ్డి, వేదపల్లి శివానందరెడ్డి ఇద్దరు డైరెక్టర్లుగా ఉన్నారు. మరికొందరికి వాటాలు ఉన్నాయి. కంపెనీ షేర్ క్యాపిటల్ రూ.10 లక్షలుగా చూపించారు. సీఎంవో ప్రకటన ప్రకారం.. 'స్వచ్ఛ్ బయో' కంపెనీ చైర్మన్‌గా పేర్కొన్న 'ప్రవీణ్ పరిపాటి' నిజానికి అమెరికాకు చెందిన శాస్త్రవేత్త. ఆయన 'సుజెయింట్' అనే బయోటెక్నాలజీ కంపెనీలో వాటాదారు. అలాగే సుగనిత్ బయో రెన్యువబుల్స్ కంపెనీకి ప్రెసిడెంట్‌గానూ వ్యవహరిస్తున్నారు. 'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్'కు చైర్మన్ ప్రవీణ్ పరిపాటి అన్న సమాచారం ఎక్కడా కనిపించలేదు. దీంతో ఆ కంపెనీకి ఆయన చైర్మన్ కాదన్న విషయం అర్థమవుతున్నది.

డీల్‌పై అనుమానాలు మొదలు


రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వైబ్‌సైట్ ప్రకారం.. 'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్' కేవలం 17 రోజుల కిందట ప్రారంభమైన కంపెనీ. దానిలో ఉద్యోగులు మొత్తం పది మంది కూడా లేరని తెలుస్తున్నది. కంపెనీ షేర్ క్యాపిటల్ రూ.10 లక్షలు. అలాంటి కంపెనీ తెలంగాణలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి ఎలా పెట్టగలదన్న సందేహాలు ఇప్పుడు సర్వత్రా పెరుగుతున్నాయి. దీనిపై వివరణ ఇవ్వాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నప్పటికీ సీఎం కార్యాలయం స్పందించకపోవటంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. 'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీగా రిజిస్టర్ కాకముందే అవుట్‌సోర్సింగ్ కార్యకలాపాల కోసం అంతర్జాతీయ భాగస్వామిగా సుగనిత్ బయో రెన్యువబుల్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొన్నది.

ఫొటో చెప్పిన నిజాలు ఇవీ..

న్యూయార్క్‌లో సీఎం రేవంత్ బృందం 'స్వచ్ఛ్ బయో' ప్రతినిధులతో చేసుకొన్న ఒప్పందానికి సంబంధించిన ఫొటోను సీఎంవో విడుదల చేసింది. ఆ ఫొటోలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, సుగనిత్ కంపెనీ ప్రెసిడెంట్ ప్రవీణ్ పరిపాటితో పాటు హర్ష పసునూరి కూడా ఉన్నారు. సీఎం నుంచి పత్రాలు అందుకొన్నది హర్ష పసునూరి. ఆయన.. రేవంత్‌కు, ఆయన సోదరుడు జగదీశ్వర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. 'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్' వాటాదారుల్లో ఒకరు. అందుకే, ఆయన ఈ ఫొటోలో ఉన్నట్టు తెలుస్తున్నది. దీన్నిబట్టి రేవంత్ ప్రభుత్వం తన తమ్ముడికి చెందిన కంపెనీ 'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్'తో డీల్ చేసుకొన్నట్టు రుజువైంది. జగదీశ్వర్‌రెడ్డికి ప్రతినిధిగా హర్ష పసునూరి ఈ ఒప్పందానికి హాజరైనట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, 'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్'కు మరో డైరెక్టర్ అయిన వేదపల్లి శివానందరెడ్డికి యూపీలో వైన్‌షాపులు, బార్లు ఉన్నట్టు సమాచారం. వివాదాస్పదమైన సోమ్ డిస్టిలరీస్ కంపెనీలో గతంలో ఆయనకు వాటాలు ఉన్నట్టు తెలుస్తున్నది. అయితే, ఆ తర్వాత ఆయన తన వాటాలను వెనక్కి తీసుకొన్నట్టు సమాచారం.

ఎందుకీ డ్రామా?

రాష్ట్రానికి పెట్టుబడులు రావటం లేదన్న ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి కొంతకాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆపసోపాలు పడుతున్నది. ఇందులో భాగంగానే పెట్టుబడుల కోసం అమెరికా పర్యటన కూడా చేపట్టింది. అయితే, పర్యటనలో పెద్ద కంపెనీలతో ఒప్పందాలు కుదరకపోవటంతో రేవంత్ ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు పెరుగుతున్నాయి. దీంతో 17 రోజుల కిందట ఏర్పాటు చేసిన తన తమ్ముడి కంపెనీకి లబ్ధి చేకూర్చడానికి, పెట్టుబడులు తీసుకొస్తున్నామని చెప్పుకోవడానికే ఈ డీల్ చేసుకొన్నట్టు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కంపెనీ పేరును అసంపూర్ణంగా పేర్కొనటం, వేరే కంపెనీ ప్రెసిడెంట్‌ను ఈ కంపెనీకి చైర్మన్‌గా వెల్లడించడం.. అసలు వాస్తవాలను పక్కదారి పట్టించడానికేనని అర్థమవుతున్నది.



JAGADEESHWAR REDDY ANUMULA

DIN: 10713496 | Status: Approved

Related Companies

CIN/FCRN	Company Name	Status
U11010TS2024PTC187711	SWACHH BIOGREEN PRIVATE LIMITED	Inactive for e-filing

Directors/Signatory Details

DIN/PAN	Name	Begin date
05230094	VEDAVALLI SHIVANANDA REDDY	21-07-2024
10713496	JAGADEESHWAR REDDY ANUMULA	21-07-2024

SWACHH BIOGREEN PRIVATE LIMITED FAQ's

What is the address for SWACHH BIOGREEN PRIVATE LIMITED ?

Who are the owners of SWACHH BIOGREEN PRIVATE LIMITED ?

What is the contact detail of SWACHH BIOGREEN PRIVATE LIMITED ?

When was SWACHH BIOGREEN PRIVATE LIMITED started ?

SWACHH BIOGREEN PRIVATE LIMITED

Financial Details & Insights

Contact Details & Insights

Other Details & Information

CIN	U11010TS2024PTC187711
Company Name	SWACHH BIOGREEN PRIVATE LIMITED
ROC Code	RoC-Hyderabad
Registration Number	187711
Company Category	Company limited by shares
Company SubCategory	Non-government company
Class of Company	Private
Authorised Capital(Rs)	1000000
Paid up Capital(Rs)	100000
Number of Members(Applicable in case of company without Share Capital)	
Date of Incorporation	21-07-2024
Registered Address	PLOT NO. 79 NAVANIRMAN NAGAR COLONY ROAD NO. 71 Jubilee Hills Hyderabad Telangana India 500033
Address other than R/o where all or any books of account and papers are maintained	-

SWACHH BIOGREEN PRIVATE LIMITED / U11010TS2024PTC187711

LAST UPDATED : 22-07-2024 | REQUEST UPDATE


SWACHH BIOGREEN PRIVATE LIMITED having CIN U11010TS2024PTC187711 is 16 days old Private company incorporated with MCA on 21st July, 2024. SWACHH BIOGREEN PRIVATE LIMITED is listed in the class of Private company and classified as Non-govt company. This company is registered at Registrar of Companies(ROC), RoC-Hyderabad with an Authorized Share Capital of ₹10,00,000 and paid-up capital is ₹1,00,000.

The company has 2 directors/key management personal VEDAVALLI SHIVANANDA REDDY, JAGADEESHWAR REDDY ANUMULA. SWACHH BIOGREEN PVT LTD company registration number is 187711 and its Corporate Identification Number(CIN) provided from MCA is U11010TS2024PTC187711

DETAILS OF INDIAN COMPANIES INCORPORATED BETWEEN 07-Jul-2024 TO 05-Aug-2024


CIN	COMPANY NAME	DATE OF INCORPORATION	STATE	ROC	CATEGORY	SUB CATEGORY
[illegible]	SHARMILA MEDICAL AND SURGICAL PRIVATE LIMITED	21-JUL-2024	Uttar Pradesh	ROC Kanpur	Company limited by shares	Non-government company
[illegible]	FAIRGROW TRADERS (OPC) PRIVATE LIMITED	21-JUL-2024	Andhra Pradesh	ROC Vijayawada	Company limited by shares	Non-government company
[illegible]	K J PANCHAL CONSULTANCY SERVICES PRIVATE LIMITED	21-JUL-2024	Gujarat	ROC Ahmedabad	Company limited by shares	Non-government company
[illegible]	SWACHH BIOGREEN PRIVATE LIMITED	21-JUL-2024	Telangana	ROC Hyderabad	Company limited by shares	Non-government company
[illegible]	MONTGOMERY SHIPPING PRIVATE LIMITED	21-JUL-2024	Tamil Nadu	ROC Chennai	Company limited by shares	Non-government company
[illegible]	HABITROO ARCHSPACE (OPC) PRIVATE LIMITED	21-JUL-2024	Maharashtra	ROC Mumbai	Company limited by shares	Non-government company

'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీ ఏర్పాటు తేదీ, డైరెక్టర్ల వివరాలు, షేర్ క్యాపిటల్ సమాచారం



Swacch BioGreen Pvt Ltd international outsourcing business partner, Suganit Biorenewables, has developed a patented and viable technology in producing biofuels and biochemicals from biomass and cellulose

'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్'తో సుగనిత్ కంపెనీ చేసుకొన్న డీల్ కాపీలో ఓ భాగం



సుగనిత్ కంపెనీలో ఓ శాస్త్రవేత్తతో ప్రవీణ్ పరిపాటి మంతనాలు

రాష్ట్రంలో రేవంత్ సోదరుల సామ్రాజ్యం

- రియల్టర్లను బెదిరించి అక్రమ వసూళ్లు
- రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహారాలు
- రేవంత్ సోదరుల నేతృత్వంలో 4 సంస్థలు
- ఆగడాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆగ్రహం




మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుల సామ్రాజ్యం సాగుతున్నదని, రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహారాలు నడుపుతున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో రేవంత్‌రెడ్డి కుటుంబపాలన సాగుతున్నదని మండిపడ్డారు. సోదరుడి అధికారాన్ని అడ్డంపెట్టుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఫైరయ్యారు. బుధవారం తెలంగాణభవన్‌లో బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి రాష్ట్ర అసెంబ్లీ కమిటీ హాలులో స్పీకర్ దగ్గర వేదికపై కూర్చొని వికారాబాద్ సమీక్షకు హాజరయ్యారని చెప్పారు. ఏ హోదాలో తిరుపతిరెడ్డి అధికారిక సమీక్షకు వెళ్లారని నిలదీశారు. కొడంగల్‌లో తిరుపతిరెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను పంచుతుంటే తమ పార్టీ జడ్పీటీసీ సభ్యుడు మహిపాల్ అడ్డుకున్నారని గుర్తుచేశారు. రేవంత్ మరో సోదరుడు కొండల్‌రెడ్డికి ఏ హోదా ఉన్నదని అధికారులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారు? అని ప్రశ్నించారు. అక్కడ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని పక్కన కూర్చోబెట్టుకుని మేయర్ సీటులో ఏ ప్రాతిపదికన కూర్చున్నారని మండిపడ్డారు. రేవంత్ ఇంకో సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి కాన్వాయ్‌లో పదుల సంఖ్యలో వాహనాలు ఉంటాయని, ఆయనకు టు ప్లస్ టు సెక్యూరిటీతో రాచమర్యాదలు చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి అన్నదమ్ములను రాష్ట్రంపై వదిలేశారని మండిపడ్డారు రేవంత్‌రెడ్డి అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఆయన సోదరులు మూడు నెలల్లోనే నాలుగు కంపెనీలు ఏర్పాటుచేశారని చెప్పారు. నాలుగు కంపెనీల్లో రేవంత్ సోదరులు డైరెక్టర్లుగా ఉన్నారని, వాటి వివరాలను మీడియాకు చూపించారు. వారు తమ మిత్రులతో కలిసి మరో 10–15 కంపెనీలు ఏర్పాటు చేశారని, వీటి వివరాలను త్వరలోనే అందిస్తానని చెప్పారు. రేవంత్ అమెరికా పర్యటనలో 'స్వచ్ఛ్ బయో'తో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకున్నదని, ఆ కంపెనీ రేవంత్ సోదరుడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డిదని, అది 15 రోజుల క్రితమే ఏర్పాటైందని విమర్శించారు. రేవంత్ సోదరులు రియల్టర్లను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఆ బ్లాక్‌మనీని ఈ కంపెనీల ద్వారానే వైట్‌గా మారుస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్, బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు, రాజేశ్‌నాయక్ పాల్గొన్నారు.

సోదరుల దందాలకే అమెరికా పర్యటన!

- ఇప్పటిదాకా బోగస్ కంపెనీలు.. ఇప్పుడు రేవంత్ కుటుంబ కంపెనీలు వస్తున్నయ్
- 15 రోజుల క్రితం ఏర్పాటైన స్వచ్ఛ్‌బయోకు వెయ్యి కోట్ల ఒప్పందం చేసుకొనే సీన్ లేదు
- మా ఆరోపణలపై సీఎం రేవంత్ స్పందించాలి
- బోగస్ ఒప్పందాలపై కోర్టులను ఆశ్రయిస్తాం
- బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ హెచ్చరిక



సీఎం రేవంత్‌తో, ఆయన సోదరుడితో హర్ష పసునూరి ఉన్న ఫొటోలను చూపుతున్న మన్నె క్రిశాంక్

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): తన సోదరుల దందాలను పెంచటం కోసమే 30 మంది బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లినట్టుగా ఉన్నదని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ విమర్శించారు. ఇప్పటిదాకా బోగస్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్న రేవంత్ సర్కారు.. ఇప్పుడు తన తమ్ముడి కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నదని మండిపడ్డారు. తెలంగాణలో రూ.1,000 కోట్లతో పెట్టుబడి పెడుతామన్న స్వచ్ఛ్ బయో కంపెనీ రేవంత్‌రెడ్డి తమ్ముడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డిది అని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను మీడియాకు చూపించారు. 'స్వచ్ఛ్ బయో కంపెనీ స్వచ్ఛంగా కనిపిస్తలేదు. ఇది తెలంగాణ ప్రజలను మోసం చేయటానికా? గొప్ప పనిచేస్తున్నామని చెప్పటానికా? తమ్ముళ్లను సెటిల్ చేయటానికా?' అని నిలదీశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో క్రిశాంక్ మాట్లాడుతూ.. సీఎం అమెరికా పర్యటన సందర్భంగా స్వచ్ఛ్ బయో కంపెనీతో రూ.1,000 కోట్ల ఒప్పందం చేసుకున్నట్టు మీడియాలో వార్తలు వచ్చాయని.. ఆ కంపెనీ రేవంత్‌రెడ్డి కుటుంబానిది అని తెలిపారు. ఈ కంపెనీలో మొదటి డైరెక్టర్ వేదవల్లి శివానందరెడ్డి, రెండో డైరెక్టర్ (రేవంత్ తమ్ముడు) ఎనుముల జగదీశ్వర్ రెడ్డి అని వెల్లడించారు. వేదవల్లి యూపీలో మెస్సే బార్ నడుపుతున్నారని, సీఎంతో ఎంవోయూ కుదుర్చుకున్నపుడు కంపెనీ ఇద్దరు డైరెక్టర్లు లేరని, హర్ష పసునూరి అనే వ్యక్తి సీఎం రేవంత్‌తోపాటు ఫొటోలో ఉన్నారని వివరించారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే హర్ష పసునూరి సీఎం సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి బినామీ అని తెలిపారు. తమ్ముడిని ఫొటోలో చూపించకుండా తమ్ముడి బినామీతో ఒప్పంద ఫొటోలు దిగారని విమర్శించారు. స్వచ్ఛ్ బయో కంపెనీ 15 రోజుల క్రితం (జూలైలో) ఏర్పాటైందని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ లేఖ ద్వారా తెలిసిందని బహిర్గతం చేశారు. ఆ కంపెనీకి రూ.1,000 కోట్ల ఒప్పందం కుదుర్చుకునేంత సీన్ లేదని స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర సంపదను తన సోదరులకు దోచిపెట్టే పనిలో ఉన్నారని మండిపడ్డారు. 'రేవంత్‌రెడ్డి 30 మంది సభ్యుల ముఠాతో అమెరికా వెళ్లింది తన సోదరుల వ్యాపారాలు పెంచడం కోసమేనా? బోగస్ కంపెనీలకు విలువైన తెలంగాణ భూములు కట్టబెట్టేందుకా అధికారం ఇచ్చింది? నీ తమ్ముడి కంపెనీతో వ్యాపారం చేయించటానికా సీఎం పదవి వచ్చింది? తమ్ముడి కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవడానికి సీఎం రేవంత్ యూఎస్ దాకా వెళ్లాలా?' అని నిలదీశారు. తమ ఆరోపణలపై సీఎం రేవంత్ స్పందించాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛ్ బయో ఒప్పందంపై కాంగ్రెస్ నాయకులు స్పందించాలని అన్నారు. బోగస్ కంపెనీలతో రేవంత్ ఒప్పందాలపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని తెలిపారు. రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు బోగస్ కంపెనీలని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని, తాము చెప్తున్నవన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉన్నవేనని, ఎవరైనా చెక్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

రేవంత్‌రెడ్డిది దండుపాళ్యం ముఠా

కేటీఆర్ యూఎస్ పర్యటన సందర్భంగా ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు కుదిరేవి.. ఇపుడు బోగస్ కంపెనీలు వస్తున్నాయని క్రిశాంక్ ఆరోపించారు. కుటుంబపాలన, దండుపాళ్యం ముఠా రేవంత్‌పాలనలో చెలరేగుతున్నాయని ధ్వజమెత్తారు.

పెట్టుబడుల పేరిట మోసం

షెల్ కంపెనీలతో స్కాంగ్రెస్ వ్యూహాలు

ఇది ప్రారంభం మాత్రమే..

ఇలాంటివి చాలా చేస్తారు : కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ) : పెట్టుబడుల పేరిట ప్రజలను మోసం చేసేందుకు షెల్ కంపెనీలతో స్కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బుధవారం ఎక్స్ వేదికగా బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ చేసిన పోస్టుపై కేటీఆర్ స్పందిస్తూ ఈ సంవత్సరం ప్రారంభంలో దావోస్‌లో జరిగిన కార్యక్రమంలో గోడి సంస్థ, తాజాగా స్వచ్ఛ బయో పేరుతో నెల క్రితమే రేవంత్‌రెడ్డి సోదరుడి కంపెనీ తెలంగాణలో పెట్టుబడుల పేరుతో ఒప్పందం చేసుకున్నాయని పేర్కొన్నారు. ఇలాంటివి చాలా చేస్తున్నారని, ఇవి ప్రారంభం మాత్రమేనని ఎద్దేవాచేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు క్రిశాంక్ ఇలాంటి వాటిని అద్భుతంగా వెలికితీశాడని కేటీఆర్ ప్రశంసించారు.

మళ్లీ తెరపైకి ప్రపంచబ్యాంక్

మొదటిపేజీ తరువాయి...

సంప్రదింపులు జరిగాయి. బృందంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ఉన్నతాధికారులు శేషాద్రి, విష్ణువర్ధన్‌రెడ్డి, అజిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పర్యటన: రామకృష్ణారావు

పెట్టుబడుల సాధనే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న తెలంగాణ బృందం పలు అంతర్జాతీయ సంస్థలతో ఫలవంతమైన సమావేశాలు నిర్వహిస్తున్నదని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికల పట్ల ప్రపంచబ్యాంకు సహా అనేక సంస్థలు రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ముందుకొస్తున్నాయని చెప్పారు. గ్లోబల్ కంపెనీలతో జరిగిన సమావేశాల్లో ప్రధానంగా విద్య, నైపుణ్యాభివృద్ధి, నెట్ జీరో సిటీ అభివృద్ధి, మూసీ ప్రక్షాళన, డిజిటల్ హెల్త్‌కార్డుల జారీ ప్రక్రియ తదితర అంశాలు చర్చకు వచ్చాయని ఆయన బుధవారం ఎక్స్ వేదికగా వివరించారు.

మల్టీనేషనల్ కంపెనీలతో చర్చలు: జయేశ్‌రంజన్

అమెరికాలో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందం మల్టీనేషనల్ కంపెనీలు, గ్లోబల్ లీడర్లు, ఇతర సంస్థలతో చర్చలు జరుపుతున్నదని ఐటీ, పరిశ్రమలశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ చెప్పారు. రెండు రోజుల పర్యటనలో విజయవంతంగా చర్చలు, ఒప్పందాలు జరిగాయని, మిగిలిన నాలుగు రోజుల పర్యటన కూడా ఫలవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే సంస్థలతోనే చర్చలు జరపుతున్నామని బుధవారం ఎక్స్ వేదికగా తెలిపారు. తెలంగాణలో ప్రచారం జరుగుతున్నట్టుగా రాష్ట్ర పరువు ప్రతిష్ఠలకు భంగం వాటిల్లే విధంగా ఎలాంటి చర్చలు జరుపడం లేదని పేర్కొన్నారు. పదేండ్లుగా ఐటీ, పరిశ్రమలశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నానని, ఏజెండా అంశాలపైనే చర్చలు జరుపుతున్నామని తెలిపారు. రేవంత్‌రెడ్డి అమెరికా మీటింగుల విశ్వసనీయతపై తెలంగాణ ప్రజలకు ఎటువంటి అనుమానాలు అవసరం లేదని, అన్ని విషయాలు పరిశీలించాకే ఆయా సంస్థలతో చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు.

ప్లీజ్ నమ్మండి.. పెట్టుబడులు నిజమే

సీఎం తమ్ముడి కంపెనీ, నాలుగు నెలలు నిండని కంపెనీలతో ఎంవోయూలు చేసుకుంటూ రూ.వేల కోట్ల పెట్టుబడులు తీసుకొస్తున్నామంటూ సీఎంవో నుంచి వెలువడుతున్న ప్రకటనలను తెలంగాణ ప్రజలు విశ్వసించడం లేదు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు ప్రారంభించింది. అధికారులతో విదేశీ పర్యటనపై ప్రభుత్వం ఎక్స్ వేదిక వివరణలు ఇప్పిస్తున్నది.


రాష్ట్రంలో ఫార్మా గ్లాస్‌ట్యూబ్‌ల తయారీ కేంద్రం

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ప్రసిద్ధిపొందిన కార్నింగ్ ఇన్ కార్పొరేటెడ్ కంపెనీ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. నైపుణ్యాలతో పాటు పరిశ్రమల్లో సాంకేతిక ఆవిష్కరణలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. అమెరికా పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఎమర్జింగ్ ఇన్నోవేషన్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రోనాల్డ్ వెర్లీర్కన్, కార్నింగ్ ప్రతినిధుల బృందం చర్చలు జరిపింది. అనంతరం అవగాహన ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా శక్తి గ్రూపులు, ప్రభుత్వశాఖల ద్వారా చేనేతను ప్రోత్సహించే కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.

ఖండాలు ఏడు కాదు.. ఆరే!

ఉత్తర అమెరికా, యూరప్ ఇంకా విడిపోలేదట

నూతన అధ్యయనంలో తేల్చిన పరిశోధకులు



న్యూఢిల్లీ, ఆగస్టు 7: ప్రపంచంలో మొత్తం ఎన్ని ఖండాలున్నాయన్న ప్రశ్న ఎవరికైనా ఎదురైతే ఠక్కున 7 అనే సమాధానం చెప్తారు. ఎందుకంటే ఆఫ్రికా, అంటార్కిటికా, ఆసియా, ఆస్ట్రేలియా, యూరప్, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా ఖండాలుగా మన భూగోళం విడిపోయిందని చిన్నప్పుడే చదువుకున్నాం గనుక. కానీ, అందులో నిజం లేదట. వాస్తవానికి భూగోళంపై 7 ఖండాలు లేవని, ప్రస్తుతానికి 6 ఖండాలే ఉన్నాయని నూతన అధ్యయనంలో పరిశోధకులు తేల్చారు. మనం అనుకుంటున్నట్టుగా ఉత్తర అమెరికా, యూరప్ వేరుపడలేదని, అవి ఖండాలుగా విడిపోయే ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నదని డెర్బీ యూనివర్సిటీ పరిశోధకులు వెల్లడించారు.

అందులో వాస్తవం లేదు..

'దాదాపు 5.2 కోట్ల ఏండ్ల క్రితం ఉత్తర అమెరికా, యూరేషియా భూ ఫలకాలు (టెక్టానిక్ ప్లేట్స్) విడిపోయినట్టు మనం భావిస్తున్నాం. కానీ, అందులో నిజం లేదు. వాస్తవానికి ఆ భూ ఫలకాలు ఇంకా విడిపోలేదు. అవి విడిపోయే ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతున్నట్టు మా అధ్యయనంలో తేలింది' అని డాక్టర్ జోర్డాన్ పీథియన్ తెలిపారు. గ్రీన్‌ల్యాండ్ సముద్రానికి, ఉత్తర అట్లాంటిక్ సముద్రానికి మధ్య ఉన్న ఐస్‌ల్యాండ్ ఏర్పాటుపై ఈ అధ్యయనంలో పరిశోధకులు దృష్టి సారించారు. యూరేషియా, ఉత్తర అమెరికా భూ ఫలకాల మధ్య సరిహద్దుగా ఉన్న మిడ్ అట్లాంటిక్ రిడ్జ్ (మధ్య అట్లాంటిక్ శిఖరం) పతనంతో వేడి మాంటిల్ ప్లూమ్ ఏర్పడి కాలక్రమంలో అగ్నిపర్వత ద్వీపంగా మారడంతో దాదాపు 6 కోట్ల ఏండ్ల క్రితం ఐస్‌ల్యాండ్ ఏర్పడినట్టు మనం ఇప్పటివరకు భావిస్తున్నాం. ఈ సిద్ధాంతాన్ని సవాలు చేసే సాక్ష్యాలు నూతన అధ్యయనంలో బయల్పడ్డాయి. పరిశోధకులు ఆఫ్రికాలోని భూఫలకాల కదలికలను విశ్లేషించారు. తద్వారా ఐస్‌ల్యాండ్, గ్రీన్‌ల్యాండ్ ఐస్‌ల్యాండ్ ఫారోస్ రిడ్జ్ (జీఐఎఫ్ఆర్)లో ఉత్తర అమెరికా, యూరప్ ఖండాలకు సంబంధించిన శకలాలు ఉన్నట్టు తేల్చారు. కొత్తగా గుర్తించిన ఈ ఫీచర్‌ను 'రిఫ్టెడ్ ఓషియానిక్ మాగ్మాటిక్ ప్లాటూ' అని లేదా సంక్షిప్తంగా 'రోంప్' అని పిలుస్తున్నారు.



చంద్రుడిపై నాసా లైట్ హౌజ్!

వాషింగ్టన్ డీసీ, ఆగస్టు 7: చంద్రుడి ఉపరితలంపై లైట్ హౌజ్‌ను నిర్మించేందుకు నాసా సమాయత్తం అవుతున్నది. చంద్రుడి పైకి వెళ్లాలనుకొనే వ్యోమగాములు, రోబోలకు ఉపయోగపడేలా ఈ లైట్ హౌజ్ ఏర్పాటుకు నిర్ణయించినట్టు తెలిపింది. దీని కోసం ఇప్పటికే లూనార్ నోడ్ 1 (ఎల్ఎన్-1) నావిగేషన్ వ్యవస్థను పరీక్షించారు. గత ఫిబ్రవరిలో చంద్రుడిపై 30 నిమిషాల పాటు లైట్‌ను వెలిగించినట్టు నాసా తెలిపింది. లోకల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసి సుస్థిరమైన లైట్ హౌజ్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధం అవుతున్నామని వివరించారు.



ఆగస్టు 15న 'ఎర్త్ అబ్జర్వేషన్' శాటిలైట్ ప్రయోగం

బెంగళూరు, ఆగస్టు 7: 'ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్' ఈవోఎస్-08 ప్రయోగాన్ని ఆగస్టు 15న చేపట్టబోతున్నట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) బుధవారం వెల్లడించింది. శ్రీహరికోట నుంచి ఎస్ఎస్ఎల్‌వీ-డీ3 రాకెట్ ద్వారా ఈ శాటిలైట్‌ను భూ కక్ష్యలో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపింది. ఏడాది జీవిత కాలం కలిగిన 'ఈవోఎస్-08' శాటిలైట్‌లోని పేలోడ్స్, భూమిపై శాటిలైట్ ఆధారిత నిఘాను చేపడతాయి. తద్వారా భూమిపై అగ్ని ప్రమాదాల్ని గుర్తించటం, పర్యావరణ విపత్తుల సమాచారం కీలకంగా మారనుంది.

కంటెంట్ క్రియేటర్లపై నియంత్రణ!

- **ప్రసార సేవల(నియంత్రణ) బిల్లు కొత్త ముసాయిదాలో నిబంధనలు**
- **చట్టం పరిధిలోకి డిజిటల్ న్యూస్ బ్రాడ్‌కాస్టర్లు**



న్యూఢిల్లీ, ఆగస్టు 7: ఆన్‌లైన్ ద్వారా వార్తలు, వర్తమాన అంశాలను ప్రసారం చేసే, కంటెంట్‌ను తయారుచేసే కంటెంట్ క్రియేటర్లు ఇక కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోకి రానున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న ప్రసార సేవల(నియంత్రణ) చట్టంలో పలు నిబంధనలు ఉన్నాయి. ప్రభుత్వం ఈ చట్టం కోసం ముసాయిదాను తయారుచేసి 2023 నవంబరులో ప్రజాభిప్రాయ సేకరణకు విడుదల చేసింది. అయితే, ఇటీవల ఈ ముసాయిదాలో కొన్ని మార్పులు చేసింది. ఈ ముసాయిదా ప్రకారం.. సోషల్ మీడియా అకౌంట్లు, ఆన్‌లైన్ వీడియో క్రియేటర్లకు సైతం ఈ చట్టం వర్తించనుంది. కొత్త ముసాయిదాలో 'డిజిటల్ న్యూస్ బ్రాడ్‌కాస్టర్' లేదా 'వార్తలు, వర్తమాన అంశాల కంటెంట్ ప్రచురణకర్త' అనే కొత్త క్యాటగిరీని కేంద్రం చేర్చింది. వ్యవస్థీకృత వ్యాపారం, వృత్తిపరంగా, వాణిజ్య కార్యకలాపాల్లో భాగంగా ఆన్‌లైన్ పత్రిక, వార్తల పోర్టల్, వెబ్‌సైట్, సోషల్ మీడియా వేదికలు, ఇంకా ఇలాంటి ఇతర మాధ్యమాల ద్వారా వార్తలు, వర్తమాన అంశాలను ప్రసారం చేసే వ్యక్తి లేదా సంస్థను 'డిజిటల్ న్యూస్ బ్రాడ్‌కాస్టర్'గా పేర్కొన్నది.

నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానా

ఈ ముసాయిదా ప్రకారం డిజిటల్ న్యూస్ బ్రాడ్‌కాస్టర్ క్యాటగిరిలో ఉండే వారు.. వారి గురించి, వారి సంస్థ గురించి, తయారుచేసే కంటెంట్ గురించి కేంద్ర ప్రసార శాఖకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాదు, వీరు సొంతంగా, తమ ఖర్చులతో కంటెంట్ ఎవాల్యువేషన్ కమిటీ(సీఈసీ)లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కమిటీలో మహిళలు, శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు తదితర విభిన్న సమూహాలపై జ్ఞానం ఉన్న వారు ఉండేలా చూసుకోవాలి. ఈ కమిటీల్లో ఉండే సభ్యుల పేర్లను కూడా కేంద్రానికి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పాటించకపోతే మొదటిసారి రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. మూడేండ్లలో మళ్లీ ఈ ఉల్లంఘనలకు పాల్పడితే రూ.2.5 కోట్ల జరిమానా విధించవచ్చు. ఓటీటీ బ్రాడ్‌కాస్టర్లు, డిజిటల్ న్యూస్ బ్రాడ్‌కాస్టర్లకు సంబంధించిన సమాచారం అందించకపోతే సోషల్ మీడియా కంపెనీలపైనా చర్యలు తీసుకునేందుకు ఈ ముసాయిదా ప్రకారం అవకాశం ఉంది. ఈ చట్టం ముసాయిదా దశలోనే ఉందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో ప్రటించారు. అయితే, వేగంగానే ఈ చట్టం చేసే దిశగా కేంద్రం ప్రయత్నిస్తున్నది. జూన్ 4 నుంచి ఇప్పటివరకు కొత్త ముసాయిదాపై పరిశ్రమ నిపుణులు, భాగస్వామ్యపక్షాలతో కనీసం ఆరు సమావేశాలు జరిపిందని సమాచారం.

అసమానతలను అరికట్టేందుకు రాజ్యాంగం శక్తివంతమైన సాధనం: సీజేఐ

న్యూఢిల్లీ: అసమానతలను అరికట్టేందుకు రాజ్యాంగం శక్తివంతమైన సాధనమని సీజేఐ చంద్రచూడ్ అన్నారు. అసమానతల నిరోధించేందుకు అవసరమైన వ్యవస్థలు, సంస్థలను రాజ్యాంగం ఏర్పాటుచేసిందని అన్నారు. బుధవారం ఢిల్లీలో ఓ కార్యక్రమంలో సీజేఐ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు. దేశ పౌరులకు బాధ్యతలనూ రాజ్యాంగం నిర్దేశించిందని చెప్పారు.

కేజ్రీవాల్‌ను మళ్లీ అరెస్ట్ చేస్తారా?

ఈడీని ప్రశ్నించిన జడ్జి

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బెయిల్ సందర్భంగా ఢిల్లీ హైకోర్టులో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు మంజూరు చేసిన రెగ్యులర్ బెయిల్‌ను రద్దు చేయాలన్న ఈడీ అభ్యర్థనను అనుమతిస్తే ఈడీ మళ్లీ ఆయనను అరెస్ట్ చేస్తుందా అని జడ్జి ప్రశ్నించారు. దీనిపై ఈడీ కౌన్సిల్ న్యాయమూర్తికి వివరణ ఇవ్వడంతో 'నేను అయోమయంలో ఉన్నా. ఒక వేళ నేను బెయిల్ రద్దు చేస్తే ఏమవుతుంది? మళ్లీ మీరు ఆయనను అరెస్ట్ చేస్తారా?' అని జడ్జి ప్రశ్నించారు.

ఈడీ.. ఏమిటిది?

- 5 వేల కేసులకు.. రుజువైనవి కేవలం 40 కేసులేనా?
- దర్యాప్తు మెరుగు పడాల్సిన అవసరం ఎంతో ఉంది
- మౌఖిక సాక్ష్యాలు కాదు.. శాస్త్రీయ ఆధారాలు కావాలి
- ఈడీ కేసుల దర్యాప్తు తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) చట్టం కింద గత పదేండ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాదాపు 5 వేల కేసులు నమోదుచేస్తే, నేరారోపణలు రుజువైన కేసులు 40 కూడా లేవని సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈడీ దర్యాప్తు ప్రక్రియను మెరుగుపర్చాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా నొక్కి చెప్పింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ వ్యాపారి కేసును బుధవారం విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈడీ పనితీరుపై కీలక వ్యాఖ్యలు చేసింది.

ధర్మాసనం ఏమన్నదంటే?

'పీఎంఎల్ఏ చట్టం కింద గడిచిన పదేండ్లలో 5 వేలకు పైగా కేసులను ఈడీ నమోదు చేసినట్టు కేంద్రం పార్లమెంట్‌లో వెల్లడించింది. అయితే, ఇందులో కేవలం 40 కేసుల్లో మాత్రమే నేరారోపణలు రుజువైనట్టు పేర్కొంది. ఇదెలాంటి పరిస్థితి అనేది మీరే (ఈడీ) ఊహించుకోండి. మీ దర్యాప్తు ప్రక్రియను మెరుగుపర్చుకోవాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలే చెప్తున్నాయి. కేసు నమోదుచేయడమే కాదు.. కోర్టులో దాన్ని నిరూపించడానికి తగిన శాస్త్రీయ ఆధారాలను కూడా సేకరించాలి. ఇక, ఈ కేసు విషయానికి వస్తే, సాక్ష్యులుగా కొందరిని చూపిస్తున్నారే గానీ, శాస్త్రీయ పరమైన ఆధారాలను కోర్టుకు సమర్పించట్లేదు. అందుకే శాస్త్రీయ పరమైన ఆధారాలను ఇవ్వాలని కోరుకొంటున్నాం' అని ధర్మాసనం పేర్కొంది.



పార్లమెంట్‌లో కేంద్రం ఏం చెప్పిందంటే?

2014 నుంచి ఇప్పటివరకూ పీఎంఎల్ఏ చట్టం కింద ఈడీ.. 5,297 కేసులను నమోదు చేయగా, ఇందులో 40 కేసుల్లో నేరారోపణలు రుజువయ్యాయని, మిగతా మూడు కేసులు వీగిపోయాయని కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది., కాగా ఈడీ కేసులపై ప్రతిపక్షాలు గతకొన్నేండ్లుగా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈడీ నమోదు చేసిన కేసుల్లో నేరారోపణలు రుజువైన కేసులు వేళ్లమీద లెక్కపెట్టవచ్చన్న అభిప్రాయాలూ ఉన్నాయి. కేంద్రం విడుదల చేసిన లెక్కలు ఈ విమర్శలను బలపరుస్తుండటం గమనార్హం.

పదేండ్లలో పీఎంఎల్ఏ కింద ఈడీ నమోదు చేసిన కేసుల వివరాలు

సంవత్సరం	కేసులు	రుజువైనవి
2014	195	00
2015	148	00
2016	170	00
2017	171	03
2018	146	02
2019	188	04
2020	708	03
2021	1166	02
2022	1074	08
2023	934	09
2024	397	09
మొత్తం	5,297	40

800 కోట్ల 'మియావ్ మియావ్' డ్రగ్ పట్టివేత

మహారాష్ట్రలో ఇద్దరి అరెస్ట్

ముంబై, ఆగస్టు 7: మహారాష్ట్రలో రూ.800 కోట్ల విలువైన 'మియావ్ మియావ్' మాదక ద్రవ్యాన్ని గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) స్వాధీనం చేసుకున్నది. భివాండీలోని ఒక ఫ్లాట్‌పై దాడి చేసిన ఏటీఎస్ సిబ్బంది ద్రవరూపంలో ఉన్న 792 కిలోల మెఫెడ్రాన్ (ఎండీ) డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. గత కొద్దికాలంగా నిఘా ఉంచిన ఏటీఎస్ అధికారులు దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీటిని ఎక్కడికి పంపుతున్నారు? వాటి నెట్‌వర్క్ వివరాలను రాబట్టడానికి అధికారులు వారిని ప్రశ్నిస్తున్నారు. కాగా, ఇటీవల కాలంతో మహారాష్ట్రలో ఇంత భారీ యెత్తున మాదకద్రవ్యాలు పట్టుబడటం ఇదే తొలిసారి.

ప్రమాదంలో డ్రైవర్ మృతి.. ట్యాంకర్ పాల కోసం ఎగబడ్డ జనం

ఘజియాబాద్, ఆగస్టు 7: యూపీలో సభ్య సమాజం సిగ్గుపడే ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో పాల ట్యాంకర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడి మరణించినా.. అతని పరిస్థితి పట్టించుకోకుండా చుట్టుపక్కల వారు ఆ ట్యాంకర్‌లోని పాలకోసం ఎగబడ్డ అమానవీయ ఘటన యూపీలోని ఘజియాబాద్‌లో జరిగింది. మంగళవారం ఘజియాబాద్-మీరట్ ఎక్స్‌ప్రెస్ వేపై ఒక పాల ట్యాంకర్, వ్యాన్ ఢీకొన్నాయి. ట్యాంకర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. ఈ ప్రమాదంతో ట్యాంకర్ నుంచి పాలు కారడం ప్రారంభించాయి. దీంతో అక్కడ ఉన్న జనం డ్రైవర్ చనిపోయాడో, బతికున్నాడో కూడా పట్టించుకోకుండా చేతికి అందిన బాటిల్స్, క్యాన్లు, బకెట్లతో ఆ పాలను పట్టుకోవడానికి ఎగబడ్డారు.

15 రోజుల్లో గవర్నర్ పదవి ఇవ్వాలి.. లేకుంటే!

బీజేపీకి శివసేన మాజీ ఎంపీ డిమాండ్

ముంబై, ఆగస్టు 7: తనకు గవర్నర్ పదవి ఇస్తామని మోదీ ప్రభుత్వం మోసం చేసిందని శివసేన మాజీ ఎంపీ ఆనందరావు అడ్సుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో తనను గవర్నర్‌గా నియమించకపోతే బీజేపీ ఎంపీ నవనీత్ రాణా కులం సర్టిఫికెట్‌కు సంబంధించి సుప్రీం కోర్టులో క్యూరేటివ్ పిటిషన్‌ను దాఖలు చేస్తానని ఆయన హెచ్చరించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు రాణా ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని స్వాధీనం చేసుకున్న విషయాన్ని ఆయన ఈ ఎన్నికల సమయంలో, తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత గవర్నర్ పదవి ఇస్తామంటూ అమిత్ షా తనకు హామీ ఇచ్చారని అడ్సుల్ తాజాగా తెలిపారు. దానిని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.



గోవిందరాజన్‌కు తొలి 'విజ్ఞాన్ రత్న' పురస్కారం

చంద్రయాన్-3 బృందానికి విజ్ఞాన్ టీమ్ అవార్డు

న్యూఢిల్లీ, ఆగస్టు 7: ప్రముఖ జీవ రసాయన శాస్త్రవేత్త(బయోకెమిస్ట్) గోవిందరాజన్ పద్మనాభన్ మొదటి 'విజ్ఞాన్ రత్న' పురస్కారానికి ఎంపిక అయ్యారు. కేంద్రం బుధవారం మొత్తం 33 రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాలను ప్రకటించింది. ఇందులో యువ శాస్త్రవేత్తలకు ఇచ్చే 18 విజ్ఞాన్ యువ పురస్కారాలతో పాటు 13 విజ్ఞాన్ శ్రీ పురస్కారాలు ఉన్నాయి. విజ్ఞాన్ టీమ్ అవార్డు చంద్రయాన్-3 బృందానికి దక్కింది. సైన్స్‌లో శాస్త్ర, సాంకేతిక భాగస్వామ్యం, గొప్ప ఆవిష్కరణలకు ఇచ్చే ఈ అత్యున్నత అవార్డులను కేంద్రం ఈ ఏడాది ప్రారంభించింది.

రాహుల్‌గాంధీకి పాక్ మామిడి పండ్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 7: లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ సహా ఏడుగురు ఎంపీలకు ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ తమ దేశంలో పండిన మామిడి పండ్లను బుధవారం అందజేసింది. రాహుల్‌తోపాటు రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, సమాజ్‌వాదీ ఎంపీలు మొహిబ్బుల్లాహ్ నద్వీ, జియా ఉర్ రెహమాన్ బార్క్, కైరానా ఇక్రా హసన్, ఘాజీపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీకి కూడా పాక్ హైకమిషన్ మామిడిపండ్లను అందజేసింది.

హిందూ గాయకుడి ఇంటికి నిప్పు

- అరుదైన సంగీత వాయిద్యాల ధ్వంసం
- హసీనా తండ్రి ముజిబుర్ బయోపిక్‌లో నటించిన హీరో దారుణ హత్య
- బంగ్లాదేశ్ హింసలో అనేక ఘోరాలు
- హింసను ఆపండి: యూనస్
- నేడు ప్రభుత్వాధినేతగా బాధ్యతల స్వీకరణ



మంటల్లో కాలిపోతున్న రాహుల్ ఆనంద ఇల్లు



ఢాకా, ఆగస్టు 7: బంగ్లాదేశ్ ప్రధానిగా షేక్ హసీనా రాజీనామాతో నెలకొన్న హింసలో అనేక దారుణాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా, హిందూ మైనారిటీలు, హసీనా మద్దతుదారులే లక్ష్యంగా అల్లరిమూకలు హింసకు తెగబడ్డాయి. ప్రముఖులను సైతం లక్ష్యంగా చేసుకున్నాయి. ధన్‌మొండిలోని ప్రముఖ బెంగాలీ గాయకుడు రాహుల్ ఆనంద ఇంటిని దుండగులు లూటీ చేసి, నిప్పు పెట్టారు. 'జోలెర్ గాన్' పేరుతో ఆయన ఈ ఇంటి నుంచి ఒక బ్యాండ్‌ను నడుపుతున్నారు. అనేక పాటలను ఇక్కడి నుంచే ఆలపించేవారు. గత ఏడాది సెప్టెంబర్‌లో బంగ్లా పర్యటనకు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ కూడా ఈ ఇంటిని సందర్శించారు. రాహుల్ ఆనంద ఇంట్లో ఉన్న దాదాపు 3 వేల సంగీత వాయిద్యాలను దుండగులు చోరీ, ధ్వంసం చేశారు. ఇప్పటివరకు రాహుల్ ఆనంద, ఆయన కుటుంబసభ్యుల ఆచూకీ లభించడం లేదు.

యువ హీరో దారుణ హత్య

బంగ్లా యువ నటుడు శంతో ఖాన్, నిర్మాత అయిన ఆయన తండ్రి సెలిమ్ ఖాన్‌ను కూడా అల్లరిమూకలు హతమార్చిన విషయం వెలుగులోకి వచ్చింది. షేక్ హసీనా తండ్రి ముజిబుర్ రెహ్మాన్ జీవితంలోని పలు సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఓ సినిమాను సెలిమ్ తెరకెక్కించగా, శంతో ఖాన్ నటించారు.

హింసాత్మక చర్యలు వద్దు: యూనస్

బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసపై కాబోయే ప్రభుత్వాధినేత ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ స్పందించారు. 'ఈ పరిస్థితుల్లో అందరూ ప్రశాంతంగా ఉండాలని కోరుతున్నా. ఎలాంటి హింస, విధ్వంస చర్యలకు పాల్పడొద్దు. మనం సాధించిన ఈ విజయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మనం చేసే తప్పుల వల్ల ఈ విజయాన్ని కోల్పోవద్దు. అర్థంలేని హింసతో ఈ అవకాశాన్ని వదులుకోవద్దు. హింసనే మన శత్రువు. దయచేసి ఎక్కువ శత్రువులను సృష్టించవద్దు.' అని ఆయన పిలుపునిచ్చారు. తాత్కాలిక ప్రభుత్వాధినేతగా యూనస్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నట్టు బంగ్లాదేశ్ సైనికాధ్యక్షుడు ఉజ్జమాన్ ప్రకటించారు.

ఉల్లి రైతులకు శాపంగా బంగ్లా సంక్షోభం

బంగ్లాదేశ్‌లో సంక్షోభం మన దేశానికి చెందిన ఉల్లి రైతులకు శాపంగా మారింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి బంగ్లాదేశ్ ఉల్లిగడ్డలతో వెళ్లిన 80 ట్రక్కులను పశ్చిమ బెంగాల్‌లో బంగ్లా సరిహద్దు వద్ద నిలిపివేశారు. బంగ్లాకు ఎగుమతయ్యే ఉల్లిగడ్డల్లో దాదాపు 80% మహారాష్ట్రలోని నాసిక్ నుంచే వెళ్తాయి.

సరిహద్దులకు భారీగా బంగ్లాదేశీయులు

బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో ఆశ్రయం కల్పించాలని కోరుతూ భారత సరిహద్దులకు భారీ సంఖ్యలో బంగ్లాదేశీయులు చేరుకుంటున్నారు. బెంగాల్‌లోని జల్‌పాయిగుడి జిల్లాలో సరిహద్దులకు వందలాది మంది చేరుకున్నారు. వీరిని బీఎస్ఎఫ్ అడ్డుకున్నది.

ఐనాఘర్‌పై అందరి దృష్టి

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా పాలన ముగియడంతో ఇప్పుడు అందరి ఆసక్తి ఐనాఘర్ పైన నెలకొంది. హసీనా హయాంలో ఐనాఘర్‌ను రహస్య జైలుగా ఉపయోగించారనే ప్రచారం ఉంది. హసీనాను వ్యతిరేకించిన వారిని, రాజకీయ ప్రత్యర్థులను బంగ్లాదేశ్ సైనిక ఇంటెలిజెన్స్ సంస్థ అయిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫోర్సెస్ ఇంటెలిజెన్స్(డీజీఎఫ్ఐ) అనధికారికంగా అరెస్టు చేసి ఐనాఘర్‌లో బంధించేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా నిర్బంధించిన వారిలో చాలామంది సమాచారం కుటుంబసభ్యులకు కూడా తెలిసేది కాదట. వీరిని కోర్టుల్లో కూడా హాజరుపరిచే వారు కాదని, కొందరు ఐనాఘర్‌లోనే మరణించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

నీట్ పీజీ పేపర్ లీక్!

- **సోషల్ మీడియాలో పోస్టులు**
- **పరీక్ష ప్రశ్నాపత్రాలు అమ్మకానికి పెట్టారంటూ స్క్రీన్‌షాట్ల షేరింగ్**

న్యూఢిల్లీ, ఆగస్టు 7: మరో ఐదు రోజుల్లో నీట్ పీజీ-2024 పరీక్ష జరగనున్న క్రమంలో ప్రశ్నాపత్రం లీకైందన్న ప్రచారం కలకలం రేపుతున్నది. దీనికి సంబంధించిన పోస్టులు ఎక్స్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలపై షేర్ అవుతుండటం చర్చనీయాంశంగా మారింది. నీట్ పీజీ పేపర్ లీక్ గ్రూపు పేరుతో ప్రశ్నాపత్రాల లీకేజీకి సంబంధించి జరిగిన బేరసారాల సంభాషణలను పలువురు యూజర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న పరీక్ష రాయాల్సిన అభ్యర్థుల్లో ఆందోళన నెలకొన్నది. రెండు షిఫ్టుల లీకేజీ పేపర్ల కోసం ఈ గ్రూపులు రూ.70 వేల వరకు అడుగుతున్నట్టు ఆయా సందేశాల్లో ఉన్నది. నీట్ పీజీ ప్రశ్నాపత్రాలు అమ్ముతామంటూ వందలాది టెలిగ్రామ్ చానెళ్లు పోస్టులు పెడుతున్నాయని, దీనిపై సైబర్ క్రైమ్, ఇంటెలిజెన్స్ విభాగం నిఘా పెట్టాలని డాక్టర్ ధ్రువ్ చౌహాన్ అనే ఎక్స్ యూజర్ పేర్కొన్నారు. ఈ పోస్టులు చూసిన పలువురు నెటిజన్లు.. పోటీ పరీక్షల పట్ల విశ్వాసం పోయిందని, లీకేజీ పేపర్లు ఉన్నాయంటూ ఇంత బహిరంగంగా సోషల్ మీడియా వేదికగా వ్యాపారం చేస్తున్నారని కామెంట్లు పెడుతున్నారు. తనకు 678 మార్కులతో 433 ర్యాంకు వచ్చేలా చేసినందుకు పేపర్ లీక్ చేసిన వ్యక్తికి ధన్యవాదాలు చెబుతున్నట్టు అందులో ఉన్నది.

ఇప్పటికే జూన్ నుంచి ఆగస్టుకు వాయిదా

వాస్తవానికి ఈ ఏడాది జూన్‌లో నీట్ పీజీ-2024 పరీక్ష జరుగాల్సి ఉన్నది. అయితే నీట్ యూజీ లీకేజీ, యూజీసీ నెట్ ఉదంతాల నేపథ్యంలో పరీక్షను ఆగస్టు 11కు వాయిదా వేశారు.

అవన్నీ వదంతులే

క్వశ్చన్ పేపరే తయారు కాలేదు: ఎన్‌బీఈఎంఎస్

నీట్ పీజీ ప్రశ్నపత్రం లీక్ అయిందంటూ జరుగుతున్న ప్రచారంపై నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) స్పందించింది. అవన్నీ వదంతులేనని స్పష్టంచేసింది. దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం ఇంకా తయారు కాలేదని, లీక్ పేపర్ పేరిట జరుగుతున్న ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులను కోరింది.

డెల్‌లో 12,500 మంది ఉద్యోగులపై వేటు!

టెక్సాస్, ఆగస్టు 7: అమెరికా మల్టీనేషనల్ టెక్నాలజీ కంపెనీ 'డెల్' భారీ ఎత్తున ఉద్యోగాల తొలగింపునకు సిద్ధమైంది. కంపెనీ మొత్తం సిబ్బందిలో 10శాతం మందిని ఇంటికి పంపేందుకు కార్యాచరణ చేపట్టినట్టు తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. ఇకపై కంపెనీ కృత్రిమమేధపై ఎక్కువగా దృష్టిసారించనుంది. దీని కారణంగా ప్రపంచవ్యాప్తంగా కంపెనీకి చెందిన 12,500 మంది సిబ్బందిపై వేటు పడబోతున్నది. కంపెనీలోని సేల్స్ బృందాలు, మార్కెటింగ్, ఆపరేషన్ విభాగాల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించబోతున్నారట. . అమెరికాలోని టెక్సాస్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన 'డెల్', పర్సనల్ కంప్యూటర్లు, సర్వర్లు, స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, కంప్యూటర్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ మొదలైన వాటిని ఉత్పత్తి చేస్తున్నది. కంపెనీలో ప్రస్తుతం లక్షా 20 వేల మంది వరకు ఉద్యోగులున్నారు.

వైద్య సేవల్లోనూ కోతలా?

- **సీజీహెచ్ఎస్‌కు కేంద్రం కొర్రీలు**
- **ఆయుష్మాన్ భారత్‌తో లింకు**
- **వైద్యసేవలు తగ్గుతాయని ఉద్యోగుల్లో ఆందోళన**
- **సీజీహెచ్ఎస్ ఏడీ కార్యాలయాల వద్ద ధర్నాలు**

హైదరాబాద్, ఆగస్టు 7: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అందించే కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్ఎస్) వైద్య సేవలపై కేంద్రం కోతలు, పరిమితులు విధించేందుకు ప్రయత్నిస్తుండటం పట్ల ఉద్యోగులు, పెన్షనర్లలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య సేవలు అందించే సీజీహెచ్ఎస్‌ను ఆయుష్మాన్ భారత్‌కు లింక్ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇలా లింక్ చేయడం ద్వారా తమకు అందాల్సిన వైద్య సేవలు తగ్గిపోయే అవకాశం ఉందని ఉద్యోగులు, పెన్షనర్లు భావిస్తున్నారు. ఉద్యోగులు సీజీహెచ్ఎస్ కోసం ప్రతి నెల తమ జీతం నుంచి చందా చెల్లిస్తున్నారు. పెన్షనర్లు కూడా రిటైర్ అయిన తర్వాత సీజీహెచ్ఎస్ సేవలను పొందేందుకు 120 నెలల సబ్‌స్క్రిప్షన్ చెల్లిస్తారు. తాము సీజీహెచ్ఎస్ కోసం చందా చెల్లిస్తుంటే ప్రభుత్వం మాత్రం ఆయుష్మాన్ భారత్‌కు లింక్ చేయడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

వైద్యసేవల ప్రైవేటీకరణపై అసంతృప్తి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య సేవలు అందించే సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ కేంద్రాలను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) పద్ధతిలో నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నది. వెల్‌నెస్ సెంటర్లను ప్రైవేటీకరణ చేస్తే సేవలు సరిగ్గా అందవనే భావనతో ఉద్యోగులు, పెన్షనర్లలో ఆందోళన వ్యక్తం అవుతున్నది. కాగా, సీజీహెచ్ఎస్ ఎన్‌ప్యానల్డ్ దవాఖానల్లో పూర్తి స్థాయిలో నగదు రహిత చికిత్స అందడం లేదు. చికిత్స పొందుతున్న వారి నుంచి దవాఖానలు అదనంగా డబ్బులు తీసుకుంటున్నాయి. ఇది కూడా పెన్షనర్లకు భారంగా మారింది.

దేశవ్యాప్తంగా పెన్షనర్ల ధర్నాలు

వైద్య సేవల విషయంలో కేంద్రం తీరుకు నిరసనగా దేశవ్యాప్తంగా ఉన్న సీజీహెచ్ఎస్ ఏడీ కార్యాలయాల ఎదుట నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్(ఎన్‌సీసీపీఏ) ఆధ్వర్యంలో పెన్షనర్లు మహా ధర్నాలు నిర్వహించారు. రైల్వే, రక్షణ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్, తదితర కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు ధర్నాల్లో పాల్గొన్నారు.

ఆ వ్యాఖ్యలు సరికాదు

పంజాబ్-హైకోర్టు జడ్జిపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ, ఆగస్టు 7: కోర్టు ధిక్కార కేసులో సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టిన పంజాబ్-హర్యానా హైకోర్టు న్యాయమూర్తిపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. సింగిల్ బెంచ్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు అవాంఛనీయమని, కోర్టు గౌరవాన్ని తగ్గించేలా ఉన్నాయని అసహనం వ్యక్తం చేసింది. ఆ వ్యాఖ్యలు చాలా బాధ కలిగించాయని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో కోర్టుల్లో ప్రొసీడింగ్స్ సమయంలో, మరీ ముఖ్యంగా వాదనలు లైవ్ స్ట్రీమింగ్ అవుతుండగా వ్యాఖ్యలు చేసే సమయంలో న్యాయమూర్తులు సహనం, బాధ్యతగా ఉండాలని ధర్మాసనం సూచించింది. ఈ బెంచ్‌లో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ హృషికేశ్ రామ్ ఉన్నారు. గత నెల 17న ఇచ్చిన ఆర్డర్ సమయంలో పంజాబ్-హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజ్‌బీర్ షెహ్రావత్ చేసిన చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం తొలగించింది. జూలై 17 నాటి హైకోర్టు ప్రొసీడింగ్స్‌కు సంబంధించిన వీడియోను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ సందర్భంగా ప్రస్తావించారు. విచారణ సమయంలో సింగిల్ బెంచ్ జడ్జి అనవసరమై, అవాంఛనీయమైన వ్యాఖ్యలు చేశారని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. భవిష్యత్తులో ఇలాంటి జరుగకుండా ఉంటాయని ఆశిస్తున్నామని పేర్కొన్నది. జడ్జి వ్యాఖ్యలను సుమోటాగా తీసుకొన్న హైకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం.. ఆయన తీర్పుపై స్టే విధించిందని తెలిపింది.



మగువల చేనేత సోయగం

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద మహిళలు చేనేత చీరలు ధరించి మురిసిపోయారు. ఈ సందర్భంగా నేతన్నల ఆత్మహత్యలను నివారించాలని, చేనేతలకు ఉపాధికి కల్పించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలు తెలిపారు. ప్రభుత్వం స్పందించి చేనేతకు చేయూతనివ్వాలని కోరారు.



చెట్టు తొర్రలో మటిల్డ్ వుడ్ ఔల్

ఈ పక్షి పేరు మటిల్డ్ వుడ్ ఔల్ అనే గుడ్ల గూబ. ఇది పరిసరాల్లో తనను తాను రక్షించు కోవడం కోసం చెట్టు బెరడు రంగులో కలిసిపోయి ఎవరు గుర్తుపట్టకుండా తల దాచు కుంటుంది. ఈ చిత్రాన్ని ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాహోర్ తాలూకాలోని తిత్వి రిజర్వ్ ఫారెస్ట్‌లో తన కెమెరాల్లో బంధించారు

నీరాకేఫ్ వేలాన్ని విరమించుకోవాలి

గౌడ జన హక్కుల పోరాట సమితి డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన నీరాకేఫ్ వేలాన్ని పర్యాటకశాఖ తక్షణమే నిలివేయాలని గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నీరా కేంద్రాన్ని వేలం వేయకుండా.. గౌడకులానికి అప్పగించాలని కోరారు. ఈ డిమాండ్‌తో ఉద్యమిద్దామని బుధవారం ఒక ప్రకటనలో గౌడ సంఘాల నేతలకు పిలుపునిచ్చారు.

విలీనం కేవలం దుష్ప్రచారం

- మీడియా సంస్థలు ప్రజలకు వివరణ ఇవ్వాలి
- బీఆర్ఎస్ ప్రజల కోసం నిలబడతది, పోరాడతది
- పడతం, లేస్తం.. కానీ ఎన్నటికీ తలవంచం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ విలీనమంటూ నిరాధారమైన దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకు వివరణ ఇవ్వాలని, లేదంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. '24 ఏండ్లుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ.. నిబద్ధతతో, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ.. బీఆర్ఎస్' అని ఆయన బుధవారం ఎక్స్ వేదికగా స్పష్టంచేశారు. సాధించుకున్న తెలంగాణను సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపామని తెలిపారు. ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా మార్చుకొని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దామని పేర్కొన్నారు. కోట్లాది గొంతుకలు, హృదయాలు తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం పోరాడుతున్నాయి కాబట్టే ఇది సాధ్యమైందని చెప్పారు. ఎప్పటిలానే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిలబడుతుందని, వారి పక్షాన పోరాడుతుందని స్పష్టంచేశారు. ఇప్పటికైనా అడ్డగోలు అసత్యాలను, దుష్ప్రచారాలని మానుకోవాలని మీడియా సంస్థలకు, వ్యక్తులకు కేటీఆర్ సూచించారు. పడతం, లేస్తం, తెలంగాణ కోసమే పోరాడుతామని, ఎప్పటికీ తల వంచబోమని స్పష్టంచేశారు.

బీఆర్ఎస్ పాలన చేనేతకు స్వర్ణయుగం

- కాంగ్రెస్ పాలనలో మళ్లీ సంక్షోభంలోకి
- జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): దశాబ్దాల పాటు దగాపడ్డ చేనేత రంగానికి బీఆర్ఎస్ పదేండ్ల పాలన ఓ స్వర్ణయుగమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం చేనేత కార్మికులకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల కష్టాన్ని, వారి కృషిని గుర్తుచేశారు. 'నరాలను పోగులుగా, రక్తాన్ని రంగులుగా, గుండెలను కండెలుగా, చెమట చుక్కల్ని చీరలుగా, పేగులను వస్త్రాలుగా అందించి మనిషికి నాగరికతను అద్దిన చేనేత కార్మికులందరికీ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని తెలిపారు. సమైక్య పాలనలో దగా పడ్డ చేనేత రంగానికి.. బీఆర్ఎస్ పదేండ్ల పాలన దేశ చరిత్రలోనే స్వర్ణయుగమని అన్నారు. నేత కార్మికుల కష్టాలు తెలిసిన నాయకుడు.. మగ్గానికి మంచిరోజులు తెచ్చిన దార్శనికుడు.. వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టిన పాలకుడు కేసీఆర్ అని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో ఆరేండ్ల బడ్జెట్ రూ.600 కోట్లే ఉంటే, బీఆర్ఎస్ పాలనలో ఏడాదికి రూ.1200 కోట్లు అని వివరించారు. దేశంలోనే తొలిసారి 50 శాతం సబ్సిడీతో 'చేనేత మిత్ర', నేతన్నకు చేయూత పేరుతో త్రిఫ్ట్ ప్రత్యేక పొదుపు పథకం, 'నేతన్నకు బీమా' పేరుతో 5 లక్షల రూపాయల ధీమా 36 వేల మంది నేతన్నల కుటుంబాలకు కొండంత అండగా ఉన్నాయని వెల్లడించారు. 10,150 మంది చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు రూ.29 కోట్ల రుణాల మాఫీ చేసి, ఆసరా పెన్షన్‌తో ఆపన్న హస్తం అందించి.. పద్మశాలీల ఆత్మగౌరవం పెంచే చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని బతికించేందుకు బతుకమ్మ చీరల పంపిణీని చేపట్టారని తెలిపారు. సిరిసిల్లలో అపారెల్ పార్క్, వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ సంచలనాలని అన్నారు. అయితే, కాంగ్రెస్, బీజేపీ పాలనలో నేతన్నల బతుకులు ఛిద్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీయే హయాంలో.. తొలిసారి చేనేత వస్త్రాలపై జీఎస్టీ పన్ను, ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు రద్దు, ఆలిండియా హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు రద్దు, ఆలిండియా పవర్లూమ్ బోర్డు రద్దు, చేనేత కార్మికుల త్రిఫ్ట్ పథకం రద్దు, హౌస్ కం వర్క్ షెడ్ పథకాల రద్దు, మహాత్మాగాంధీ బునకర్ బీమా పథకం రద్దు, యార్న్‌పై సబ్సిడీ 40% నుంచి 15 శాతానికి తగ్గించారని మండిపడ్డారు. ఇక రాష్ట్రంలో రేవంత్ పాలన వల్ల చేనేత రంగం మళ్లీ మళ్లీ సంక్షోభంలోకి కూరుకుపోయిందని వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కండ్లు తెరిచి, బీఆర్ఎస్ పాలనలో అమలైన పథకాలు కొనసాగించి, సంక్షోభం నుంచి చేనేత రంగాన్ని గట్టెక్కించాలని డిమాండ్ చేశారు.

ముఖేశ్‌కు చేనేత జాతీయ పురస్కారం



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంకు చెందిన కర్నాటి ముఖేశ్ చేనేత జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, చేనేత జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ చేతుల మీదుగా పురస్కారాన్ని పొందారు. సహజసిద్ధ రంగులతో ఇక్కత్ డిజైన్‌లో వినూత్నంగా తయారు చేసిన 600 గ్రాముల చేనేత చీరకు ఈ అవార్డు దక్కింది. జాతీయ స్థాయిలో 14 మంది ఎంపిక కాగా తెలంగాణ నుంచి కర్నాటి ముఖేశ్ ఉన్నారు. – చౌటుప్పల్ రూరల్

చేనేతలను ఆదుకోవాలి

ప్రభుత్వానికి నేతన్నల వేడుకోలు

ఖైరతాబాద్, ఆగస్టు 7 : ఏడు నెలలుగా చేనేతల జీవితాలు దుర్భరంగా మారాయని, తమను ఆదుకోవాలని నేత కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అఖిలభారత, తెలంగాణ పద్మశాలీల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు స్వామి, యువజన ఇన్‌చార్జి భాస్కర్, మహిళా అధ్యక్షురాలు రూప, తెలంగాణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మురళి, జ్ఞానేశ్వర్, ఉమ్మడి నల్లగొండ చేనేత సహకార సంఘాల అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రం, సత్యనారాయణ, శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

లోకల్ పాలసీ ఏది?



తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి...

అవగాహన లేకపోతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఏడీ, న్యాయ విభాగాధిపతులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వర్సిటీల వీసీలు, ఉన్నత విద్యావంతులు, విషయ నిపుణులతో సమాలోచనలు జరిపి, ఒక ఉన్నత స్థాయి కమిటీవేసి విధాన నిర్ణయం తీసుకోవాల్సిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పునర్విభజన గడువు ముగిసే 6-7 నెలల ముందే ఈ కసరత్తు ప్రారంభం కావాల్సి ఉన్నదని, ప్రభుత్వం ఎందుకు చేయలేకపోయిందని ప్రశ్నించారు. ఇప్పుడు హడావుడిగా అస్తవ్యస్థ ఉత్తర్వులు జారీచేసి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు.

ఇప్పుడు తెలంగాణ బిడ్డలే స్థానికేతరులు

మెడికల్ విద్యార్థుల పాలిట అశనిపాతంలా మారిన జీవో 33ను సవరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా తాము కూడా ప్రభుత్వానికి సూచనలు చేస్తామని చెప్పారు. 1979లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం విద్య, ఉద్యోగాల విషయంలో 646 జీవో విడుదల చేసిందని చెప్పారు. దాని ప్రకారం తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో 85 సీట్లు స్థానికతగా, 15 శాతం ఓపెన్ క్యాటగిరీగా పేర్కొన్నారని గుర్తుచేశారు. 2014 రాష్ట్ర విభజన చట్టంలో పదేండ్లపాటు విద్యాలయాల ప్రవేశాల్లో ఇదే నిబంధనను యథాతథంగా అమలు చేయాలని స్పష్టం చేసిందని.. ఈ నేపథ్యంలోనే మెడికల్ అడ్మిషన్లకు సంబంధించి 2017లో అదే జీవోను యథావిధిగా కొనసాగించామని తెలిపారు. ఈ జీవో ఈ ఏడాది జూన్ 2 వరకు మాత్రమే వర్తించిందని చెప్పారు. 'ఈ ఏడాది మెడికల్ అడ్మిషన్లలో స్థానికతను నిర్ధారిస్తూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ జీవో 33 ఇచ్చింది. ఇది తెలంగాణ విద్యార్థులకు, భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం, నష్టం జరుగుతుంది. డాక్టర్ కావాలని పిల్లలు, వారి తల్లిదండ్రులు కన్న కలలను రాష్ట్ర ప్రభుత్వం ఛిద్రం చేసింది. 1979, 2017లో జారీ చేసిన ఉత్తర్వుల్లో రెండు అంశాలనే కొత్త జీవోలో పొందుపరిచి దాన్నే స్థానికతగా పేర్కొనటం దుర్మార్గం. ప్రభుత్వం కనీస అధ్యయనం లేకుండా ఉత్తర్వులు ఇవ్వటం వల్ల తెలంగాణ బిడ్డలే తెలంగాణలో స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉన్నది.

చివరి విద్యాసంవత్సరానికి నాలుగేండ్లు ముందు చదివిన ప్రాంతాన్నే స్థానికతగా ప్రభుత్వం జీవో 33లో చెప్పింది. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేండ్లు ఎక్కడ చదివితే అక్కడ స్థానికతగా పేర్కొనటం దారుణం. నీట్ పరీక్ష రాయటానికి ముందు గడచిన ఏడేండ్లు తెలంగాణలోనే చదవాలని లేదా గరిష్ఠంగా నాలుగేండ్లు చదివినా లోకల్ అవుతారన్న నిబంధనను ఎత్తగొట్టారు. విద్యార్థులు ఇంటర్ తెలంగాణ ప్రాంతం అవతల చదివితే వారికి మెడికల్ సీట్లలో స్థానికత కోటా వర్తించదా?' అని ప్రశ్నించారు.

ప్రభుత్వం తెచ్చిన జీవోతో గుంటూరు, బెంగళూరు తదితర ప్రాంతాల్లో చదివిన విద్యార్థులు నాన్‌లోకల్ అయిపోతారని, ఇదేం విధానం? అని నిలదీశారు. నీట్‌లో మంచి ర్యాంకు వచ్చి ఇతర రాష్ట్రాల్లో.. ప్రాంతాల్లో ఎంబీబీఎస్ చదివిన వారు ఇక్కడ పీజీ చేయకూడదా? అని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డ తెలంగాణకు నాన్‌లోకల్ కావాల్సిందేనా? అని నిప్పులు చెరిగారు.

తెలంగాణ బిడ్డలకే దక్కేలా చేశాం

'తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలు, 2,850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండేవి. కేసీఆర్ ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి మెడికల్ కాలేజీల సంఖ్యను 20 నుంచి 36కు పెంచారు. దీంతో సీట్ల సంఖ్య దాదాపు 9 వేలకు చేరింది. పెరిగిన సీట్లు తెలంగాణ విద్యార్థులకే దక్కాలని అనేక జాగ్రత్తలు తీసుకున్నాం. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం మెడికల్, ఇంజనీరింగ్ సహా అన్ని విద్యాలయాల అడ్మిషన్లలో 15 శాతం ఓపెన్ కాంపిటీషన్ ఉండాలి. ఈ మేరకు 20 మెడికల్ కాలేజీల్లోని 2,850 సీట్లలో 280 సీట్లు ఓపెన్ కాంపిటీషన్‌కు వెళ్లేది. ఏపీలోని కాలేజీల్లోనూ 15 శాతం నిబంధన అమలైంది. వీటికి తెలంగాణ, ఏపీ విద్యార్థులు పోటీ పడే అవకాశం ఉండేది. పదేండ్లు ఈ నిబంధన కొనసాగించాలని చట్టంలో పేర్కొన్న నేపథ్యంలో మేం మార్చలేకపోయాం. అయితే.. చట్టంలో పేర్కొన్నట్టుగా 20 కాలేజీలకే దానిని పరిమితం చేస్తూ.. 2014 తర్వాత స్థాపించిన కాలేజీలకు 15 శాతం ఉమ్మడి కోటా ఎత్తివేశాం. ఫలితంగా తెలంగాణ బిడ్డలకు అదనంగా 520 సీట్లు వచ్చాయి. అదేవిధంగా బీ క్యాటగిరీ (ప్రైవేట్ మెడికల్ కాలేజీలు) సీట్ల విషయంలోనూ పటిష్టమైన విధానాన్ని అమలు చేశాం. అంతకుముందు బీ-క్యాటగిరీలో దేశంలోని ఏ రాష్ట్రంవారైనా చదువుకోచ్చనే నిబంధన ఉండేది. అయితే తెలంగాణ బిడ్డలకే ప్రయోజనం కలగాలనే ఉద్దేశంతో జీవోను సవరించాం. తద్వారా 24 మెడికల్ కాలేజీల్లో 1,071 ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ పిల్లలకు దక్కాయి. కానీ ఇప్పుడు ప్రభుత్వం మెడికల్ సీట్ల అడ్మిషన్ల భర్తీ విషయంలో అనాలోచితంగా వ్యవహరించింది. మన విద్యార్థులకు తీరని నష్టం జరిగేలా ప్రభుత్వం జీవో 33 తెచ్చింది' అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

మొక్కుబడిగా పచ్చదనం

రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం ప్రారంభించటాన్ని స్వాగతిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. గతంలో వర్షాలు రాకముందే గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టామని..

కాంగ్రెస్ ప్రభుత్వం పథకం పేరును మార్చిందే తప్ప, స్థానిక సంస్థలకు నయాపైసా ఇవ్వలేదని విమర్శించారు. మొదటి రోజు సమస్యలను గుర్తించాలని, రెండో రోజు ఓహెచ్ఆర్ఎస్ క్లీనింగ్, తాగునీటి పైపుల బాగు చేయాలని.. కానీ బ్లీచింగ్ పౌడర్‌కు డబ్బులు లేవని, గడ్డి మందుకు, ఆయిల్ బాల్స్‌కు, కనీసం బల్బులు మార్చేందుకు కూడా డబ్బులు లేవని తెలిపారు.

సర్పంచులు ఉన్నప్పుడు రూ.2-3 లక్షలు, ఇప్పుడు పంచాయతీ సెక్రటరీలు రూ.60-70 వేల వరకు సొంత డబ్బు ఖర్చు చేశారని వెల్లడించారు. చాలా ఊర్లలో డీజిల్‌కు డబ్బులు లేక ట్రాక్టర్లు మూలకుపడ్డాయని, పారిశుద్ధ్య కార్మికులకు 2 నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయని.. మరి స్వచ్ఛదనం, పచ్చదనం ఎలా సాధ్యం అవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో హరితహారం 3-4 నెలలు పండుగలా సాగేదని, నేడు మొక్కుబడి కార్యక్రమంగా మారిందని విమర్శించారు. తక్షణమే గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వాలని డిప్యూటీ సీఎంను డిమాండ్ చేశారు. ఈ పరిణామాలను బట్టి ప్రభుత్వ పాలన గుడ్డెద్దు చేన్లో పడ్డట్టుగా ఉన్నదని, ఏ అంశంలోనూ స్పష్టత, ప్రణాళిక, సమగ్రమైన విధానం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకాల్లో స్థానికత నిర్ధారించాం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమమే నీళ్లు, నిధులు, నియామకాలపై జరిగిందనే విషయాన్ని హరీశ్‌రావు గుర్తుచేశారు. నియామకాలపై కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ ఆకాంక్షలను నిజం చేసిందని.. మన ఉద్యోగాలు మన బిడ్డలకే దక్కేలా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగిందని వెల్లడించారు. ఒకప్పుడు 60 శాతం లోకల్, 40 శాతం నాన్‌లోకల్ అని రిజర్వేషన్లు ఉండేవని.. ఓపెన్ కాంపిటీషన్‌లో పక్క రాష్ట్రం వాళ్లే ఎక్కువగా ఉద్యోగాలు పొందేవారని చెప్పారు. దీనిని బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చిందని వివరించారు. కేసీఆర్ స్వయంగా ప్రధాని, రాష్ట్రపతిని కలిసి 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే దక్కేలా రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించారని పేర్కొన్నారు. 2018లో జీవో 124ను కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిందని వెల్లడించారు. దాంతో ఉద్యోగాల నియామకాల్లో స్థానిక రిజర్వేషన్లు సాధించుకున్నామని స్పష్టంచేశారు. విద్య విషయంలోనూ పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలని భావించినా.. పునర్విభజన చట్టం అడ్డంకిగా ఉండటంతో సాధ్యం కాలేదని, ఇప్పుడు గడువు ముగిసినా స్థానికతను నిర్ధారించుకోలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు.



తెలంగాణభవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

48 గంటల్లో 44 వేల ఫిర్యాదులు

- ఫోన్‌కాల్స్ 3,562.. వాట్సాప్ మెస్సేజ్‌లు 42,984
- అర్హత ఉండీ రుణమాఫీ కాని రైతుల ఫిర్యాదు
- రాష్ట్రంలో సగం మంది రైతులకే రుణమాఫీ
- సీఎంకు దమ్ముంటే రైతు సదస్సులు పెట్టాలి
- మంత్రివర్గ ఉపసంఘం విహారయాత్రలకే పరిమితం
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అర్హులై ఉండి రుణమాఫీ కాని రైతులు ఇంకా సగానికిపైగా ఉన్నారని, ఇందుకు తమకు వస్తున్న ఫిర్యాదులే సాక్ష్యమని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హత ఉండి రుణమాఫీ వర్తించని రైతుల ఫిర్యాదు కోసం బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్ 83748 52619కు 48 గంటల్లో 3,562 కాల్స్, 42,984 వాట్సాప్ మెస్సేజ్‌లు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ ఏ స్థాయిలో అమలవుతున్నదో వచ్చిన ఈ ఫిర్యాదులే నిదర్శనమని మండిపడ్డారు. బీఆర్ఎస్ నిలదీతకు భయపడి, దేవుళ్లపై పెట్టిన ఒట్ల నుంచి తప్పించుకొనేందుకు తూతూమంత్రంగా రేవంత్‌రెడ్డి సర్కారు రుణమాఫీని అమలుచేస్తున్నదని విమర్శించారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 4,500 పైచిలుకు గ్రామాల నుంచి సన్న, చిన్నకారు, దళిత, బలహీనవర్గాల రైతుల నుంచి తమకు ఫిర్యాదులు అందాయని వివరించారు. రుణమాఫీ రైతుపక్షంగా కాకుండా ప్రభుత్వపక్షంగా జరిగిందని మండిపడ్డారు. రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ అయిందని, ఆధార్‌కార్డులో చిన్నతప్పు ఉన్నా కాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రుణమాఫీని రేషన్‌కార్డుతో లంకె పెట్టడం లేదని పైస్థాయిలో చెప్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నట్టు తమకు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. కొందరికి వీసా ఉన్నదని, కొన్ని తండాల్లో భూ రికార్డులు సరిగా లేవని రుణమాఫీ చేయలేదని చెప్పారు. బ్యాంకర్లకు లేని నిబంధనలు ప్రభుత్వానికి ఎందుకు? అని నిలదీశారు. 'రైతు భ రోసా ఎగ్గొట్టారు.. పంటలకు బోనస్‌ను బోగస్ చేశారు.. ఆ డబ్బులను రుణమాఫీకి కేటాయించారు' అని మండిపడ్డారు. రుణమాఫీ కాని రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని, త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందని చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు రూపంలో రూ.72 వేల కోట్లు, రుణమాఫీ రూపంలో మరో రూ.30 వేల కోట్లు రైతులకు అందించినట్టు గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే క్షేత్రస్థాయిలో రైతు సదస్సులు పెట్టి రుణమాఫీపై సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. రైతుభరోసాపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం విహారయాత్రలకే పరిమితమైందని ఆరోపించారు. సివిల్ సప్లయ్ కుంభకోణంపై త్వరలోనే దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదుచేస్తామని తెలిపారు. రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ.. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుకు జరిగిన అవమానం సంపత్ చేసింది కాదని, సర్కారే చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ దాష్టీకాలపై అలంపూర్‌లో త్వరలోనే భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుమ్మిళ్ల నీళ్లను తాకే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు

అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుకు జరిగిన అవమానం సంపత్ చేసింది కాదని, కాంగ్రెస్ సర్కారు చేసిందేనని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ విమర్శించారు. ఓ వైపు రాహుల్‌గాంధీ రాజ్యాంగ ప్రతిని చేతపట్టుకొని తిరుగుతుండగా, మరో వైపు ఆ పార్టీ నాయకుడు దళిత ఎమ్మెల్యేపై దాడిచేసి రాజ్యాంగాన్ని అవమానించారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా గెలిచిన ఎమ్మెల్యే హక్కులను ఏ అర్హత, అధికారం లేని కాంగ్రెస్ నాయకుడు సంపత్ దాడిచేసి కాలరాయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. రూ.700 కోట్లతో తుమ్మిళ్ల ప్రాజెక్టును నిర్మించింది, ఆయకట్టుకు నీరు అందించి కేసీఆర్ ప్రభుత్వమని చెప్పారు. తుమ్మిళ్ల లిఫ్టునే కాదు.. ఆ నీటిని తాకే అర్హత కూడా కాంగ్రెస్ నాయకులకు లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నడిగడ్డలో కాంగ్రెస్ రక్తంపారిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు పారించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ దాష్టీకాలపై అలంపూర్‌లో త్వరలోనే భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

30 వేల మందికి రుణమాఫీ కాలేదు

- డీసీసీబీ, పీఏసీఎస్‌లలో అర్హులైన రైతులున్నారు
- మరో 3982 మంది అర్హులను జాబితాలో చేర్చలేదు
- ఈ సమస్యల్ని ముందుగానే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం
- 157మంది పీఏసీఎస్ కార్యదర్శులపై చర్యలకు లేఖ
- టెస్కాబ్ అధికారుల వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 7(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని డీసీసీబీ, పీఏసీఎస్‌ల్లో 30 వేల మంది అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదని తెలంగాణ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్(టెస్కాబ్) వెల్లడించింది. ఆధార్‌కార్డుల్లో తప్పులు, ఇతర సమస్యల కారణంగా ఇది జరిగిందని తెలిపారు. దీంతో పాటు మరో 3982 మంది అర్హులైన రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో చేర్చకపోవడంతో వారికి కూడా రుణమాఫీ కాలేదని వెల్లడించారు. బుధవారం వివిధ పత్రికల్లో వచ్చినటువంటి 'ప్యాక్స్‌లో రుణమాఫీ జాబితా తప్పులతడక, గందరగోళం.' కథనాలపై బ్యాంకు అధికారులు పత్రిక ప్రకటన ద్వారా వివరణ ఇచ్చారు. రుణమాఫీలో ప్యాక్స్‌లో తప్పులు జరిగిటనట్టు అధికారులు అంగీకరించారు. ఈ విషయాలను ముందుగానే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. రైతుల పేర్లను జాబితాలో చేర్చని 157మంది పీఏసీఎస్ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్టుగా వివరించారు. తాము రుణమాఫీ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రుణమాఫీకి ప్రభుత్వం నుంచి విడుదలైన మొత్తాన్ని డీసీసీబీలకు పంపించి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని సూచించినట్టుగా తెలిపారు.

బ్యాంకు ఎదుట రైతుల బారులు



ఆదిలాబాద్ జిల్లాలోని పలు బ్యాంకుల ఎదుట రైతులు బారులు తీరుతున్నారు. ప్రభుత్వం ఇటీవల రైతులకు రూ.1.50 లక్షల రుణమాఫీ ప్రకటించడంతో వివరాలు తెలుసుకోవడంతోపాటు రుణాల రెన్యువల్ కోసం వందలాది మంది బ్యాంకుల వద్దకు వస్తున్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట వందల సంఖ్యలో రైతులు క్యూలో నిల్చున్నారు. రైతులు ఎక్కువ సంఖ్యలో రావడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.
– ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ



కృష్ణమ్మ పరవళ్లు నాగార్జునసాగర్ ఉప్పొంగుతున్నది. బుధవారం శ్రీశైలం జలాశయం నుంచి 2,95,652 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో 18 క్రస్ట్ గేట్లను ఎత్తి 2,49,732 క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే మీదుగా దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు 584.50 అడుగుల నీటిని నిల్వ చేస్తూ శ్రీశైలం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను అదేస్థాయిలో విడుదల చేస్తున్నారు. – న్యూస్‌నెట్‌వర్క్



నిండుకుండలా లక్నవరం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుసాపురం వద్ద ఉన్న లక్నవరం సరస్సు నిండుకుండలా మారింది. దీంతో చూపరులను ఆకర్షిస్తున్నది. లక్నవరం సరస్సును సందర్శించేందుకు చిన్నాపెద్ద అనే తేడా లేకుండా పర్యాటకులు పోటెత్తారు.

మల్లన్నసాగర్‌పై కాంగ్రెస్ నాలుక మడత

- నాడు భూకంపమన్నరు.. నేడు బ్రహ్మాండమంటున్నరు!
- 50 టీఎంసీలతో ఉపద్రవమని అప్పట్లో గగ్గోలు
- హైదరాబాద్ తాగునీటికి ఇదే శరణ్యమంటూ జీవో
- ఏది నిజమో కాంగ్రెస్ నేతలు చెప్పాలంటున్న ప్రజలు
- పైప్‌లైన్ పొడగింపుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు



సిద్దిపేట జిల్లా తొగుటలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): నరం లేని నాలుక.. ఏదైనా మాట్లాడొచ్చు! కానీ కాగితాల మీద రాతలు, అంతకుమించి ప్రజాక్షేత్రంలో రాజకీయ పార్టీ చేసిన వ్యాఖ్యలు ప్రజల మదిలో రికార్డవుతాయి. నాడో తీరుగ నేడో రీతిగ మాట్లాడటం కాంగ్రెస్ పార్టీకే చెల్లింది. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర ప్రాంతంలో వందలాది టీఎంసీల నీటి నిల్వ రిజర్వాయర్లు నిర్మించుకుంటే నోరు మెదపని అప్పటి తెలంగాణ కాంగ్రెస్ నేతలు, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 50 టీఎంసీలతో మల్లన్నసాగర్‌ను ప్రతిపాదిస్తే చేసిన రాద్ధాంతం అంతాఇంతా కాదు. 'బ్రహ్మాండం బద్దలవుతుంది.. భూకంపం వస్తుంది' అంటూ మీడియా ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చిన దృశ్యాలు ఇంకా తెలంగాణ సమాజం యాదిలోనే ఉన్నాయి. కానీ అధికారంలోకి రాగానే ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీ నాలుక మడతేసింది. నాడు భూకంప కేంద్రంగా ఉన్నదన్న మల్లన్నసాగర్‌నే ఇప్పుడు ఆ పార్టీ బ్రహ్మాండమని చెప్తున్నది. హైదరాబాద్ మహానగర దాహార్తి తీర్చేందుకు మల్లన్నసాగరే శరణ్యమంటూ అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నది. మరి నాడు చేసిన ఆరోపణలు నిజమా? నేడు అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నది వాస్తవమా? కాంగ్రెస్ నేతలు స్పష్టత ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నది. కొండపోచమ్మ సాగర్ నుంచి తక్కువ దూరంలో, తక్కువ వ్యయంతో అయ్యే హైదరాబాద్ మంచినీటి పథకాన్ని దూరం, వ్యయ భారాలు పెంచి మల్లన్నసాగర్‌కు మార్చడంపై పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి బదనాం..

దేశ సాగునీటి రంగ చరిత్రలోనే తక్కువ సమయంలో రైతులకు ఫలాలు అందించిన బృహత్తర ప్రాజెక్టు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 2019లో ప్రారంభమై తెలంగాణలో లక్షలాది ఎకరాల బీడు భూములకు జీవం పోసింది. దురదృష్టవశాత్తు మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్ల కుంగుబాటు ఘటనతో కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం ప్రాజెక్టును బదనాం చేసే కుట్ర చేసింది. ఇందుకు తెలంగాణ రైతాంగ ప్రయోజనాలనే పణంగా పెట్టింది. గత యాసంగిలో ఉద్దేశపూర్వకంగా ప్రాజెక్టు మోటర్లను నడపకుండా లక్షలాది ఎకరాలను ఎండబెట్టింది. ఈ వానకాలంలోనూ అదేరీతిన వ్యవహరించేందుకు సిద్ధమైనా బీఆర్‌ఎస్ ఒత్తిడి, రైతుల ఆందోళనలతో ఎల్లంపల్లి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలో వాస్తవంగా కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనాన్ని గుర్తించలేదా? అనే అనుమానాలు నిన్నటివరకు కాస్తోకూస్తో ఉండేవి. కానీ రెండు రోజుల కిందటితో అనుమానాలు పటాపంచలయ్యాయి. హైదరాబాద్ మహానగర తాగునీటి కోసం రెండో దశ గోదావరిజలాల తరలింపు పథకానికి పాలనా ఆమోదాన్నిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో చెప్పకనే కాళేశ్వరం గొప్పతనాన్ని అంగీకరించాల్సి వచ్చింది. అంతేకాదు.. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌పై గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలు, అపవాదులను ఆ ప్రభుత్వమే కొట్టిపారేస్తూ దానిని జల భాండాగారంగా అభివర్ణించింది.

తాగునీటి పథకానికి కాళేశ్వరమే ఆధారం

హైదరాబాద్ భవిష్యత్తు తాగునీటి అవసరాలకు పది టీఎంసీలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన మూసీ సుందరీకరణ కోసం మరో ఐదు టీఎంసీల గోదావరిజలాల తరలింపునకు ప్రభుత్వం రూ.5,560 కోట్లతో తాగునీటి పథకానికి ఆమోదం తెలిపింది. అధికారంలోకి వచ్చింది మొదలు.. కాళేశ్వరం ప్రాజెక్టు వృథా అంటూ నిత్యం ఆరోపణలు చేసే ప్రభుత్వ పెద్దలు ఈ తాగునీటి పథకానికి కాళేశ్వరం జలాలనే ఆధారంగా చేసుకోవడం విశేషం. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బరాజ్ మాత్రమే కాదు, మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు ఉన్న అనేక రిజర్వాయర్లు, పంపుహౌస్‌లు, టన్నెల్స్, కాల్వలు అంటూ ఆదినుంచీ బీఆర్‌ఎస్ చెప్తూ వస్తున్నది. ఈ నేపథ్యంలో తాజాగా హైదరాబాద్ తాగునీటి పథకానికి ఆధారంగా చేసుకున్న మల్లన్నసాగర్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే గోదావరిజలాలు తరలివస్తాయి. అంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై హైదరాబాద్ భవిష్యత్తు ఆధారపడి ఉందని అధికారికంగానే ధ్రువీకరించింది. ముఖ్యంగా కొన్ని మార్పులు చేసినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన తీరుగానే హైదరాబాద్ తాగునీటి పథకం, మూసీ ప్రక్షాళనకు గోదావరిజలాలను తరలించేందుకు నిర్ణయించింది. ఇదంతా కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పనలో కేసీఆర్ ముందుచూపుతో వ్యవహరించడం వల్లనే సాధ్యమైందని ఇంజినీరింగ్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ ముందు చూపు ప్రదర్శించకుంటే ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా వందల కిలోమీటర్ల నుంచి కృష్ణా, గోదావరిజలాల తరలింపు కోసం పథకాలు చేపట్టాల్సి వచ్చేదని చెబుతున్నారు.

పైప్‌లైన్ దూరం పెంపుపై ఆరోపణలు

తక్కువ దూరం, తక్కువ వ్యయంతో కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన కొండపోచమ్మసాగర్ సోర్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైప్‌లైన్ దూరాన్ని పెంచడంతోపాటు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టేందుకే మల్లన్నసాగర్ సోర్స్‌ను ఎంచుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ గతంలో మాదిరిగా కొండపోచమ్మసాగర్‌ను డిజైన్‌లో కొనసాగించి ఉంటే అంచనా వ్యయం రూ.1000 కోట్ల కంటే ఎక్కువగానే తగ్గేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మల్లన్నసాగర్‌ను ఎంచుకోవడం వల్ల ప్రజాధనాన్ని వృథా చేయడమే అవుతుందని స్పష్టంచేస్తున్నారు.

తొలగిపోయిన భూకంప భ్రమలు

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకులు కేవలం పెన్నా బేసిన్‌లోనే 350 టీఎంసీలకు పైగా నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్లు నిర్మించారు. ఇందులో 30-60 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లున్నాయి. కానీ తెలంగాణకు ప్రయోజనం చేకూర్చే శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉమ్మడి ప్రాజెక్టులు మినహా పట్టుమని పది టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్లు లేవు. అందుకే కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో 50 టీఎంసీల మల్లన్నసాగర్ చేపట్టారు. కానీ దీనివల్ల భూకంపాలు వస్తాయని, 50 టీఎంసీల నిల్వ అనేది అసాధ్యమని కాంగ్రెస్ నేతలు, ఇతరులు అనేక అడ్డంకులు సృష్టించారు. కాంగ్రెస్ నాయకులు హోటళ్లలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్లు ఇచ్చారు. కానీ ఇప్పుడు హైదరాబాద్ తాగునీటి పథకంలో నీటి వనరు (సోర్స్) మార్పునకు కారణాన్ని మాత్రం కొండపోచమ్మసాగర్ 15 టీఎంసీలే, మల్లన్నసాగర్ 50 టీఎంసీలు అయినందున నీటి లభ్యత ఎక్కువగా ఉంటుందంటూ అధికారిక ఉత్తర్వుల్లో సూత్రీకరిస్తున్నారు. దీంతో గతంలో కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలు, ప్రజలను మభ్యపెట్టేందుకు చేసిన భూకంప భ్రమలు అన్నీ వట్టి బూటకమేనన్న వాస్తవాన్ని వాళ్లే అంగీకరించినట్టయిందని నిపుణులు అంటున్నారు.

దేశంలో న్యాయ వికేంద్రీకరణ జరగాలి

బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



హైదరాబాద్, ఆగస్టు (నమస్తే తెలంగాణ): దేశ ప్రజలకు సత్వర న్యాయం జరగాలంటే న్యాయవ్యవస్థ వికేంద్రీకరణ జరగాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. దీని కోసం ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై లేదా హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ లీగల్ సెల్ సభ్యులు సోమా భరత్‌కుమార్, కళ్యాణ్‌రావుతో కలిసి బుధవారం మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టులో ప్రస్తుతం 34 మంది న్యాయమూర్తులే ఉన్నారని, ఆ సఖ్యను 64కు పెంచితే తప్పేమిటని వినోద్‌కుమార్ ప్రశ్నించారు. ప్రాంతీయ ధర్మాసనాలు ఉండాలని తాను ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంట్లో లేవనెత్తడమే కాకుండా రాజ్యాంగ చట్ట సవరణకు ప్రతిపాదించిన విషయాన్ని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా 5.1 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దేశంలో ఇప్పటివరకు లా కమిషన్లు అనేక నివేదికలు ఇచ్చినా, సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్‌లు ఏర్పాటు ప్రతిపాదనలనూ కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. రీజినల్ బెంచ్‌ల ఏర్పాటు అంశాల పరిశీలనకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతి అవసరమని, ఆ మేరకు రాజ్యాంగంలోని 130వ ఆర్టికల్‌ను సవరించాలని సూచించారు. రీజినల్ బెంచ్‌లు ఏర్పాటు చేస్తే దేశ సమగ్రత దెబ్బతింటుందంటూ ఢిల్లీలో ఉన్న కొందరు న్యాయమూర్తులు, న్యాయవాదులు చేస్తున్న వాదన అర్థరహితం అని పేర్కొన్నారు.

కేసీఆర్ చొరవ భేష్

న్యాయ వికేంద్రీకరణకు తెలంగాణ అద్భుత ఉదాహరణని వినోద్‌కుమార్ కొనియాడారు. రాష్ట్ర హైకోర్టు విభజన సమయంలో తెలంగాణకు 24 మంది, ఏపీకి 37 మంది న్యాయమూర్తుల కేటాయింపులు జరిగాయని గుర్తు చేశారు. సత్వర న్యాయం జరగాలంటే న్యాయవ్యవస్థ వికేంద్రీకరణ జరగాలని భావించిన ఆనాటి సీఎం కేసీఆర్ న్యాయమూర్తుల సంఖ్యను 24 నుంచి 42కు పెంచాలన్న ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించిందని తెలిపారు. 10 జిల్లాల నుంచి 33 జిల్లాల సంఖ్యకు అనుగుణంగా జిల్లా న్యాయస్థానాలు వచ్చాయని, తద్వారా కేసుల పెండింగ్ సమస్య తగ్గుతుందని చెప్పారు.

కేంద్ర బడ్జెట్‌లో న్యాయవ్యవస్థకు తక్కువ నిధులు : సోమా భరత్‌కుమార్

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో న్యాయ వ్యవస్థకు తక్కువ నిధులను కేటాయిస్తున్నదని బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ విమర్శించారు. బడ్జెట్‌లో 0.1 శాతమే న్యాయ వ్యవస్థకు కేటాయించినట్టు వివరించారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే కేసుల పెండింగ్ విషయంలో దేశం 93వ స్థానంలో ఉన్నదని, ఈ నేపథ్యంలోనే దేశానికి వివిధ దేశాల నుంచి పెట్టుబడులు రావడం లేదని తెలిపారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- రెండు పిల్లర్లు కుంగితేనే.. మొత్తం కొట్టుకుపోయినట్టు ఆగం చేసిండ్రు
- కాంగ్రెస్ తీరుపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్
- లక్ష్మి, కాకతీయ కాలువలకు నీటి విడుదల

మోర్తాడ్/ముప్కాల్, ఆగస్టు 7: మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగిపోతే కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కొట్టుకుపోయినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేసిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. నీటిని ఎత్తిపోయకుండా, రైతులకు నీళ్లు ఇవ్వకుండా సముద్రంలోకి పోయేలా చేసి రైతులను ఏడిపించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ వద్ద గల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మి, కాకతీయ కాలువలకు వేముల బుధవారం నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు సాగు, తాగునీటి ఇబ్బంది ఉండొద్దని ప్రాణహిత, గోదావరి కలిసే చోట మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినట్టు తెలిపారు. రూ.90 వేల కోట్ల ప్రాజెక్టులో భాగంగా రూ.4 వేల కోట్లతో మేడిగడ్డ బరాజ్ నిర్మించినట్టు చెప్పారు. అందులోని 84 పిల్లర్లలో కేవలం రెండు పిల్లర్లు కుంగితే దాన్ని సాకుగా చూపి కాళేశ్వరం పూర్తిగా కొట్టుకుపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేసి రైతులను ఆగం చేసిందని మండిపడ్డారు. నీళ్లు ఎత్తిపోసి మిడ్ మానేరు, అనంతసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, వరదకాలువ ద్వారా ఎస్సారెస్పీకి కూడా నీళ్లు తీసుకువచ్చి రైతాంగానికి నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆ పనిచేయడం లేదని ప్రశ్నించారు. ఇటీవల కేటీఆర్ అధ్యక్షతన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బృందం కాళేశ్వరం పర్యటనకు వెళ్లి నీళ్లు ఎత్తిపోయకుంటే తామే వేలాది రైతులతో వచ్చి మోటర్లు ఆన్ చేస్తామని అల్టిమేటం ఇవ్వడంతో ప్రభుత్వం దిగివచ్చిందని అన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీళ్లు ఉన్నందున గుత్ప, అలీసాగర్ లిఫ్టులను నడిపించి ఆయకట్టుకు సాగునీటిని అందించాలని సూచించారు. లేకపోతే వందలాది రైతులతో కలిసి వచ్చి తామే మోటర్లు ఆన్ చేస్తామని వేముల అల్టిమేటం జారీ చేశారు. రైతుల ప్రయోజనాల కోణంలో ప్రభుత్వాలు పనిచేయాలి కానీ ప్రశాంత్‌రెడ్డి చెప్తే నీళ్లు ఇవ్వాలా? అని ప్రభుత్వం భేషజాలకు పోకూడదని సూచించారు.

- **మా గోస తీర్చండి సారూ..**



పిప్రిలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో పలు గ్రామాల రైతులు సమస్యలతో కూడిన బ్యానర్ ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. 'మా గోస తీర్చండి సారూ' అంటూ ఇచ్చోడ నుంచి పిప్రి వెళ్లే మార్గంలో ఆడేగాం వద్ద బ్యానర్ ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిపై కట్టిన ఈ బ్యానర్ సభకు వచ్చే వారు ఆసక్తిగా గమనించారు.


తమ్మిడిహట్టి పనులను త్వరలో ప్రారంభిస్తాం: భట్టి

ఆదిలాబాద్, ఆగస్టు 7(నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో తమ్మిడిహట్టి బరాజ్ పనులను త్వరలో ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి రూ.17 వేల కోట్లను కేటాయించినట్టు తెలిపారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం పాల్గొన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో తీర్పు వాయిదా

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ తరపున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)పై స్పీకర్ అనర్హత వేటు వేసేలా అసెంబ్లీ కార్యదర్శికి ఉత్తర్వులు జారీచేయాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. దీంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన ఈ పిటిషన్లపై హైకోర్టు లోతుగా విచారణ జరిపింది. పిటిషనర్లు స్పీకర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన 10 రోజులకే హైకోర్టును ఆశ్రయించారని దానం, కడియం తరపు న్యాయవాదులు తెలిపారు. గతంలో జరిగిన ఫిరాయింపులకు సంబంధించి కాంగ్రెస్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్‌లో స్పీకర్‌కు నిర్దిష్ట గడువు నిర్ణయించేందుకు ఇద్దరు న్యాయమూర్తుల హైకోర్టు ధర్మాసనం నిరాకరించిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తాజా పిటిషన్లను కొట్టేయాలని, లేనిపక్షంలో ఆ పిటిషన్లను డివిజన్ బెంచ్‌కి నివేదించాలని కోరారు. దీనిపై పిటిషనర్ల తరపు న్యాయవాదులు గతంలోనే వాదన వినిపించారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌కు నోటీసులు జారీ చేయవచ్చని మణిపూర్ ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. దీనికి అనుగుణంగా స్పీకర్‌కు హైకోర్టు నిర్దిష్ట గడువు విధించాలని కోరారు.

- **విధులు బహిష్కరించిన న్యాయవాదులు**



సివిల్ కేసుల్లో కోర్టు ఇంజక్షన్ ఆర్డర్లను నిర్లక్ష్యం చేస్తున్న పోలీస్ అధికారులపై కోర్టులో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్లలో న్యాయవాదులు ఆందోళనకు దిగారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ వారం రోజులుగా దీక్ష చేస్తున్న న్యాయవాదులు, బుధవారం సైతం విధులు బహిష్కరించి అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. – సిరిసిల్ల గాంధీచౌక్

- **ఉచిత బస్సును రద్దు చేయాలని ఆటోడ్రైవర్ల ఆందోళన**



నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు ఆందోళనకు దిగారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని రద్దు చేసి ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ బుధవారం వారు నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిపై ఆటోలు నిలిపి నిరసన చేపట్టారు. – కడెం

కేంద్రం కులగణన చేపట్టాలి

బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని, ఓబీసీ సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల్ దివాస్ వేడుకలు, కుల గణన, ఓబీసీల సమస్యలపై నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీలు ఆర్ కృష్ణయ్య, వద్దిరాజు రవిచంద్ర, నాయకులు విల్సన్, యోగేంద్రయాదవ్, అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఫోన్ ట్యాపింగ్' కేసులో తీర్పు వాయిదా


నాంపల్లి కోర్టులు, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): ఫోన్‌ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు తరపున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై బుధవారం వాదనలు ముగిశాయి. ఫోన్‌ట్యాపింగ్ కేసులో పలువురి పేర్లు ఉన్నాయంటూ వస్తున్న వార్తలన్నీ ఊహాగానాలేనని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి కోర్టుకు తెలిపారు. విదేశాల్లో ఉన్న వారిని విచారించాల్సి ఉన్నందున నిందితులకు బెయిల్ ఇవ్వరాదని వాదించారు. చార్జిషీటులో పేర్కొన్న కీలక ఆధారాలను నిందితులకు ఇవ్వలేదని వారి తరఫు న్యాయవాది కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. తదుపరి కేసు విచారణ 14కు వాయిదా వేస్తున్నట్టు 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ బలవన్మరణం

ఫ్రీ బస్‌తో కరువైన ఉపాధి

మేడ్చల్, ఆగస్టు 7 : ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ ఆటోడ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని వీకర్ సెక్షన్ కాలనీలో పల్లపు సుధాకర్(45) కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఫ్రీ బస్ కారణంగా ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులపాలయ్యాడు. ఇల్లు గడవడం కష్టమై కుటుంబంలో కలహాలు చెలరేగాయి. దీంతో మనస్తాపానికి లోనైన సుధాకర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

- **గురుకులంలో 40 మందికిపైగా అస్వస్థత**



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మైనార్టీ బాలుర ఇంగ్లిష్ మీడియం గురుకులంలో బుధవారం 40 మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురైన 9 మందిని అంబులెన్సులో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఉదయం అల్పాహారంలో భాగంగా కిచిడీ చేసిన తర్వాత 10 గంటల సమయంలో పలువురు వాంతులు చేసుకున్నారు. వైద్యులకు సమాచారం ఇవ్వడంతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. కలెక్టర్ విజయేందిరబోయి, అదనపు కలెక్టర్ విజయేంద్రప్రతాప్ గురుకులానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు, వంటకాలను పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. – జడ్చర్ల

- **ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి**



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) ఆధ్వర్యంలో బుధవారం నిజామాబాద్ జిల్లా ధర్పల్లి తాహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అర్హులైన వారికి తెల్లరేషన్ కార్డులు, ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. – ధర్పల్లి

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

బ్రిటన్ అల్లర్లు

అంతర్గత కల్లోలంతో బ్రిటన్ అట్టుడుకుతున్నది. దేశవ్యాప్తంగా జాత్యహంకారవాదులు వలసవాదులపై దాడులు చేస్తూ భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. లూటీలు, దహనాలకు పాల్పడుతూ శాంతిభద్రతల యంత్రాంగానికి సవాలు విసురుతున్నారు. వివిధ నగరాలు, పట్టణాల్లో వారు లక్ష్యంగా చేసుకున్న 39 ప్రాంతాల్లో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. బ్రిటన్‌లో ఆశ్రయం కోరివచ్చిన వారు బస చేస్తున్న హోటళ్లపై, అపార్టుమెంట్లపై జాత్యహంకారవాదులు వారం రోజులుగా హింసాత్మక దాడులకు తెగబడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో నివసించే వలసదారుల కుటుంబాలవారు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని భయం భయంగా బతుకుతున్నారు.

ప్రస్తుత పరిస్థితిని కొందరు 'అంతర్యుద్ధం'గా అభివర్ణించడం గమనార్హం. జూలై 30న సౌత్ పోర్ట్‌లో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఈ అల్లర్లకు నిప్పురవ్వలా మారింది. ఈ దాడిలో పాల్గొన్నది ముస్లిం శరణార్థి అంటూ జాత్యంహంకారులు సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడంతో మత కల్లోలం తలెత్తింది. అయితే దాడి జరిపిన వ్యక్తి రువాండా నుంచి వచ్చిన క్రైస్తవుడు. బ్రిటన్‌లో స్థానిక, స్థానికేతర వైషమ్యాలు ఏ స్థాయికి చేరాయో ఇది సూచిస్తున్నది. పైగా సోషల్ మీడియాను సంఘ విద్రోహశక్తులు ఎలా దుర్వినియోగం చేస్తాయో ఈ ఉదంతం కండ్లకు కట్టింది. తమ దేశంలో అమల్లో ఉన్న వాక్ స్వాతంత్ర్యం గురించి గర్వంగా చెప్పుకొనే బ్రిటన్ ఇప్పుడు సామాజిక మాధ్యమాలపై నియంత్రణలు విధించాలని ఆలోచిస్తుండటం గమనార్హం. కొన్నేండ్లుగా రాజకీయవేత్తలు చేస్తున్న వలసవాద వ్యతిరేక ప్రచారాన్ని బ్రిటన్ ప్రభుత్వం చూసీ చూడనట్టు వదిలేయడం ప్రస్తుత విపరీత పరిణామాలకు కారణమని చెప్పవచ్చు.

200 ఏండ్లకు పైగా వలసవాద చరిత్ర కలిగిన బ్రిటన్ సూర్యుడు అస్తమించని సామ్రాజ్యమని తెలిసిందే. ఒకప్పుడు తమ ఏలుబడిలో ఉన్న దేశాల నుంచి రకరకాల కారణాల వల్ల బ్రిటన్‌కు వలస వచ్చేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నది. వలసదార్ల సంతతి వారు విద్య, వ్యాపార రంగాల్లో ముందంజ సాధిస్తున్నారు. దీనికి పరాకాష్ఠగా భారతీయ సంతతికి చెందిన రుషి సునాక్ మొన్నటివరకు బ్రిటన్ ప్రధాని పదవిని నిర్వహించిన సంగతి తెలిసిందే. వలసదార్ల వర్గాలు సాధిస్తున్న అభ్యున్నతి స్థానికులకు కంటగింపుగా మారింది. తమకు దక్కాల్సిందేదో వలసదార్ల కుటుంబాల నుంచి వచ్చినవారు తన్నుకుపోతున్నారనే విష ప్రచారం, తద్వారా వలసదార్లపై విద్వేషాలు రెచ్చగొట్టడం ఇటీవలి కాలంలో ఊపందుకున్నది. నిజానికి ఈ ధోరణి యూరప్ అంతటా విస్తరిస్తున్నది. జాత్యహంకారులు రాజకీయాలను శాసించే స్థితికి రావడం ప్రజాస్వామ్యవాదులకు ఆందోళన కలిగిస్తున్నది. అటు అమెరికాలోనూ వలసదార్ల వ్యతిరేక రాజకీయాలు ఇటీవలి కాలంలో ఊపందుకున్నాయి. మాజీ అధ్యక్షుడు ట్రంప్ రాజకీయ విధానాల్లో ఇదే ముఖ్యాంశంగా ఉండటం మనం చూస్తున్నాం. బ్రిటన్ కూడా ఆ తరహా జాతీయ అతివాదానికి మినహాయింపు కాదని తాజా అల్లర్లు రుజువు చేస్తున్నాయి. చివరిసారిగా 2011లో బ్రిటన్‌లో వలసవాద వ్యతిరేక అల్లర్లు పెద్దఎత్తున జరిగాయి. అయితే అవి లండన్ మహానగరానికే పరిమితమయ్యాయి. కాగా, ఈసారి చిన్న పట్టణాలకూ వ్యాపించాయి. ఇటీవలే పగ్గాలు చేపట్టిన లేబర్ పార్టీ ప్రభుత్వానికి ప్రస్తుత అల్లర్లు అగ్నిపరీక్షగా మారాయి. జనద్వేషంతో కూడిన హింసాకాండను సత్వరమే కఠినంగా అణచివేయాల్సిన అవసరం ఎంత ఉందో, వైషమ్యాలకు ఆజ్యం పోస్తున్న 'ఆర్థిక అభద్రత'కు దీర్ఘకాలిక పరిష్కారం కనుగొనడం కూడా అంతే ముఖ్యం.

మధ్యతరగతి మందహాసం మాయం!



అనింద్యో చక్రవర్తి

దేశంలోని మధ్యతరగతి వర్గం మరోసారి దేశ ఆర్థిక రంగంలో చర్చనీయాంశంగా మారుతున్నది. వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇంకా చెప్పాలంటే తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఎందుకనేది తెలియాలంటే, 2000 సంవత్సరంలోకి వెళ్లాలి. అప్పటికే నేను ఉద్యోగంలో చేరి రెండేండ్లవుతున్నది. పరిశోధనలో కొన్నేండ్లు గడిపిన కారణంగా నేను జాబ్ మార్కెట్‌లోకి చాలా ఆలస్యంగా ప్రవేశించాను. అప్పుడు నా జీతం రూ. 40 వేలు మాత్రమే ఉండటానికి అది కూడా ఒక కారణం కావచ్చు. అది ఇప్పటి ధరల్లో చూస్తే దాదాపు రూ.1.7 లక్షలకు సమానం.



నేను కేవలం జర్నలిస్టును అన్నది మీరు గుర్తుంచుకోవాలి. ఈ కారణంగా రాబడి, ఆదాయం లక్ష్యాల లాంటివేవీ ఉండవు. అదే సమయంలో కార్పొరేట్ సంస్థల్లో పనిచేస్తున్న నా స్నేహితులు నా కంటే రెండింతల జీతం సంపాదిస్తున్నారు. ఇది ప్రారంభం మాత్రమే. 2004-05లో స్టాక్ మార్కెట్ బూమ్ తర్వాత వారి వేతనాలు మరింత పెరిగాయి. 2007-08 నాటికి గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి.

క్యాపిటల్ మార్కెట్‌లో డబ్బుల వరద పారడంతో అత్యున్నత ప్రతిభ కలిగినవారికి ఎక్కువ వేతనాలు ఇచ్చి, వారిని ఆకర్షించేందుకు గానూ కంపెనీలు నిధులను సేకరించాయి. ఈ బూమ్ ముగిసే నాటికి సీనియర్ మేనేజ్‌మెంట్ పొజిషన్లలో ఉన్న వైట్‌కాలర్ ప్రొఫెషనర్లు ఏడాదికి రూ.30-50 లక్షలు సంపాదించే స్థాయికి చేరుకున్నారు. టాప్ పొజిషన్లలో ఉన్నవారు రూ.కోటికి పైగా ప్యాకేజీలను అందుకుంటున్నారు. ఆ తర్వాత ప్రపంచ ఆర్థిక సంక్షోభం వచ్చింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయింది. స్టాక్‌మార్కెట్లు కుప్పకూలాయి. ఈజీ మనీ ఆగిపోయింది. దీంతో సీఈవోలు, సీనియర్ మేనేజర్లకు ఖర్చులు తగ్గించుకోవడం, ఉద్యోగాల్లో కోత లాంటి టాస్కులను కార్పొరేట్లు అప్పగించారు. 2010 నాటికి చాలా కంపెనీలు తమ పీ అండ్ ఎల్ స్టేట్‌మెంట్లపై తక్కువ ఖర్చులను చూపించగలిగాయి. అంతేకాదు, ఈ ప్రక్రియ ముగిసే నాటికి బాగా పనిచేసిన వారికి పెద్దమొత్తంలో బోనస్‌లను ఇవ్వజూపాయి.

వైట్‌కాలర్ ఉద్యోగుల వేతనాల్లో వ్యత్యాసానికి ఇది నాంది. ఉదాహరణకు టాప్ ఐటీ కంపెనీల్లో 2012-22 మధ్యకాలంలో సీఈవోల వేతనాలు 1,450 శాతం పెరగగా.. ఫ్రెషర్ల వేతనాలు 40 శాతం మాత్రమే పెరిగాయి. మీరు ద్రవ్యోల్బణం ప్రకారం దీన్ని సర్దుబాటు చేస్తే.. భారతదేశ ఐటీ రంగంలో సగటు ప్రవేశ జీతం వాస్తవ కొనుగోలు శక్తి పరంగా 25 శాతం తగ్గిందని తెలుస్తుంది.

స్టార్ట్-అప్ ఈ స్తబ్ధత నుంచి తప్పించుకుందనుకుంటే మీరు పొరబడినట్టే. 2014-15లో నగదు రూపంలో చెల్లించే జీతాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కొన్ని స్టార్టప్‌లలోని పాత ఉద్యోగులు తమ కంపెనీలు గత రెండేండ్లలో పబ్లిక్ ఇష్యూకి వెళ్లినప్పుడు వారి ఈఎస్‌ఓపీలను (ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్) వాడుకోవడం ద్వారా డబ్బు సంపాదించారు. కానీ, చాలామంది ఉద్యోగులకు గత దశాబ్దకాలంలో వాస్తవ ఆదాయం తగ్గింది. బ్యాంకులు, ఫైనాన్షియల్ రంగంలోని కంపెనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. పదిహేనేండ్ల కిందట ఓ మధ్యస్థాయి ఉద్యోగికి ఏడాదికి రూ.40-50 లక్షలు చెల్లించేవారు. నేడు హెచ్చుతగ్గుల బోనస్‌లతో కలిపి అది రూ.60-70 లక్షలకు చేరుకున్నది. వాస్తవంగా ద్రవ్యోల్బణం సర్దుబాటు నిబంధనల ప్రకారం.. వారి ఆదాయం 40 శాతం వరకు పడిపోయింది.

మీడియాలో జీతాలు దారుణంగా ఉన్నాయి. అగ్రశ్రేణి యాంకర్లు, ఎడిటర్లు ఇప్పటికీ వారి కార్పొరేట్ రంగంలోని సహచరుల మాదిరిగానే సంపాదిస్తున్నారు. అయితే సీనియర్ న్యూస్‌రూమ్ స్థానాల్లో ఉన్నవారి వాస్తవ ఆదాయాలు గత దశాబ్దకాలంలో సగానికి పడిపోయాయి. ఇప్పుడే ఈ రంగంలో ప్రవేశిస్తున్నవారికి 20 ఏండ్ల కిందట లభించే వేతనాల మాదిరిగానే ఇప్పటికీ జీతాలు ఇస్తున్నారు.

వైద్యులు, న్యాయవాదులు, ఆర్కిటెక్ట్‌లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఇతర స్వయం ఉపాధి నిపుణుల డేటా అస్పష్టంగా ఉంది. అయితే ఈ వృత్తులలో చాలా వరకు ఆదాయాలు నిలిచిపోయాయని తెలుస్తున్నది. మీ రెగ్యులర్ జీపీకి మీరు చెల్లించే కన్సల్టేషన్ చార్జీలే అందుకు ఉదాహరణ. 2000లో రెట్టింపు కంటే ఎక్కువ ఉన్న ఇది గత దశాబ్దంలో 50 శాతం పెరిగింది. అలాగే మీ సీఏ ఫీజులు కూడా చాలా అరుదుగా పెరిగాయి. బహుశా న్యాయవాదులకు ఇందుకు మినహాయింపు ఉండవచ్చు. వారి ఫీజులు పెరుగుతూనే ఉన్నాయి. రెండు దశాబ్దాల పాటు న్యాయవాద వృత్తిలో ఉంటూ, ఇప్పుడు ఉన్నత న్యాయస్థానాల్లో వాదిస్తున్న న్యాయవాదుల ఆదాయాలు, వారి సంపద అనూహ్యంగా పెరిగాయి. అందుకేనేమో దక్షిణ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గత మూడేండ్లలో స్థిరాస్తి ధరలు బాగా పెరిగాయి. న్యాయవాదులు ఇండ్లను కొనుగోలు చేసేందుకు ఇష్టపడే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఈ పెరుగుదల కనిపిస్తున్నది.

దేశంలోని ఎగువ మధ్యతరగతి ప్రజల రోజువారీ జీవితాలను ఇది ఎలా ప్రభావితం చేసిందో ఇప్పుడు ఆలోచించండి. కుటుంబంలో సంపాదించే వ్యక్తి తన 40 ఏండ్ల చివరిలో లేదా 50 ఏండ్ల ప్రారంభంలో ఉన్న చాలా కుటుంబాలు ఉన్నత జీవన ప్రమాణాలకు అలవాటుపడ్డాయి. ఇప్పుడు వారికి ఆదాయాలు ఉండవు. కాబట్టి, అలాంటివారు ఆస్తులను, బంగారాన్ని విక్రయించి, పొదుపులను, మ్యూచువల్ ఫండ్‌లలో ఉన్న పెట్టుబడులను వాడుకొని జీవిస్తున్నారు. కొందరు తమ పూర్వీకుల ఆస్తులను విక్రయించి జీవనం సాగిస్తున్నారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి కుటుంబాల్లోని కొంతమంది యువకులు ప్రస్తుతం శ్రామికశక్తిగా మారుతున్నారు. వారు తమ తల్లిదండ్రులు, ఇండ్లు, సొంత ఊర్లను విడిచిపెట్టి ఉపాధిబాట పడుతున్నారు. కానీ, వారికి అందుతున్న వేతనాలు పాకెట్ మనీకే సరిపోతున్నాయి. వారి సంపాదనలో ఎక్కువ భాగం నూతన బైక్, మంచి బట్టలు, కొత్త ఫోన్, స్నేహితులతో షికార్లకే సరిపోతున్నాయి. అయితే వారి తల్లిదండ్రులు వారికిచ్చిన అదే జీవనశైలితో సొంత జీవితాన్ని ప్రారంభించడానికి ఇది ఏ మాత్రం సరిపోదు. నేటి యువతకు పెండ్లిళ్లు చేసుకొని పిల్లలను కనేంత స్తోమత లేదు. సొంత ఇండ్లను కలిగి ఉండాలనే ఆశ వారిలో లేదు. ఎందుకంటే, వారు ఈఎంఐలను భరించలేరు. తమ తల్లిదండ్రుల కంటే తక్కువ సంపాదనతోనే వారు సరిపెట్టుకుంటున్నారు. ఇప్పటికీ విలాసాలు, ప్రీమియం ఉత్పత్తులపై ఖర్చు చేస్తారు. కానీ, తల్లిదండ్రులు చేయగలిగిన అదే స్థిరమైన స్థాయిలో మాత్రం కాదు.

2008-09 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం నుంచి దాదాపు రెండు దశాబ్దాలుగా దేశంలోని మధ్యతరగతి ఈ స్తబ్ధతను ఎదుర్కొంటున్నది. 2000వ దశకం ప్రారంభంలో తాము అనుభవించిన 'అచ్ఛే దిన్'ను నరేంద్ర మోదీ తిరిగి తీసుకువస్తారనే ఆశతో 2014లో అప్పటి యూపీఏ ప్రభుత్వాన్ని గద్దె దించడంతో ఇది ప్రారంభమైంది. కానీ, వారు ఆశించింది జరగలేదు. డీమానిటైజేషన్, జీఎస్టీ, కొవిడ్ లాంటివి వచ్చాయి, వెళ్లిపోయాయి. కానీ, దేశంలోని వృత్తిపరమైన తరగతుల జీవితాలు మాత్రం మెరుగుపడలేదు. ఏదైనా జరిగిందంటే.. అది కేవలం గత దశాబ్దం లేదా అంతకంటే ఎక్కువకాలంగా ద్రవ్యోల్బణం వారి జీవితాలను ప్రభావితం చేయడమే. పన్ను స్లాబ్‌లు మారి ఉండవచ్చు. కానీ, అవి ధరల రేటు ప్రకారం మారలేదు. అదే సమయంలో మధ్యతరగతికి అతి కీలకమైన మెడికల్ ఇన్సూరెన్స్ వంటివి చేరికతో జీఎస్టీ పరిధిలోకి వచ్చే అంశాల జాబితా పెరుగుతున్నది.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం మధ్యతరగతి కుటుంబాల్లో ఆశలు చిగురించేలా కనిపించడం లేదు. స్థిరమైన ఆదాయాలు, నిరంతరం పెరుగుతున్న ధరల మధ్య వారు చిక్కుకున్నారు. పైకి తెలియకుండానే వారిలోని నిశ్చలతత్వం నిరాశకు దారితీసింది. ఈ నిరాశ ఇప్పుడు తీవ్ర ఆగ్రహంగా మారే ప్రమాదం ఉన్నది.

('ది క్వింట్' సౌజన్యంతో)

2008-09 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం నుంచి దాదాపు రెండు దశాబ్దాలుగా దేశంలోని మధ్యతరగతి ఈ స్తబ్ధతను ఎదుర్కొంటున్నది. 2000వ దశకం ప్రారంభంలో తాము అనుభవించిన 'అచ్ఛే దిన్'ను నరేంద్ర మోదీ తిరిగి తీసుకువస్తారనే ఆశతో 2014లో అప్పటి యూపీఏ ప్రభుత్వాన్ని గద్దె దించడంతో ఇది ప్రారంభమైంది. కానీ, వారు ఆశించింది జరగలేదు. డీమానిటైజేషన్, జీఎస్టీ, కొవిడ్ లాంటివి వచ్చాయి, వెళ్లిపోయాయి. కానీ, దేశంలోని వృత్తిపరమైన తరగతుల జీవితాలు మాత్రం మెరుగుపడలేదు.

చేనేతకు చేయూతలో దొందూ దొందే



కూరపాటి రమేష్
94900 98048

ఐదు వేల ఏండ్ల కిందటనే జనపనారతో వస్ర్తాన్ని నేయడంతో నాగరికత వెల్లివిరిసింది. ఆ తర్వాత కాలంలో నేత అనేది గొప్ప మానవ నైపుణ్యంగా అభివృద్ధి చెందింది. కాలక్రమేణా వ్యవసాయం తర్వాత అత్యధిక ప్రజలకు ఉపాధి రంగంగా మారి అది పేగు బంధమైంది. ప్రాచీన భారతదేశంలో ప్రతి గ్రామంలోనూ బువ్వ పెట్టే రైతు-నాగలి, బట్టలిచ్చే చేనేత-రాట్నం ఉండేవి. నాటి నుంచి నేటివరకు చేనేత వస్ర్తాలపై ప్రజలకు మక్కువ పెరిగిందే తప్ప తగ్గలేదు. నేత కార్మికుడు వస్ర్తాలపై సృష్టించిన అద్భుతాలను, ఆవిష్కరించిన కళాఖండాలను చూసి ప్రపంచం అబ్బురపడింది. కానీ, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల చేనేత రంగం నేడు సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ పాపంలో రెండు జాతీయ పార్టీలకు సమాన వాటా ఉన్నది.

వ్యాపారం పేరిట మన దేశంలో అడుగుపెట్టిన ఈస్టిండియా కంపెనీ దేశాన్ని ఆక్రమించుకొని, దేశ సంపదను దోచుకోవడమే కాకుండా చేనేతను దెబ్బతీసింది. బ్రిటిష్ పాలకులు ముడిసరుకుల (నూలు, పట్టు, రంగులు, రసాయనాల)పై పన్నుల భారం మోపారు. తద్వారా మిల్లుల్లో తయారైన వస్ర్తాలను దేశంలోకి తీసుకొచ్చారు. విల్లు ఎక్కుపెట్టాలంటే బొటన వేలు ఎలా అవసరమో.. చేనేత వస్ర్తాన్ని తయారు చేయాలన్నా, కళాఖండాలను ఆవిష్కరించాలన్నా చేతివేళ్లు అంతే అవసరం. నాడు ద్రోణాచార్యుడు ఏకలవ్యుడి బొటన వేలును గురుదక్షిణగా తీసుకున్నట్టే.. చేనేత వస్ర్తాలను తయారు చేయకుండా ఉండేందుకు గానూ బ్రిటిష్ పాలకులు నేతన్నల చేతులను నరికిన ఘటనలెన్నో స్వాతంత్ర్యానికి పూర్వం జరిగాయి. బ్రిటిష్ కాలంలో దేశ వస్ర్తాలపై ఎగుమతి సుంకాలను అధికంగా విధించడంతో పాటు ఇక్కడ లభించే పత్తి, నూలును కారుచౌకగా ఇంగ్లండ్‌కు తరలించారు. అంతేకాదు, ఆ దేశంలో మిల్లులపై తయారైన వస్ర్తాలను మన దేశంలో అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఇక్కడ కూడా మిల్లులను నెలకొల్పి ఎంతగానో దోచుకున్నారు. ఇలాంటి దారుణ పరిస్థితుల నేపథ్యంలోనే స్వాతంత్ర్యోద్యమంలో చేనేత ఒక ఆయుధమైంది. విదేశీ వస్త్ర బహిష్కరణకు పిలుపునిచ్చిన మహాత్మాగాంధీ వాటిని కోల్‌కతాలో తగులబెట్టారు కూడా. మన దేశానికి వ్యవసాయం, చేనేత రెండు కండ్లు అని గాంధీజీ నొక్కివక్కాణించారు. అందుకే నాటి జాతీయ జెండాలో చేనేత చరఖా స్థానం సంపాదించింది.

స్వదేశీ వస్త్ర నినాదంతో మహాత్మాగాంధీ చరఖా చేతబూని స్వయంగా నూలు వడికారు. ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు, చేనేత అభిమానులు చరఖాతో నూలు వడికి ఆ నూలుతో నేసిన ఖాదీ వస్ర్తాలను ధరించి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశంలో చేనేత పరిశ్రమ విరాజిల్లింది. నేతన్నలు తమ నైపుణ్యానికి మరింత పదునుపెట్టి అద్భుతాలను ఆవిష్కరించారు. అయితే కాలక్రమంలో పాలకుల విధానాలలో మార్పులు చోటుచేసుకోవడంతో చేనేత రంగం కుదేలైంది.

1985లో అప్పటి రాజీవ్‌గాంధీ సర్కార్ ప్రవేశపెట్టిన నూతన జౌళి విధానం చేనేతను తీవ్రంగా దెబ్బతీసింది. ఉపాధికి ప్రత్యామ్నాయంగా ఉత్పాదకతకు ప్రాధాన్యాన్ని



కల్పించడం, వస్త్ర ఉత్పత్తి రంగంలో చేనేత, మిల్లు రంగాలను ఒకే క్యాటగిరీగా నిర్ధారించి వస్త్ర రంగంలో అత్యంత బలహీనరంగమైన చేనేతకు అప్పటివరకు ఉన్న ప్రాధాన్యాన్ని తగ్గించారు. చేనేతకు కేటాయించిన 22 రకాల రిజర్వేషన్లపై ఉన్న స్టేను రద్దుచేసి, వస్త్ర రంగంలో బలహీనమైన చేనేతకు రిజర్వేషన్లు అవసరమని, సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ నాటి కాంగ్రెస్ పాలకులు పట్టించుకోలేదు. అంతేకాదు, అప్పటివరకు ఉన్న 22 రకాల చేనేత వస్ర్తాల రిజర్వేషన్లను 11 రకాలకు తగ్గించారు. పాలిస్టర్ వంటి సింథటిక్ వస్త్ర ఉత్పత్తికి ప్రాధాన్యాన్ని కల్పించి, అందుకు అనుగుణంగా సింథటిక్ ఫైబర్ నూలు దిగుమతులపై దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించారు. మన దేశంలోని పత్తి, నూలు ఎగుమతులను ప్రోత్సహించడం, మిల్లుల ఆధునికీకరణకు పెద్దపీట వేసి ఉదారంగా ఆర్థిక సహకారం అందించారు. ఈ విధానాల ఫలితంగా 1985 నాటికి వస్త్ర రంగంలో చేనేతకు గల వాటా 45 శాతం కాస్తా 1991 నాటికి 20 శాతానికి పడిపోయింది. అనతికాలంలోనే చేనేత పరిశ్రమ వేగంగా క్షీణించింది. చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు.

1991లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఐఎంఎఫ్ ఆదేశిత నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు మిల్లులకు గేట్లు బార్లా తెరిచాయి. పాలకులు నియంత్రణను పూర్తిగా ఎత్తివేశారు. యూనిట్ల ఏర్పాటుకు పూర్తిగా లైసెన్సు రద్దు చేశారు. చివరికి రిజిస్ట్రేషన్, రెన్యూవల్ కూడా రద్దు చేశారు. ప్రభుత్వం అనుసరించిన విపరీత విధానాల ఫలితంగా దేశంలో చేనేతకు కోలుకోలేని దెబ్బతగిలింది. నాడు కాంగ్రెస్ పాలకులు పైకి ఎన్ని మాటలు చెప్పినా ఆచరణలో మాత్రం మిల్లుల యజమానులకు కొమ్ముకాశారు.

స్వదేశీ నినాదంతో 1998లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నూతన జౌళి విధానం పునః సమీక్ష పేరిట ఎస్ఆర్ సత్యం కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చేనేత పరిశ్రమకు గొడ్డలిపెట్టు లాంటి సిఫారసులను చేసింది. చేనేతకు కావలసిన చిలపల నూలును నూలు మిల్లులు తయారు చేయవద్దని, చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అవసరం లేదని, చేనేత వృత్తిని మానుకోవాలని ఆ కమిటీ దారుణమైన సిఫారసులను చేసింది.

ఈ సిఫారసులు చేనేతకు మరణ శాసనమని నాడు దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేయడంతో బీజేపీ సర్కార్ వెనక్కి తగ్గినట్టే తగ్గి సత్యం కమిటీ సిఫారసుల పునాదిపైనే 2000లో జాతీయ జౌళి విధానం తీసుకువచ్చింది. చేనేతను చావుదెబ్బకొట్టింది. నేటి మోదీ సర్కార్ కూడా అదే తరహాలో వ్యవహరిస్తున్నది. చేనేతకు ఎంతో మేలు చేశామని, చేనేతను ఆదుకున్నామని ప్రధాని మోదీ గొప్పగా చెప్పున్నారు. జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం సంతోషమే, కానీ ఆచరణలో చేనేత వ్యతిరేక విధానాలతో చేనేతను దెబ్బతీయడం సరికాదు. చేనేత కార్మికుల కోసం ఏర్పాటు చేసిన జాతీయ చేనేత బోర్డును రద్దుచేసింది మోదీ సర్కారేన్న విషయం మరవద్దు. అంతేకాదు, మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన, ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ లాంటి సంక్షేమ పథకాలను కూడా రద్దు చేసి కార్మికులను సంక్షోభంలోకి నెట్టింది. చేనేత పరిశ్రమను, కార్మికులను ఆదుకోకపోగా చేనేత ముడిసరుకులైన యార్న్‌పై 5 శాతం, రంగులు, రసాయనాలపై 5-12 శాతం, చేనేత వస్ర్తాలపై 5 శాతం జీఎస్టీని విధించి పన్నుల రూపంలో దోచుకుంటున్నది. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లకు పేటెంట్ ఉన్నది. జియోట్యాగ్ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ పలు మిల్లులు ఇక్కత్ డిజైన్లను ప్రింట్ చేసి మార్కెట్‌లో చలామణి చేస్తున్నా ప్రభుత్వం అరికట్టడం లేదు. 1985లో చేసిన 11 రకాల రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయడం లేదు.

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ పాలకులు అనుసరించిన విధానాలనే నేటి పాలకులు అనుసరిస్తున్నారు. దారుణమైన విధానాల ఫలితంగా దేశవ్యాప్తంగా చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. అనేకమంది తనువు చాలిస్తున్నారు. పాలకుల విధానాలలో మార్పు రానంత కాలం చేనేత వృద్ధి చెందదు. చేనేత దినోత్సవం పేరిట ఒక్కరోజు సంబురాలు చేస్తే కార్మికుల బతుకుల్లో మార్పు రాదు. మాటల్లో కాదు, చేతల్లో చేనేతకు చేయూతనిచ్చినప్పుడే సంబురాలకు అర్థం ఉంటుంది. పాలకుల విధానాల్లో మార్పు కోసం చేనేత కార్మికులు ప్రతినబూనాలి. ఉద్యమాలకు సిద్ధం కావాలి.



పోయిన్నెల ఆషాఢ మాసంల మా ఊరి పోశమ్మకు బోనమెత్తినం. సంక్రాంతి పండుక్కు వోకున్నా ఏం ఫరక్ పడదు గని, పోశమ్మ బోనాల్జేసేటప్పుడు పోకుంటే మాత్రం మా ఇల్లు శిన్నవోతది. అందుకే ఓ పొంటె ఇంటిమొకాన వొయి మంచిశెడ్డలర్సుకొని అస్తే దప్ప నాకు పానం నిమ్మలం గాదు. పోశమ్మకు సాక వోసి, ఆ తల్లి బొట్టు ముడితే గానీ మావోళ్లకు తుర్తి గాదు. నేనే గాదు, నా అసొంటోళ్లు మస్తు మంది యాడున్నా.. ఆ యాళ్ల మాత్రం తప్పకుండా ఊరికి శేరుకుంటరు.

వాళ్ల శేతులకు జెట్టలు వుట్ట!



గడ్డం సతీష్
99590 59041

ఏ ఇంటి ఆడిబిడ్డ ఆ ఇంటి బోనమెత్తి ముందు నడిస్తే, ఆమె ఎన్క ఇంటోళ్లందరు నడుస్తరు. మా ఊళ్లె మా మున్నూరు కాపోళ్లయి దగ్గెర దగ్గెర ఓ నూటిరువై గడ్పలుంటయి గావొచ్చు. ఆ నూటిరువై బోనాలు ఒక్కకాడ గూడితే, వాళ్లకు పోశమ్మ తొవ్వ సూపేది మాత్రం మాదిగి సప్పుడే. ఆ డప్పుసప్పుళ్ల మజ్జన ఎగురుకుంటా, దున్కుకుంటా పోశమ్మకు బోనాలు తీస్కపోతాంటే 'అగ్గో సూసినారుల్లా... కాపుదనపోళ్ల బోనాలు ఎంత సక్కంగున్నయో'నని ఊరంతా సంబురవడుతరు. మా కాపుదనపోళ్ల బోనాలంటే ఊరంతా పండుగ లెక్కనే. పొద్దుగాళ్ల పది గొట్టంగ బైలెల్లిన బోనాలు పోశమ్మకాడికి శేరేసరికి ఒంటిగంట గొట్టింది. ఒకలెన్కొగలు పోశమ్మకు బోనం ముట్టజెప్పేసరికి మూణ్నాలుగయ్యే అందాద గొడ్తున్నది. ఇంటినుంచి బోనం బైలెల్లంగ గెరువిచ్చిన వాన పోశమ్మ గుడి కాడికి శేరుకోంగనే మళ్లా అందుకున్నది. అందుకే మా సోపతిగాళ్లందరం సైగలు జేస్కొని పోశమ్మ ఎన్క ఉండే గుడ్శెకాడికి శేరుకున్నం.

గుడిసెల కూసున్న మావోళ్లను 'కాకా... మీ పోలీసోళ్లు కొట్టుడు షురూ జేసిర్రట గద నిజమేనా?' అనడిగిన. 'నేన్ కొడ్తలేను గని, ఠాణాలల్ల కొట్టుడు మాత్రం మళ్లా షురువైంది బిడ్డా' అన్జెప్పుకుంటా బాధపడవట్టిండు మా కాక. ఇంకో పోలీసు.. తమ్ముడైతడు. 'పదేండ్లాయె అన్న శేతులకు పన్జెప్పక, ఇప్పుడు కొంచెం శెయ్యి సాఫైతున్నది' అని సంబురపడ వట్టిండు. కొట్టుడంటే పోలీసోళ్లకు ఎంత సంబురమో అని నాది నేను మనసులనుకున్న. ఇట్లా ఓ గడే సేపు ప్రభుత్వం, పోలీసోళ్లు.. వాళ్లు కొట్టే లాఠీదెబ్బల గురించే ముచ్చట నడ్శింది. 'ఇగ్గో మీరెన్నన్న జెప్పుర్రి.. ఏమన్నుంటే కోర్టుకు అప్పజెప్పాలె గని, కొట్టే అధికారం మీకెక్కడిది?' అని వాళ్లతోని లొల్లి వెట్టుకున్నంత పన్జేసిన. అసలు పోలీసులు, లాఠీదెబ్బల చర్చ అప్పుడక్కడ ఎందుకొచ్చినదంటే...?

***

కరీంనగర్ జిల్లా రామడుగు పోలీస్‌స్టేషన్ పరిధి వెలిశాల అనే ఊళ్లె గొర్లు దొంగతనమైనయి. ఈ దొంగతనం జరిగింది ఏప్రిల్‌లో అయితే, జూన్ 11వ తారీఖు దాన్క అక్కడి పోలీసులు నిద్ర లెవ్వలే. గొర్లు పోయినాయిన తనకున్న పతారతో కాంగ్రెస్ నాయకులతో ఒత్తిడి చేపిచ్చిండు. అప్పుడు నిద్ర లేసిన రామడుగు పోలీసులు ఆఖరికి ఎరుకల సామాజికవర్గానికి చెందిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నరు! జూన్ 11వ తారీఖు మబ్బుల నాలుగ్గొట్టంగా వెలిశాలలోని ఓ ఇంటికి వొయిన పోలీసులు కుతాడి కన్కయ్యను స్టేషన్‌కు పట్కవోయిండ్రు. అదేరోజు పొద్దున్నుంచి పగటీలి దాన్క ఆ ఎస్టీ యువకున్ని ఒక కొట్టుడు గాదు, థర్డ్ డిగ్రీ ప్రయోగించిర్రు. దరఖాస్తు ఇచ్చినాయన ముందే, తను సూడంగనే ఈ తతంగమంతా నడిసిందట! ఆడ సాలదన్నట్టు కుతాడి కన్కయ్యను ఇంకో స్టేషన్‌కు తీస్కవొయి గూడ పొట్టు పొట్టు కొట్టిర్రు. జూన్ 25వ తేదీ దాన్క లాఠీ దెబ్బలకు గెరువిచ్చిన పోలీసులు ఆ ఎస్టీ యువకుడిని 26వ తారీఖు గూడ స్టేషన్‌కు పిలిపించుకున్నరు. 'వాళ్ల శేతులకు జెట్టలు వుట్ట! ఆ రోజు గూడ నా పెనిమిటిని పొట్టు పొట్టు కొట్టిర్రె'ని కుతాడి కన్కయ్య పెండ్లాం ఏడ్సుకుంటా చెప్తాంటే విన్నోళ్లు గూడ ఏడ్వవట్టిర్రు. కనికరం లేని ఖాకీ దెబ్బలు ఓర్సుకోలేక కన్కయ్య ఆఖరికి ప్రభుత్వ దవాఖాన్ల షరీకైండు. అంటే పోలీసులు ఆయన్ను ఎంతగనం చిత్రహింసలు వెట్టిర్రో అర్థం జేస్కోర్రి. కుతాడి కన్కయ్య నిజంగనే గొర్లను దొంగతనం జేసిండనుకుందాం! అయితే మాత్రం అంతగనం కొట్టేటందుకు అసలు ఈ పోలీసులెవలు? 'మాకు న్యాయం జెయ్యిర్రి సారూ..' అని కన్కయ్య బంధువులు, కుల సంఘాల నాయకులు, మానవ హక్కుల సంఘాల నేతలు ఎన్ని నిరసనలు తెలిపినా కన్కయ్యపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన రామడుగు ఎస్సైపై కనీసం ఈగ గూడ ఆలలేదు. సాక్షాత్తూ రాష్ట్రానికి చెందిన ఓ మంత్రే ఆయన ఎన్కన్నంక ఈగెందు కాలుతది గని! కొట్టడమే తప్పంటే, కొట్టిన ఎస్సైని ఆ మంత్రి ఎన్కేసుకొని రావడమేందో? కుతాడి కన్కయ్య కేసు ఇలా ఉంటే.. మొన్నటికి మొన్న సునీత అనే ఓ దళిత మహిళకు నిక్కర్ తొడిగించి, కన్న కొడుకు ముందే పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిర్రు? సైబరాబాద్ కమిషనరేట్‌లోని షాద్‌నగర్ సాక్షిగా.. చేయని నేరాన్ని ఒప్పుకోవాలంటూ ఆ దళిత మహిళను ఓ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ హింసించడం దారుణం. ఇవి రెండే గాదు, బయటికిరాని థర్డ్ డిగ్రీలు ఇంకా ఎన్ని ఉన్నయో..!

***

మన తెలంగాణ మనకొచ్చినంక పదేండ్ల పాటు పోలీసు స్టేషన్లలో కొట్టుడనే మాట మాయమైంది. రాష్ట్రంల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అట్లా కొలువుదీరిందో లేదో, ఇట్లా పోలీసుల శేతులు మళ్లా లేస్తున్నయి. వాళ్ల పైత్యానికి అమాయక ప్రజలు బలైతున్నరు. ఇదైతే మంచి పద్ధతి గాదు. రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను కొనసాగించకపోతే కుతాడి కన్కయ్య పెండ్లాం లెక్కనే ప్రజలు గూడ 'మీ శేతికి జెట్టలు వుట్ట' అనే శాపనార్థాలు వెడ్తరు. ఆ శాపం అటు పాలకులకు, ఇటు పోలీసులకు కచ్చితంగా తాకుతది.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)



సుంకిశాల ప్రాజెక్టులో ఈ నెల ఒకటిన సాగర్ నీళ్ల ధాటికి కుప్పకూలుతున్న రక్షణ గోడ దృశ్యాలు

నిలువునా విరిగిపడ్డ సుంకిశాల గోడ

▸ మొదటిపేజీ తరువాయి...

పూర్తిస్థాయిలో ఓపెన్ చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. గేటు ఏర్పాటు పనులు పూర్తిస్థాయిలో చేయలేదని తెలుస్తున్నది. సాగర్‌లో నీటిమట్టం భారీగా తగ్గిన తర్వాతగానీ సుంకిశాల పనులు మొదలయ్యేలా లేవు. ఎండకాలం వరకు పనులు చేపట్టే అవకాశం లేదని స్పష్టమవుతున్నది.

హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం జలమండలి రోజుకు 270 మిలియన్ గ్యాలన్ల కృష్ణాజలాలను తరలిస్తున్నది. ఇందుకోసం నాగార్జునసాగర్ నుంచి జలాలను ఏఎమ్మార్పీ ద్వారా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి కోదండాపూర్ వద్ద నిర్మించిన నీటిశుద్ధి కేంద్రంలో శుద్ధి చేసిన తర్వాత పైప్‌లైన్ల ద్వారా నగరానికి తరలిస్తారు. అయితే నాగార్జునసాగర్‌లో కనీసంగా 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే ఏఎమ్మార్పీ మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుంది. అందుకే తరచూ వేసవిలో అత్యవసర మోటర్ల ద్వారా నీటిని పంపింగ్ చేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ జలాశయ డెడ్‌స్టోరేజీ సుమారు 492 అడుగుల నీటిమట్టం నుంచి కూడా జలాలను తరలించేందుకు వీలుగా సుంకిశాల పథకాన్ని చేపట్టారు. వాస్తవానికి ఇది 1980 దశకంలో రూపొందించిన పథకం కాగా.. స్థానిక రైతుల ఆందోళనలతో పక్కకుపెట్టారు. 2001-03లో చంద్రబాబు హయాంలో సుంకిశాల పథకాన్ని పక్కనపెట్టి, ఏఎమ్మార్పీ ద్వారా నగరానికి కృష్ణాజలాల తరలింపు పథకం మొదటి దశ పనులను పూర్తి చేశారు. అనంతరం కాలక్రమేణా మరో రెండు దశలు పూర్తయినా... సుంకిశాల పట్టాలెక్కలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2,215 కోట్లతో ఈ పథకం పనులు మొదలయ్యాయి. గత ఏడాది డిసెంబర్ వరకు పనులు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు మందకొడిగా సాగుతున్నాయి.

నీటిమట్టం పెరిగేకొద్దీ పెరిగిన ఒత్తిడి

నాగార్జునసాగర్ డెడ్‌స్టోరేజీ నుంచి సొరంగ మార్గం ద్వారా సుంకిశాల వద్ద నిర్మించిన పంపుహౌజ్ వరకు నీటిని తరలించి, అక్కడ మోటర్లతో లిఫ్టు చేసి, పైప్‌లైన్ల ద్వారా కోదండాపూర్ వరకు జలాలను తరలించడమనేది ఈ పథకం స్వరూపం. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం ఆధారంగా తెరిచేందుకుగాను మూడు స్థాయిల్లో (ఒక్కో లెవల్‌లో ఒక్కోటి చొప్పున) మూడు సొరంగ మార్గాలను నిర్మించారు. అయితే మొత్తం పథకం పనులు పూర్తయి, మోటర్లను బిగించిన తర్వాత సొరంగాలను వంద శాతం పూర్తి చేస్తారు. అప్పటివరకు నాగార్జునసాగర్ వైపు కొంతమేర తవ్వకుండా వదిలివేస్తారు. తద్వారా సాగర్‌లోని నీళ్లు సొరంగంలోకి రాకుండా ఉంటాయి. అదే విధంగా సొరంగాల ద్వారా పంపుహౌజ్‌లోకి నీళ్లు వచ్చే ప్రాంతంలో ముందు జాగ్రత్త చర్యగా భారీస్థాయి రక్షణ గోడ (రిటెయినింగ్ వాల్) నిర్మించారు. ఇప్పటికే పథకంలో భాగంగా సుంకిశాల నుంచి కోదండాపూర్ వరకు పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఎనిమిది మీటర్ల డయా (వ్యాసం)తో సొరంగ నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. 82 మీటర్ల లోతులో ఉన్న పంపు హౌజ్‌లో మోటర్ల ఏర్పాటుకుగాను ప్రాథమిక పనులను ఇటీవల మొదలుపెట్టారు. రానున్న రెండు నెలల్లోనే కొన్ని మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోయాలనే ఉద్దేశంతో అధికారులు పది, పదిహేను రోజుల కిందట మధ్యస్థాయిలో ఉన్న సొరంగంలో రక్షణగోడకు వెనక భాగాన గేట్‌ను అమర్చారు. ఎలాగూ గేటు, రక్షణ గోడ ఉన్నదనే భావనతో ఆ సొరంగాన్ని పూర్తిస్థాయిలో ఓపెన్ చేశారు. దీంతో సాగర్‌లో రోజురోజుకీ నీటిమట్టం పెరుగుతుండటంతో గేటుపై జలాల ఒత్తిడి తీవ్రమైంది. ఈ పరిణామాన్ని ఇంజినీర్లు సరిగ్గా అంచనా వేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్షణాల్లోనే కుప్పకూలిన గోడ

పంపుహౌజ్‌లో ప్రస్తుతం మోటర్ల బిగింపునకు సంబంధించిన సివిల్ పనులు జరుగుతున్నట్టు తెలిసింది. ఇందుకోసం పంపుహౌజ్‌లో వందమందికిపైగా కార్మికులు పని చేస్తున్నారు. మూడు షిఫ్టుల్లో ఈ సంఖ్యలోనే కార్మికులు ఉంటారు. ఉదయం ఆరు గంటలకు పనిలోకి వచ్చిన వారు సాయంత్రం ఆరు గంటలకు, అప్పుడు పనిలోకి వచ్చిన వారు మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకు పని నుంచి వెళ్లిపోతారు. ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకు వందమందికిపైగా కార్మికులు షిఫ్టు ముగించుకొని పంపు హౌజ్ నుంచి వాహనంలో బయటికి వస్తున్నారు. వారు పంపుహౌజ్ నుంచి బయటికి వచ్చిన సమయంలోనే పెద్ద పెద్ద శబ్దాలతో ఒక్కసారిగా రక్షణ గోడ కుప్పకూలిపోయింది. అంటే సొరంగంలో నుంచి కృష్ణాజలాలు ఉవ్వెత్తున ఎగిసి వచ్చి గేటును తన్నుకొని, రక్షణ గోడను కూల్చి పంపుహౌజ్‌లోకి తన్నుకొచ్చాయి. షిఫ్టు మారే సమయం కావడంతో అప్పటివరకు పని చేసిన కార్మికులు వెళ్లిపోతున్నారు... వచ్చే వారు ఇంకా రాలేదు. అర గంట ముందైనా, తర్వాతనైనా ఈ ఘటన జరిగి ఉంటే ప్రాణ నష్టం భారీగా ఉండేదని ప్రత్యక్షసాక్షి ఒకరు చెప్పారు. కండ్ల ముందే రక్షణ గోడ కుప్పకూలి పంపుహౌజ్ మొత్తం జలమయం అయిందని తెలిపారు. అప్పటికే అందులో ఒక భారీ క్రేన్, టిప్పర్లు, ఇతర పరికరాలు ఉన్నట్టు తెలిసింది. దీంతో రూ.కోట్లల్లోనే నష్టం వాటిల్లినప్పటికీ, అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.

అంచనా లోపంతోనే ప్రమాదమా?

ప్రమాదం జరగడం వెనక ఇంజినీర్ల అంచనా లోపమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వాస్తవానికి నాగార్జునసాగర్‌లో ఇంతస్థాయిలో నీటిమట్టం ఉండటంతోపాటు లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్న సమయంలో సొరంగం పూర్తిస్థాయిలో ఓపెన్ చేయకుండా ఉండాల్సిందని పలువురు సూచిస్తున్నారు. ఆ సమయంలో సాగర్‌లో సుమారు 528 అడుగుల నీటిమట్టం ఉండటంతోపాటు శ్రీశైలం నుంచి రెండు లక్షల క్యూసెక్కులకుపైగా వరద వచ్చి చేరుతున్నది. ఈ సమయంలో దాదాపు 462-580 అడుగుల స్థాయిలో ఉండే సొరంగంలో గేటు అమర్చి, పూర్తిస్థాయిలో ఓపెన్ చేయడం వల్లనే జలాల ఒత్తిడికి అవి తాళలేకపోయాయని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. మరోవైపు మిడిల్ టన్నెల్‌లో రక్షణ గోడ వెనక గేటు అమర్చిన అధికారులు... పంపుహౌజ్ స్లాబ్ పూర్తయిన తర్వాత దాని నుంచి గేటుకు టైబీమ్స్ నిర్మించాల్సి ఉన్నదని, ఆ పనులు పూర్తయిన తర్వాత సొరంగం పూర్తిస్థాయిలో ఓపెన్ చేస్తే బాగుండేదని మరికొందరు ఇంజినీర్లు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి సాగర్‌లో ఇంత నీటిమట్టం, ఈస్థాయి వరద ఉన్న సమయంలో చేపట్టాల్సిన ప్రక్రియ కాదని మాత్రం పలువురు చెప్తున్నారు. పంపుహౌజ్‌లో పూర్తిస్థాయిలో నీళ్లు ఉండటం, మరోవైపు నానాటికీ సాగర్‌లో నీటిమట్టం గణనీయంగా పెరుగుతుండటంతో రానున్న సమీప కాలంలో పంపుహౌజ్ ఖాళీ అయ్యే అవకాశం లేదు. ఎగువ నుంచి వస్తున్న వరదల వల్ల ఈసారి సాగర్ పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉన్నది. దీంతో వచ్చే ఎండాకాలంలోగానీ ప్రాజెక్టులో నీటిమట్టం 510 అడుగులకు దిగిరాదు. ఆ సమయంలో మాత్రమే పంపుహౌజ్‌లో నీటిని ఖాళీ చేసే అవకాశం ఉంటుందని ఇంజినీర్లు భావిస్తున్నారు. ఇలా కాకుండా అధునాతన పద్ధతుల్లో భారీ మోటర్ల ద్వారా నీటిని తోడాలన్నా... ముందుగా సొరంగంలోకి నీళ్లు రాకుండా అడ్డుకట్ట వేయడమనేది పెను సవాల్‌వంటిదని అంటున్నారు. ఘటన జరిగి వారం రోజులైనా జలమండలి అధికారులు మాత్రం విషయాన్ని బయటికి పొక్కనీయకుండా గోప్యంగా ఉంచారు. దీనిపై 'నమస్తే తెలంగాణ' సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ సంబంధిత ఇంజినీర్లు అందుబాటులోకి రాలేదు.

8 జిల్లాల్లో లోటు వర్షపాతం

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ) : నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్ర సగటు వర్షపాతం ఆశాజనకంగా ఉన్నా కొన్ని జిల్లాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఆగస్టు మొదటి వారం ముగిసే వరకు కామారెడ్డి, జనగామ, సంగారెడ్డి, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మేడ్చల్‌మల్కాజిగిరి, యాదాద్రిభువనగిరి జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జూన్1 నుంచి మంగళవారం వరకు సాధారణ వర్షపాతం 401.8 మి.మీ ఉండగా, సగటు వర్షపాతం 487.4 మి.మీగా నమోదైంది. ఆగస్టు మొదటి వారం వరకు 40 మండలాల్లో-20 నుంచి-59 శాతం లోటు వర్షపాతం నమోదైంది. 8 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జూలై రెండో వారం నుంచి కురుస్తున్న ఓ మోస్తరు వానలతో పరిస్థితి ఆశాజనకంగా మారినా ఇప్పటికీ కొన్ని జిల్లాల్లో కరువు ఛాయలే నెలకొన్నాయి. 43 మండలాల్లో 60 శాతం కంటే అధిక వర్షపాతం నమోదైనట్టు తెలిపింది. 18 జిల్లాల్లో అధిక వర్షపాతం (+20 నుంచి+59 శాతం), 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం(+19 నుంచి-19 శాతం) నమోదైనట్టు వెల్లడించింది. వీటిలో 18 జిల్లాల్లోని 230 మండలాల్లో 20 నుంచి 59 శాతం కంటే అధిక వర్షపాతం నమోదవగా, మరో 15జిల్లాల్లోని 299 మండలాల్లో +19 నుంచి -19 శాతం నమోదైంది.

జిల్లాల వారీగా వర్షపాతం వివరాలు..

జిల్లా	సాధారణ వర్షపాతం(మి.మీ)	వాస్తవ వర్షపాతం(మి.మీ)	తేడా శాతంలో
1.జోగులాంబ-గద్వాల	207.8	318	53
2.వనపర్తి	243.9	373.8	53
3.నారాయణపేట	244.9	372.8	52
4.ములుగు	648.3	943.9	46
5.మహబూబ్‌నగర్	248.3	357.7	44
6.కరీంనగర్	409.2	564.3	38
7.జయశంకర్-భూపాలపల్లి	537.4	741.6	38
8.భద్రాద్రి-కొత్తగూడెం	535.4	722.2	35
9. నాగర్‌కర్నూల్	224.6	300.7	34
10.పెద్దపల్లి	504.8	678.8	34
11.జగిత్యాల	483.8	617.6	28
12.కుమ్రంభీం ఆసిఫాబాద్	592.2	752.7	27
13.ఖమ్మం	421.1	534.4	27
14.నిజామాబాద్	489.5	600.4	23
15.వికారాబాద్	320.1	392.5	23
16.నల్లగొండ	230.2	281.3	22
17.హనుమకొండ	463.1	565.7	22
18.రాజన్న సిరిసిల్ల	400.7	484.1	21
19.నిర్మల్	532.1	633.3	19
20.ఆదిలాబాద్	600.1	690.8	15
21.సిద్దిపేట	324.5	367.0	13
22.మహబూబాబాద్	442.8	501.4	13
23.మంచిర్యాల	538.4	597.4	11
24.సూర్యాపేట	300.4	331.9	10
25.వరంగల్	479.9	522.9	9
26.కామారెడ్డి	451	450.2	0
27.జనగామ	380.4	371.2	-2
28.సంగారెడ్డి	351.3	331.9	-6
29.హైదరాబాద్	313.0	295.1	-6
30.రంగారెడ్డి	265.9	245.9	-8
31.మెదక్	379.3	346.4	-9
32.మేడ్చల్-మల్కాజిగిరి	309.4	276.1	-11
33.యాదాద్రి-భువనగిరి	274.1	242.0	-12
మొత్తం	401.8	487.6	51



భద్రాద్రి జిల్లా భద్రాచలంలోని రామాలయ పరిసరాల్లోకి నిలిచిన వర్షపు నీరు

భద్రగిరిని ముంచెత్తిన వాన

న్యూస్ నెట్‌వర్క్: ఎడతెరిపిలేకుండా బుధవారం కురిసిన వర్షానికి భద్రాచలం మునిగింది. రామాలయ పరిసరాలు, అన్నదాన సత్రంలోకి వరద వచ్చిచేరింది. ఆలయ కొండపై ఉన్న కుసుమ హరినాథబాబా ఆలయ కల్యాణమండపం కుంగిపోయింది. భద్రాద్రి జిల్లా గరిమల్లపాడులో అత్యధికంగా 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కిన్నెరసాని, తాలిపేరు జలాశయాల్లోకి భారీగా వరదనీరు చేరడంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. మహబూబాబాద్‌లోని ఉత్తరతండా పంచాయతీ నేతాజీ తండా పాఠశాల గదుల్లోకి వరద చేరింది. డోర్నకల్ శివారు మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరంగల్ జిల్లా ఖానాపురంలోని పాకాల సరస్సు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 29.9 అడుగులకు చేరుకుంది.



భీమా డీ-1 కెనాల్‌కు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

మూడు రోజులు భారీ వర్షాలు

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ఉత్తర, దక్షిణ ద్రోణి రాయలసీమ నుంచి అంతర్గత తమిళనాడు మీదుగా కోమరిన్ ప్రాంతం వరకు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నదని, దీని ప్రభావంతో తెలంగాణ వైపు గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడన ప్రభావంతో పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. హైదరాబాద్‌లో వాతావరణం పొడిగా ఉంటుందని చెప్పారు. 24 గంటల్లో రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, ములుగు, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి.



సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్‌లోని అన్నపూర్ణ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి బయటికి దుంకుతున్న గోదావరి జలాలు

కాళేశ్వరం జలాల ఎత్తిపోత

ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 7 : కాళేశ్వరం లింక్-2లో గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. పదకొండు రోజులుగా ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరుకు పరిగెత్తుతున్న జలాలు, బుధవారం నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయనాయక సాగర్‌కు పరుగులు తీస్తున్నాయి. దిగువన కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-2లోని నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి.

తుంగతుర్తి రైతుల కాళేశ్వర యాత్ర

▸ మొదటిపేజీ తరువాయి...

ప్రాజెక్ట్ వద్దకు వచ్చారు. అప్పటికే కాకతీయ కాలువకు నీటిని విడుదల చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి.. వారిని గమనించి పలుకరించారు. ఇక్కడి వరకు ఎందుకు వచ్చారని ఆరా తీయగా.. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ నుంచి తుంగతుర్తికి నీళ్లు ఇస్తలేరని, దీంతో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. కాళేశ్వరం నీళ్లు తుంగతుర్తి వరకు తీసుకొచ్చి తమ పంటలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. కాళేశ్వరం నీళ్లు ఇస్తే ఎక్కడ కేసీఆర్‌కు పేరువస్తుందోనని ఆలోచించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటర్లు ప్రారంభించి అన్నారానికి, అక్కడి నుంచి సుందిళ్లకు నీళ్లు తరలించాలని సూచించారు. మధ్యలో ఎక్కడా నిల్వ ఉంచకుండా ఎంఎండీ, ఎల్ఎండీ నుంచి కాకతీయ ఫేజ్-2 ద్వారా తుంగతుర్తి వరకు నీళ్లు తరలించవచ్చన్నారు. ఎస్సారెస్పీ నుంచి తుం గతుర్తి వరకు నీళ్లు ప్రస్తుతం రావడం కష్టమని వేముల చెప్పడంతో రైతులు నిరాశకు లోనయ్యారు.

పంటలు ఎండిపోతున్నయి

నాలుగెరాల్లో వరి ఏసిన. రెండెకరాలు పండుతుంది. రెండకరాలు ఎండుతున్నది. బోర్లతోనే పంటలను ఏసినం. కాని ఆ నీళ్లు సరిపోతలేదు. బోనస్ ఇస్తనంటే నాలుగెకరాల్ల వరి ఏసిన. అదికూడ సరిగా పండుత లేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు కాళేశ్వరం నీళ్లు మాదాంక అచ్చినయి. ఇప్పుడెందుకు అస్తలేవని మా ఊరునుంచి పది మంది రైతులం బయలుదేరినం. కాళేశ్వరం నుంచి పోచంపాడ్ దాంక చూస్కుంట అచ్చినం.

- నెహ్రూ, బండరామారం

నీళ్లియ్యాలి

చెర్లల్ల నీళ్లు లేవు. కాలువల్ల నీళ్లస్తలేవు. పంటలెట్ల పండించాలె. బోర్లనే నమ్ముకుంటే పంటలు పండేటట్ల లేదు. మునుపు పంటలకు నీళ్లు ఎట్లిచ్చిండ్రో ఇప్పుడుగూడ గట్లనే నీళ్లియ్యాలె. పోచంపాడ్ నుంచైనా మాదాంక నీళ్లిస్తరేమోనని అడిగితే ఇక్కడ్నుంచి కూడా నీళ్లు రావంటుండ్రు. అందుకే ఇంతకుముందు ఎట్లైతే నీళ్లిచ్చిండ్రో ఇప్పుడగూడ గట్లనే నీళ్లియ్యమని కోరుతున్న.

- సూర, రైతు, బండరామారం



పురుటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని జోరువానలో జడ్డీపై మోసుకొస్తున్న ఆదివాసీలు

జడివానలో జడ్డీపై నిండు గర్భిణి

- **మూడు కి.మీ. మోసుకెళ్లిన ఆదివాసీలు**

చర్ల, ఆగస్టు 7: పురిటినొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని ఓ జడ్డీలో కూర్చోబెట్టుకొని జడివానలో దవాఖానకు తరలించిన ఘటన భద్రాద్రి జిల్లాలో బుధవారం చోటుచేసుకున్నది. చర్ల మండలం బోదనెల్లి పంచాయతీ బూరుగుపాడుకు చెందిన ఆదివాసీ రవ్వ ఇడమ భార్య ఉంగి నిండు గర్భిణి. బుధవారం పురిటినొప్పులు రావడంతో ఓ జడ్డీని కట్టి అందులో ఆమెను కూర్చోబెట్టారు. మూడు కిలోమీటర్లు ఆమెను జడ్డీపై మోస్తూ ప్రధాన రహదారి వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి అంబులెన్సులో సత్యనారాయణపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ఆమె ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చింది. కాగా, రవ్వ ఉంగికి ఇది మూడో కాన్పు. మొదటికాన్పులో బాబు, రెండో కాన్పులో ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని, తాజాగా మూడో కాన్పులోనూ కవల ఆడపిల్లలు జన్మించినట్టు వారి బంధువులు తెలిపారు.